

- అసెంబ్లీ నియోజకవర్గాల్లో 115 మంది పోటీ
- నెల్లూరు పార్లమెంటుకు 14 మంది..
- అందరికీ గుర్తుల కేటాయింపు

- ముగిసిన నామినేషన్ల పర్వం

బరిలో వీరు..
ఇక ప్రచారాల జోరు!



నెల్లూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సంగ్రామం కీలక దశకు చేరుకుంది. ప్రధాన ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ సోమవారం ముగిసింది. 12 రోజులపాటు కొనసాగిన ఈ ప్రక్రియ పూర్తి కావడంతో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల లెక్క తేలింది. ఏ నియోజకవర్గంలో ఎవరెవరు తలపడబోతున్నారన్న విషయంలో స్పష్టత వచ్చింది. ప్రధాన పార్టీల అభ్యర్థుల విషయం ఎప్పుడో తేలిపోగా, వారికి ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా ఎవరెవరు పోటీ ఇవ్వబోతున్నారన్నది ఆసక్తిగా మారింది. ఒక్క నెల్లూరు పార్లమెంటుకే 14 మంది పోటీ పడుతున్నారు. అందులో ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీలకు కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి పోటీ ఎదురవుతోంది. ఒకే ఒక్క స్వతంత్ర అభ్యర్థి కూడా బరిలో ఉన్నారు. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 115 మంది పోటీ పడుతుండటం విశేషం. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ అభ్యర్థులు 16 మందికి 99 మంది ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు పోటీ ఇవ్వబోతున్నారు. ఏ నియోజకవర్గంలోనూ 11 మందికి తక్కువ లేరు. ఇదే ఇప్పుడు పోలింగ్ రోజున కీలకం కాబోతోంది. వీరు ఏ మేరకు ఓటింగ్‌ను చీల్చుతారు? ఆ ప్రభావం ప్రధాన పార్టీల్లో ఎవరిపై పడుతుంది? అన్నది ఆసక్తిగా మారింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితా తేలిపోవడంతో ఇక ప్రచారాలు మరోస్థాయికి చేరుకోనున్నాయి. గడిచిన నెలన్నరగా పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా జోరుగా ప్రచారాలు సాగుతున్నాయి. మే 13న ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. అంటే ఇక గట్టిగా రెండు వారాలు మాత్రమే సమయం ఉంది. మే 11వ తేదీతో ప్రచారాలు ముగించాల్సి ఉంటుంది. ఇక మిగిలింది పన్నెండు రోజులే కావడంతో బరిలో నిలిచిన అభ్యర్థులంతా ఈ సమయం మొత్తం ప్రజల మధ్యనే తిరుగుతారనడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు. ప్రచారాలు కూడా పోటాపోటీగా సాగనున్నాయి. ఒక ప్రాంతంలో ఉదయం ఒక అభ్యర్థి, మధ్యాహ్నం మరో అభ్యర్థి, సాయంత్రం ఇంకో అభ్యర్థి ప్రచారం చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రచారాలు కూలీలకు పని కల్పించనున్నాయి. ఇప్పటికే రోజువారీ కూలీ ఇచ్చి ప్రచారానికి తీసుకెళుతుండగా, ఇటువంటి వారి సంఖ్య ఇకపై పెరగనుంది.

అసెంబ్లీ	దాఖలైన నామినేషన్లు	తిరస్కరణ	ఉపసంహరణ	బరిలో ఉన్నవారు
సర్వేపల్లి	17	4	-	13
నెల్లూరు రూరల్	13	1	1	11
నెల్లూరు సిటీ	28	8	3	15
కావలి	25	10	2	13
కందుకూరు	25	1	2	22
ఉదయగిరి	22	6	1	15
కోవూరు	28	9	6	13
ఆత్మకూరు	15	2	-	13
మొత్తం	171	41	15	115
నెల్లూరు (ఎంపీ)	21	6	1	14

నెల్లూరు పార్లమెంటు అభ్యర్థులు

వ.నెం.	అభ్యర్థి	పార్టీ	గుర్తు
1.	కొప్పుల రాజు	కాంగ్రెస్ పార్టీ	హస్తం
2.	వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి	తెలుగుదేశం	సైకిల్
3.	నాసిన భాస్కర్	బహుజన సమాజ్ పార్టీ	ఏనుగు
4.	వేణుంబాక విజయసాయిరెడ్డి	వైఎస్ఆర్‌సీపీ	సీలింగ్ ఫ్యాను
5.	గాజుల సోమశేఖర్	జైభారత్ నేషనల్ పార్టీ	టార్చ్‌లైట్
6.	తలారి వెంకయ్య	జైభీమ్‌రావ్ భారత్ పార్టీ	కోటు
7.	నక్క దినేష్	భారత చైతన్య యువజన పార్టీ	చెరుకు రైతు
8.	పుంగనూరు ప్రసన్నగణపతి	రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా	కత్తెర
9.	మల్లేపల్లి రఘు	నవరంగ్ కాంగ్రెస్‌పార్టీ	బకెట్
10.	వివేక్ మన్నేపల్లి	రెవెల్యూషనరీ సోషలిస్టుపార్టీ	పారా పలుగు
11.	షేక్ మహబూబ్‌బాషా	రిపబ్లిక్‌పార్టీ ఆఫ్ ఇండియా(ఎ)	కుట్టు మిషన్
12.	షేక్ ముజబూర్ రెహమాన్	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	టెలివిజన్
13.	షేక్ షఫి అహ్మద్	ఆలిండియా ఫార్వాడ్ బ్లాక్	సింహం
14.	కొప్పాల రఘు	స్వతంత్ర	గ్యాస్ సిలిండర్

● బరిలో 129 మంది

నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను అధికారులు వెల్లడించారు. నెల్లూరు పార్లమెంటు, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు 129 మంది పోటీలో నిలబడ్డారు. నెల్లూరు పార్లమెంటుకు 21 మంది నామినేషన్లు దాఖలు చేయగా స్క్రూటినీలో ఆరు తిరస్కరణకు గురయ్యాయి. మరొకరు విత్‌డ్రా చేసుకోవడంతో తుది బరిలో 14 మంది నిలిచారు. ఆ వివరాలను నెల్లూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్ వెల్లడించారు. గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు వారి పార్టీ గుర్తులు కేటాయించగా స్వతంత్రులకు ఎన్నికల నిబంధల ప్రకారం గుర్తులు కేటాయించారు. కాగా ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా 25వ తేదీ వరకు స్వీకరణ ప్రక్రియ జరిగింది. 26న పరిశీలన, సోమవారం ఉపసంహరణకు అవకాశం కల్పించారు.

● లోకేష్, షర్మిల రాక

నామినేషన్ల ఘట్టం ముగియడంతో అభ్యర్థుల విజయం కోసం ప్రధాన పార్టీల నేతలు జిల్లాకు రానున్నారు. ఇప్పటికే టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, వైసీపీ అధినేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభలు నిర్వహించారు. కాగా, బుధవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, 5వ తేదీన పీసీసీ చీఫ్ వైఎస్. షర్మిల జిల్లాకు రానున్నారు.

మే, జూన్ నెలల్లో బ్యాంకు ఖాతాల్లో పింఛను

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 29 : ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మే, జూన్ నెలల్లో సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ సాంబశివారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకు అకౌంట్ ఉండి ఆధార్ నంబర్‌తో మ్యాపింగ్ కాబడి ఉంటే వారి ఖాతాలకు డీబీటీ పద్ధతిలో నేరుగా పింఛను నగదు జమ అవుతుందని తెలిపారు. అలా జమ అయిన వివరాలు సంబంధిత సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ఏదైనా సమస్య వస్తే సచివాలయ సిబ్బంది ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. డీబీటీ పద్ధతిలో బ్యాంకులో నగదు జమకాని వారికి 5వ తేదీలోపు ఇంటి వద్దనే పింఛను అందిస్తారని తెలిపారు. బ్యాంకు అకౌంట్ లేని పింఛను దారులకు, వికలాంగులకు, కదలలేని స్థితిలో ఉన్నవారికి, ఆరోగ్య పింఛన్లు, సైనిక సంక్షేమ పింఛన్‌దారులకు వారి ఇంటి వద్దనే సచివాలయ రెగ్యులర్ సిబ్బంది పింఛను నగదు మే 1వ తేదీ ఉదయం నుంచే పంపిణీ చేస్తారని తెలిపారు. జిల్లాలో 3,15,423 మంది పింఛను దారులు ఉన్నారని, వారికి రూ.94.38 కోట్లు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఇంటివద్దనే పంపిణీ చేయు పింఛన్లు 79,734 ఉన్నాయని, 235689 మందికి బ్యాంకు అకౌంట్‌ల ద్వారా పింఛను నగదు జమ చేస్తామని పీడీ తెలిపారు.

భయపెట్టిన అగ్నికీలలు

- నగరంలో భారీ అగ్ని ప్రమాదం
- భయంతో రోడ్లపైకి జనం పరుగులు
- మూడు ఫైరింజన్లతో అదుపులోకి..
- ఆక్వాసామగ్రి గోదాములో ఘటన
- అనుమతులు లేకుండా గోడౌన్ నిర్వహణ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 29: ప్రశాంతంగా ఉండే నెల్లూరులోని విజయమహల్ గేటు సెంటర్‌లో సోమవారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా 10 మీటర్లకుపైగా ఉవ్వెత్తున ఎగిసిపడిన మంటలు, పొగను చూసిన ప్రజలు ఇళ్లు, దుకాణాల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లు, దుకాణాలు, వైద్యశాలలల మధ్య ఆక్వా రంగానికి చెందిన సామగ్రి ఉన్న గోదాములో ఈ ప్రమాదం జరిగింది. అక్కడన్నీ ప్లాస్టిక్ సామాన్లు ఉండడంతో మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. మంటలు చుట్టుపక్కల భవనాలకు వ్యాపించకుండా సరైన సమయంలో అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్లతో వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదాన్ని చూసిన ప్రజలు అక్కడ ఆక్వా సామగ్రి నిల్వఉంచే గోదాము ఉందన్న విషయమే తమకు తెలియదన్నారు. ఓ ఫర్నిచర్ దుకాణం, పండ్లరసాల దుకాణం మాత్రమే ఉన్నాయనుకుంటున్నామని వారు పేర్కొన్నారు. గతంలో ఈ గోదాము ఉన్న ప్రాంతంలో ఓ డాబాను నిర్వహించారు. అయితే దాన్ని మూసేయడంతో ఆ గోదాము ఖాళీగా ఉందని భావించామన్నారు.

● భయంతో పరుగులు



అలుముకున్న పొగ

అప్పటి వరకు ప్రశాంతంగా ఉన్న విజయమహల్ గేటు ప్రాంతం సోమవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో బీభత్సంగా మారింది. విజయమహల్ గేటు సెంటర్‌లోని ఓ స్వీట్‌షాపు ఎదురుగా కనకదుర్గ మెటల్స్ దుకాణానికి చెందిన గోదామును జేకే హరీష్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నారు. ఆ గోదాముకు ముందు ఓ ఫర్నీచర్ షాపు, పండ్ల రసాల దుకాణం ఉన్నాయి. ఆ దుకాణాల వెనుక వైపు నుంచి ఉదయం 10.20 గంటల ప్రాంతంలో పొగలు వస్తున్నాయంటూ ఆ అంగళ్ల సిబ్బంది బయటకు పరుగులు తీశారు. కొద్దిసేపటికే ఆ ప్రాంతంలో మంటలతో పాటు దట్టమైన పొగ కమ్ముకుంది. దీంతో చుట్టుపక్కల ఇళ్లవారు, షాపుల్లోని వారు భయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. ప్రమాదం జరిగిన రేకుల గోదాము పక్కనే ఓ ప్రైవేటు వైద్యశాల ఉండటంతో అందులోని వైద్యులు, రోగులు, సిబ్బంది కూడా బయటకు పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు.

ప్రాణాలకు తెగించి..



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది క్షణాల్లో ఘటనాస్థలానికి చేరుకున్నారు. మూడు ఫైర్‌ఇంజన్ల సాయంతో సిబ్బంది రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఏడీఎఫ్‌వో వేణుగోపాల్ రావు ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుళ్లు మస్తానరావు, హరిబాబులు మంటలను అదుపు చేయడంలో తీవ్రంగా శ్రమించారు. కానిస్టేబుల్ ఈ రామకృష్ణ అత్యంత ధైర్యసాహసాలతో శ్లాబు పెచ్చులు ఊడిపడు తున్నా లోపలికి చొచ్చుకుపోయి మంటలను అదుపు చేశారు. సంఘ టన స్థలాన్ని డీఎఫ్‌వో వాకా శ్రీనివాసరెడ్డి పరిశీలించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించి నట్లు తెలిసింది. ఆక్వా పరిశ్రమలో వినియోగించే ప్లాస్టిక్ నెట్‌లు, థర్మాకోల్ షీట్స్, బోట్‌లు, పట్టలు, నైలాన్ రోప్స్ ఈ ప్రమాదంలో కాలిపోయాయి. దీంతో రూ.40 లక్షలు నష్టం వాటిల్లిందని గోదాము యజమాని తెలిపారు. తనకు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని ఫర్నీచర్ దుకాణం యజమాని మస్తానయ్య అగ్నిమాపక అధికారులకు తెలిపారు. కాగా గోదాము పైకప్పునకు వినియోగించిన రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

● 2019లోనూ భారీ అగ్నిప్రమాదం

2019 అక్టోబరు 27న నగరమంతా దీపావళి జరుపుకుంటుండగా చిన్నబజారులోని ఓ మెటల్ దుకాణంలోనూ భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో చెలరేగిన మంటలను ఆర్పేందుకు అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బందికి 24 గంటల సమయం పట్టింది. 9 ఫైర్‌ఇంజన్లతో క్షణం తీరిక లేకుండా శ్రమిస్తేకాని మంటలు అదుపులోకి రాలేదు. ఈ ప్రమాదంలో ఐదు అంతస్థుల భవనం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదం జరిగిన ఐదేళ్ల తర్వాత సోమవారం తాజాగా ఈ ప్రమాదం సంభవించింది. ఈ రెండు భారీ అగ్ని ప్రమాదాలతో నగర ప్రజలు వణికి పోతున్నారు.

'అమృతం' ఆలస్యమైంది!

కావలిలో రూ.86.11 కోట్ల పథకం నిర్వీర్యం

తాగునీటిపై విషం చిమ్మిన పాలకులు

- టీడీపీ ప్రభుత్వంలోనే 85 శాతం పనుల పూర్తి
- వైసీపీ పాలనలో పైలాన్ ధ్వంసం



ముసునూరు జడ్పీ స్కూల్ రోడ్డులో నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంక్

కావలి (టౌన్), ఏప్రిల్ 29: ఆలస్యం అమృతం విషం అన్న పెద్దల మాటలను అధికార పార్టీ నేతలు పాటించి అక్షరాల నిజమని నిరూపించారు. కావలి పట్టణ ప్రజల దాహార్తి తీర్చే చిరకాల కోరిక తీరే సమయం ఆసన్నమైందనుకున్న తరుణంలో రూ.86.11 కోట్లతో చేపట్టిన అమృత్ పథకంపై విషం చిమ్మారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కేంద్ర ప్రభుత్వం నుంచి కావలి వాసుల దాహార్తి తీర్చేందేకు అమృత్ పథకాన్ని మంజూరు చేయించారు. ఈ పథకం ద్వారా రూ.57కోట్లు తాగునీటి పనులకు, రూ.29.11 కోట్లు నీటి శుద్ధి ప్లాంట్‌కు మంజూరయ్యాయి.

● అప్పట్లోనే 85 శాతం పనుల పూర్తి

టీడీపీ పాలనలో నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి ముసునూరు జడ్పీ పాఠశాల వీధిలో, బాపూజీనగర్ మున్సిపల్ పార్కు స్థలంలో, వెంగళరావునగర్‌లో, ముసునూరు ఇందిరమ్మ కాలనీలో, పట్టణ ఉత్తరంపేటలలో 5 ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించారు. ట్యాంక్‌ల వద్ద ప్రధాన వాల్వుల ఏర్పాటు, పట్టణ పరిధిలో పైపులైన్ లేని ప్రాంతాల్లో పైప్‌లైన్ల నిర్మాణం పూర్తయ్యాయి. పైపులైనుల అనుసంధాన ప్రక్రియ పూర్తయితే నూరుశాతం పనులు పూర్తయినట్లే. ఈ క్రమంలో ప్రభుత్వ మారింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ఒక్కటంటే ఒక్క పైపు కూడా అనుసంధానం చేయకుండా బృహత్తరమైన తాగునీటి పథకాన్ని నిర్వీర్యం చేశారు.

● తుమ్మలపెంట రోడ్డు వద్ద రూ.29.11 కోట్లతో నిర్మించిన నీటి శుద్ధి ప్లాంట్ పనులు పూర్తయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని ప్లాంట్ పనులు ప్రారంభించుకునే తరుణంలో ఎన్నికలు సమీపించడంతో ప్లాంట్ ప్రారంభానికి నోచుకోలేదు.



వాటర్ ట్యాంక్ వద్ద పైపులు అమర్చకుండా వదిలేసిన ప్రధాన వాల్వు

● పైలాన్ ధ్వంసం

ట్రంకురోడ్డులోని అగ్నిమాపక కేంద్రం రోడ్డు వద్ద నిర్మించిన పైలాన్‌ను అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ మూకలు ఆనవాళ్లు కూడా కనిపించకుండా రాత్రికి రాత్రే ధ్వంసం చేశారు. పోలీసులు ఇప్పటికీ నిందితులను పట్టుకుని శిక్షించిన పాపాన పోలేదు.

● టీడీపీకి మైలేజ్ వస్తుందనే..

పట్టణ ప్రజల దాహార్తి తీర్చే బృహత్తర పథకమైన అమృత్ పథకం పూర్తయి ప్రజల నోటికి నీరందితే టీడీపీకి గుర్తింపు వచ్చి మైలేజ్ పెరుగుతుందన్న అక్కసుతోనే వైసీపీ పాలకులు పథకం ప్రకారం మిగిలిన 15శాతం పనులు పూర్తి చేయకుండా అడ్డుకుని 5ఏళ్లు కుంటి సాకులు చెబుతూ కాలం వెళ్లబుచ్చారు. పథకం ఎందుకు ఆగిపోయింది.. ఎప్పుడు పూర్తవుతుందన్న వివరాలపై అధికారుల మౌనమే సమాధానంగా మారింది.



గుక్కెడు నీళ్లు లేవయ్యా!

కళ్ల ముందు ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉన్నా గుక్కెడు నీళ్లు లేవు. ఆరేళ్ల క్రితమే మా ప్రాంతంలో ట్యాంక్ నిర్మాణంతోపాటు ప్రతి వీధికి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఇక నీటి కొరత ఉండదనుకున్నాం. ఆ తర్వాత వచ్చిన వైసీపీ వాళ్లు పట్టించుకోలేదు. పెద్దోళ్ల వ్యవహారాలు మాలాంటి పేదలకేం తెలుసు. ఏంజరిగిందో ఏమోగాని నోటికాడ నీరు అందకుండా పోయాయి. ప్రజా సమస్యలు తీర్చడంలో, అభివృద్ధి, సంక్షేమంలో నేతలు పోటీ పడాలేగాని ఇలా అభివృద్ధిని అడ్డుకోవడం దారుణం.

- మరియమ్మ, ముసునూరు

ఉదయగిరిలో వైసీపీకి భారీ షాక్

- ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు టీడీపీలో చేరిక
- చంద్రబాబును సీఎం చేద్దాం : వేమిరెడ్డి



అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్లతో మెట్టుకూరు

వింజమూరు : ఉదయగిరి నియోజకవర్గంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. కలిగిరి మండలానికి చెందిన రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి నాయకత్వంలో సుమారు వెయ్యి మంది నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. వింజమూరులోని టీడీపీ కార్యాలయంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి కాకర్ల సురేష్ సమక్షంలో వారికి పార్టీ కండువా కప్పి టీడీపీలోకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి, కాకర్ల మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేసే టీడీపీని గెలిపించాలని, నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుదని, యువతకు ఉపాధి దొరుకుతుందని, పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుందని, సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయని, అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మొదట కలిగిరి మండలం అనంతపురంలోని మెట్టుకూరు చిరంజీవి రెడ్డి స్వగృహం నుంచి భారీ బైక్ ర్యాలీతో బంబరా చెరువు దగ్గర ఉన్న కాకర్ల ట్రస్ట్ నుంచి టీడీపీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, విజయరామిరెడ్డి, చెంచలబాబు యాదవ్, నేతపాటి శాంతమ్మ, జనసేన నాయకులు కొంటే వెంకటేశ్వర్లు, మన్నేటి వెంకటరెడ్డి, బొబ్బలు వెంగళరావు, అన్ని మండలాల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

● వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో మాజీ సొసైటీ అధ్యక్షుడు జూపల్లి రాజారావు ఆధ్వర్యంలో భారీ ఎత్తున టీడీపీలోకి చేరారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తన అనుచరులతో కలిసి జూపల్లి రాజారావు టీడీపీ కండువాలు వేసుకున్నారు. మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు ఉదయగిరి

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

- ఆత్మకూరు అసెంబ్లీ బరిలో 13 మంది అభ్యర్థులు
- ఉదయగిరి సెగ్మెంట్‌లో 15మంది రంగంలో..
- అభ్యర్థులకు గుర్తులు కేటాయించిన ఎన్నికల అధికారులు

ఆత్మకూరు ఏప్రిల్ 29: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారం ముగిసింది. ఆత్మకూరులో అభ్యర్థులు ఎవరూ తమ నామినేషన్‌ను ఉప సంహరించుకోలేదు. దీంతో ఆత్మకూరు అసెంబ్లీ బరిలో 13మంది పోటీ ఉన్నారు. వీరిలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు 10మంది కాగా, మిగిలిన వారు స్వతంత్రులుగా ఉన్నారు. వీరికి అధికారికంగా నిబంధనలు మేర గుర్తులు కేటాయించారు.

ఉదయగిరిలో..

ఉదయగిరి రూరల్: సార్వత్రిక ఎన్నిక లకు సంబంధించి ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా 15మంది బరిలో ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా స్వతంత్ర అభ్యర్థి బిజ్జం కృష్ణప్రియ తమ నామినేషన్‌ను ఉపసంహరించుకొన్నారు. ఈ సందర్భంగా బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులు కేటాయించడం జరిగిందన్నారు.

ఆత్మకూరు బరిలో నిలిచిన అభ్యర్థులు

వరుస. నెం	పేరు	పార్టీ	గుర్తు
1	ఆనం రామనారాయణరెడి	టీడీపీ	సైకిల్
2	చేవూరు శ్రీధర్‌రెడ్డి	ఇండియన్ నేషనల్ కాంగ్రెస్	హస్తం
3	తోటగిరి కృష్ణ	బహుజన సమాజ్ పార్టీ	ఏనుగు
4	మేకపాటి విక్రమ్‌రెడ్డి	వైసీపీ	ఫ్యాను
5	నెల్లూరు కృష్ణారెడ్డి	యుగ తులసీ	రోడ్ రోలర్
6	బెల్లంకొండ వెంకటేష్	విశ్వజన పార్టీ	బకెట్
7	బొడ్డు రాజేశ్వరీ	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా	ఫ్లూట్
8	రామనారాయణరెడ్డి	జయ జనసేన పార్టీ	పెన్ స్టాండ్
9	రామిశెట్టి వెంకటేశ్వర్లు	సమాజ్‌వాది పార్టీ	బైసైకిల్ పంపు
10	సయ్యద్ సుకూర్	ఇండియన్ ముస్లీం లీగ్	నిచ్చెన
11	గంగినేని శ్రీనివాసులు	ఇండిపెండెంట్	బ్యాట్
12	నాగెళ్ల వెంకభానుప్రకాష్	ఇండిపెండెంట్	ల్యాప్‌టాప్
13	రామనారాయణరెడ్డి	ఇండిపెండెంట్	గ్లాస్ తుమల్‌డెర్

ఉదయగిరి నుంచి పోటీలో నిలిచిన అభ్యర్థులు

సంఖ్య	అభ్యర్థి పేరు	పార్టీ
1	క్రాకుటూరు పుష్పాంజలి	బీఎస్‌పీ
2	కాకర్ల సురేష్‌బాబు	టీడీపీ
3	సోము అనిల్‌కుమార్	కాంగ్రెస్
4	మేకపాటి రాజగోపాల్‌రెడి	వైసీపీ
5	పైడి మనోహర్	రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా
6	నల్లపనేని వెంకటేశ్వరు	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా
7	చెరుకూరు వేణుగోపాల్	స్వతంత్ర
8	డాక్టర్ మూల వెంకటరమణారెడ్డి	స్వతంత్ర
9	కేతిరెడ్డి కృష్ణకుమార్‌రెడ్డి	స్వతంత్ర
10	చేజర్ల సుబ్బారెడ్డి	స్వతంత్ర
11	దొంతిరెడ్డి నరసింహారెడ్డి	స్వతంత్ర
12	లెక్కల కొండయ్య	స్వతంత్ర
13	దుద్దుకూరు రమేష్	స్వతంత్ర
14	రావిపాటి సాంబయ్య	స్వతంత్ర
15	వింజం శ్రీకాంత్	స్వతంత్ర

దర్గాలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఏఎస్ పేట, ఏప్రిల్ 29: స్థానిక ఖాజానాయబ్ రసూల్ దర్గాలో సోమవారం దర్గా ఈవో మహమ్మద్ హుసేన్ మిన రల్ వాటర్ ప్లాంట్‌ను ప్రాంభించారు. ఈ భక్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా దర్గా ఆవరణలోనే వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. దర్గా అసిస్టెంట్ ఈవో షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

పది సీలింగ్ ఫ్యాన్ల వితరణ

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 29: పట్టణంలోని స్టేట్‌పేటలోని సెయింట్‌మార్క్స్ చిల్డ్రన్స్ హోమ్‌కు సోమవారం బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు 10సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కరమతుల్లాబాషా, ఉపాధ్యక్షులు కాంతారావు, కోఆర్డినేటర్ ఎల్ఎస్ విద్యాసాగర్, సభ్యులు అశోక్‌కుమార్, సందానీబాషా, కిశోర్ పాల్గొన్నారు.

విక్రమ్‌రెడ్డి ప్రచారంలో ఎన్ఆర్ఈజీఎస్ కంప్యూటర్ ఆపరేటర్

చేజర్ల, ఏప్రిల్ 29: వైసీపీ ఆత్మకూరు నియోజకవర్గ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం మండలంలో చేపట్టిన ప్రచారంలో ఉపాధిహామీ పథకాం (ఎన్ఆర్ ఈజీఎస్) కంప్యూటర్ ఆపరేటర్ ప్రసాద్ పాల్గొన్నారు. స్థానికులతో కలసి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన పోటోలు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై ఎంపీడీవో కరీముల్లాను వివరణ అడగ్గా ఆత్మకూరు ఆర్‌వోకి నివేదిక ఇచ్చినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి రూరల్: అప్పసముద్రం, దాసరిపల్లి, మల్లారెడ్డిపల్లి, యర్రబల్లిగుంటలో మరమ్మత్తుల దృష్ట్యా మంగళవారం ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఖుద్దూస్‌బాషా సోమవారం తెలిపారు.

వైసీపీ ప్రచారంలో అపశ్రుతి

వరికుంటపాడు, ఏప్రిల్ 29: వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టిన రోడ్ షోలో అపశృతి చోటు చేసుకుంది. బస్టాండ్ సెంటర్‌లో ప్రసంగిస్తుండగా అభిమానులు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. ఈ నేపథ్యంలో ఎగిసి పడిన నిప్పురవ్వలు సమీప పిల్లాపేరు వాగు ప్రాంతంలోని చెత్తా, చెదారానికి అంటుకున్నాయి. దీంతో ఒక్కసారిగా చెలరేగిన మంటలతో తాటిచెట్లు సైతం దగ్ధమయ్యాయి. ఇటీవల పోలీస్ చెక్‌పోస్టు కోసం ఏర్పాటు చేసిన టెంటు సైతం కొంతమేర కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు.

సోమశిల 'హై లెవెల్' ప్రారంభించింది..పూర్తి చేసేది నేనే !

- కాలువ పనుల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తా
- ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి ఆనం హామీ



మర్రిపాడు: ఆనంకు హారతిపట్టి స్వాగతిస్తున్న మహిళలు

మర్రిపాడు, ఏప్రిల్ 29: సోమశిల హైలెవెల్ కెనాల్ నేను మంజూరు చేయించి పనులు ప్రారంభించాను. ఈ పనులు పూర్తిచేస్తే ఆనంకు పేరు వస్తుందని చివరిదశలో చేయాల్సిన చోట 4సంవత్సరాల నుంచి మట్టికట్ట పనులు చేసి జేబులు నింపుకుంటున్నారని వైసీపీ అభ్యర్థి విక్రమ్‌రెడ్డిని టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన పొంగూరు, కేతిగుంట, పడమటినాయుడుపల్లి, చుంచులూరు పంచాయితీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్‌గుర్తుపై ఓటు వేసి నన్ను, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. భూములు కోల్పోయిన ప్రతిరైతుకు వడ్డీతోపాటు నష్ట పరిహారాన్ని అందిస్తామని రైతులకు ఆనం భరోసా ఇచ్చారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా జనాభా ప్రకారం 22శాతం కాలనీలల్లో నిధులు కేటాయించి, బాధ్యతాయుతంగా మౌళిక సదుపాయాలు కల్పించాలని టీడీపి ప్రభుత్వంలో చట్టం తెస్తే, ఆ చట్టాన్ని వైసీపీ ప్రభుత్వం మాయం చేసిందని మండిపడ్డారు. వైసీపీ తరుపున పోటీ చేసిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు జైలు పక్షులు. వారిని నమ్మి ఓట్లు వేయద్దు అన్నారు. విక్రమ్‌రెడ్డి మాయల పకీరు అంటూ ఆయన పనులు చేయకుండా టోల్ వసూలు చేసి రూ.150కోట్లు దోచుకున్నాడని, సొంత ఫ్యాక్టరీలో విజయసాయిరెడ్డి రూ.13లతో విషపూరితమైన మద్యం సీసాను తయారు చేసి, రూ.200కు అమ్మి మహిళల మెడలో పుస్తులు తెంచతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మీ, పుట్టం బ్రహ్మారెడ్డి, టీడీపి మండల అధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్ నాయుడు, శాఖమూరి నారాయణ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి: కర్నాటి

ఆత్మకూరు: ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్ల పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశంలో, రాష్ట్రంలో, ని యోజకవర్గ స్థాయిలో జరిగిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకుని, ఎవరికి ఓటేసి గెలిపించాలో ముందుగానే ఓ నిర్ణయానికి వచ్చివున్నారని తెలిపారు. కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు అసెంబ్లీ అభ్యర్థి ఆనం రామనా రాయణ రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరటంపాటి సుధాకర్, నాగరాజారెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.

ఆనం, వేమిరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

ఎన్డీఏ కూటమి బలపరిచిన టీడీపీ అభ్యర్థులు ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆనం కైవల్యారెడ్డి ఓటర్లను కోరారు. టీడీపీ శ్రేణులతో కలిసి ఆత్మకూరు పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆనం రామనరాయణరెడ్డి ఆత్మకూరుకు చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతసాగరం: ఇస్కపల్లిలో టీడీపీ మండలాధ్యక్షురాలు మునపాటి సునీత, తెలుగు యవత నెల్లూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కమ్మ ప్రభాకర్‌నాయుడులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొమ్మి తిరుపతినాయుడు, మాజీ సర్పంచ్ బందెల నరసింహులు, మునగపాటి ప్రతీప్, మాల్యాద్రి, అనిల్, కుమారరాజ, మహేష్, హరిబాబు పాల్గొన్నారు.

ఆమనిచిరివేళ్ల నుంచి భారీగా టీడీపీలో చేరిక

ఆమనిచిరివేళ్లకు చెందిన వైసీపీ శ్రేణులు సోమవారం టీడీపీలో చేరారు. ఆనం రామానారాయణరెడ్డి మర్రిపాడులో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. చేరిన వారిలో మాజీ సర్పంచ్ వై రమణారెడ్డి, ఎం.రమణరెడ్డి, జీ.పెదనరసింహులుతో పాటు 50 ముస్లిం మైనార్టీ కుటుంబాల వారికి ఆనం కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల నాయకుడు మెట్టుకూరు కృష్ణారెడ్డి పాల్గొన్నారు. మండలకేంద్రంలో ఎంపీటీసీ రాపూరు సుజాతమ్మ, సీనియర్ నాయుడు పాతపాటి మధుసుదన్‌రెడ్డి ఇంటింట ప్రచారం నిర్వహించారు.

చేజర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న తిరుపతినాయుడుపల్లి రామానాయుడును పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్మి లక్ష్మయ్యనాయుడు పరామర్శించారు. అనంతరం ఎస్సీ ఎస్టీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. .

నేడు ఆనం ఎన్నికల ప్రచారం

రెడ్డివారికండ్రిక, మాముడూరు, తూర్పుపల్లి, ఓబులాయపల్లి, పాతపాడు మధ్యాహ్నం యనమదల, టి.కే.పాడు, మడపల్లి గ్రామాల్లో మంగళవారం ఆత్మకూరు కూటమి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారని పార్టీ కన్వీనర్ రావి లక్ష్మీనరసారెడ్డి తెలిపారు.



అనంతసాగరం: ఆనం సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు



కలువాయిలో ప్రచారంలో వెలగపల్లి వరప్రసాదరావు

వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలి

- తిరుపతి ఎంపీ బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు

కలువాయి, ఏప్రిల్ 29: వైసీపీ పాలనలో అభివృద్ధి అనేమాటే లేకుండా పోవడంతో పాటు వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని అలాంటి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం ఆయన కలువాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. బీజేపీ పాలనలో దేశం ఎన్నడూ లేనంత అభివృద్ధి సాధించిందని, సుస్థిరతకు బీజేపీ అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. తిరుపతి ఎంపీ అయిన తనకు కమలం గుర్తు, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని కోరారు. తెలుగుదేశం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు. సామాజిక భద్రత పించన్లు నెలకు రూ.4వేలు, ఏడాది మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు నెలకు రూ.1500 నగదుతో పాటు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఎంత మంది బిడ్డలు చదువుకొంటే వారందరికీ తల్లికి వందనం ద్వారా సాయం లాంటి పథకాలు పేద ప్రజలకు ఉపయోగపడుతాయన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలో అభివృద్ధికి కృషి చేశానని మరో అవకాశం ఇస్తే అభివృద్ధిని మరింత ముందుకు తీసుకుపోతానన్నారు. ఆయన వెంట టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు గోనుగుంట వెంకటేశ్వర్లు నాయుడు, అల్లంపాటి వేణుగోపాల్‌రెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి, ఎస్.వేణుగోపాల్ నాయుడు, దండు పెంచలయ్య తదితరులు ఉన్నారు.

సోమశిలలో 8.212 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 29: సోమశిల పూర్తిస్థాయినీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. సోమవారం నాటికి జలాశయంలో 8.212 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కిలో పొగాకు రూ.291

కలిగిరి, ఏప్రిల్ 29: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు ధర గరిష్ఠంగా రూ.291 పలికింది. ఈ కేంద్రానికి రైతులు 628 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 478 బేళ్ల కొనుగోలు చేశారు. నోసేల్-1, నోబిడ్-119, ఆర్ఆర్-3, సీఆర్-14, జంపింగ్‌లాట్స్-13 కారణాలతో 150 బేళ్ల తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.291, కనిష్ఠ ధర రూ.216, సగటు ధర రూ.252.96 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

లక్ష్యాలను అధిగమించాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న జిల్లా అదనపు వైద్యఆరోగ్య శాఖాధికారి ఖాదరవల్లి

దుత్త లూరు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 29: వైద్య ఆరోగ్య సిబ్బందికి కేటాయించాలని లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ ఖాదరవలి సూచించారు. సోమవారం దుత్తలూరు, నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి వారిని గళ్ల పరీక్షా కేంద్రానికి పంపాలన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హైరిస్కు గర్భవతులను గుర్తించి వారిని ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ వేయడంలో 95 శాతం పూర్తి చేయడం హర్షణీయమన్నారు. అనంతరం మందుల, కాన్పుల గదులు, ల్యాబ్, రికార్డులు పరిశీలించి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అయూబ్‌అఫ్సర్, హరీష్, సీహెచ్‌వో ఓంకారయ్య, హెచ్‌వీ బీబీజాన్, ఎస్టీఎస్ షబ్బీర్, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్, రియాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక వైద్యశాలను జిల్లా అదనపు వైద్యాధికారి షేక్ ఖాదర్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు కరిష్మా, ఆయేషా, సీహెచ్‌వో రాజశేఖర్‌రాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ, టీబీ నివారణ సిబ్బంది ఎస్ మురళి, భోగ్యం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడిపై దాడిని అడ్డుకోబోయిన యువకుడి హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాబీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 29 : స్నేహితుడిపై దాడి చేస్తుండటంతో అడ్డుబోయిన యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన షాజిద్‌తో కుసుమ హరిజనవాడకు చెందిన రౌడీషీటర్ బాలాజీకి గొడవలున్నాయి. ఆదివారం రాత్రి షాజిద్ తన స్నేహితుడు సుల్తాన్‌తో కలిసి జాకీర్ హుస్సేన్ నగర్‌లో మద్యం సేవిస్తుండగా బాలాజీ బైక్‌పై అటుగా వెళుతున్నాడు. గమనించిన షాజిద్ బైక్‌ను అడ్డుకుని అతనిపై దాడి చేశాడు. గాయపడిన బాలాజీ ఇంటికి వెళ్లి విషయాన్ని తన సోదరుడు, రౌడీషీటర్ చంద్రతోపాటు తన వారికి తెలియజేశాడు. అందరూ కలిసి జాకీర్‌హుస్సేన్ నగర్‌కు వెళ్లి షాజిద్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న షాజిద్ స్నేహితుడు జీ రవి తేజ(24) అనే పెయింటర్ ఘటన స్థలానికి చేరుకుని నిందితులను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో నిందితులు రవితేజ తలపై కర్రతో బలంగా కొట్టడంతో తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. హత్యపై సమాచా రం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం బాబీ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రవిజేత తండ్రి శేషాద్రి ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుల కోసం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	138
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	274
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6878
వెండి కిలో ధర	రూ. 83,500
వెండి ఒక గ్రాము	రూ. 85.50

ముస్లింల సంక్షేమం టీడీపీకే సాధ్యం

టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి, కాకర్ల

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 29: ముస్లిం మైనార్టీల సంక్షేమం తెలుగుదేశం పా ర్టీకే సాధ్యమని నెల్లూరు పార్లమెంట్, ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాకర్ల సురేష్‌లు అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని చెంచలబాబు అతిథిగృహం ఆవరణలో టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ రియాజ్ అధ్య క్షతన నియోజకవర్గస్థాయి ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ముస్లింల అభ్యున్నతి కోసం కృషి చేసింది టీడీపీ ప్రభుత్వమే అన్నారు. టీడీపీ హయాంలో రంజాన్‌తోఫా, దుల్హాన్ వంటి పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృ ద్ధికి బాటలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రిజర్వేషన్‌లను రద్దు చే స్తారని వైసీపీ నాయకులు చేసే అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. టీడీపీ అధి కా రంలోకి రాగానే ముస్లింలకు సముచితస్థానం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లేసి తమను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపుతామన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం ముస్లిం మైనారిటీ నాయకులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మీ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజ యరామిరెడ్డి, జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్‌అజీజ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, శాంతకుమారి, మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లరెడ్డి, పరిశీకుడు వేనాటి సతీష్‌రెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు సందానీ, సజిల్ పాల్గొన్నారు.



వింజమూరు: ఇంటింటి ప్రచారంలో ఎస్సీ సెల్ నాయకులు



ఉదయగిరి: వేమిరెడ్డి, కాకర్ల, రియాజ్‌లను సన్మానిస్తున్న ముస్లిం నాయకులు

- **వింజమూరు** : రావిపాడులోని ఎస్సీ కాలనీలో ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గంగపట్ల వెంగయ్య ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా ప్రచారం చేసి మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షులు గంగపట్ల వెంగయ్య, ఐటీడీపీ మండల అధ్యక్షులు అరికొండ శ్రీనివాసులు, సీనియర్ టీడీపీ ఎస్సీ నాయకులు గంగపట్ల హజరత్, జిల్లా యువత కార్యదర్శి అంకి పెద్దయ్య పాల్గొన్నారు.
- **సీతారామపురం:** మండలకేంద్రంలో సోమవారం రాత్రి వేమిరెడ్డి, కాకర్ల సురేష్ ప్రచారాన్ని నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో ఆఫీస్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో కాకర్ల సురేష్, తనను మంచి మెజా రిటీతో గెలిపిస్తే, ఈ మండలానికి సీతారామ సాగర్ ద్వారా నీటిని తెచ్చే బాధ్యత తనది అని హామీ ఇచ్చారు. కాకర్ల సురేష్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు అన్ని విధా లుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి శాసన సభ్యు లు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టిడిపి మండ ల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మండల క్లస్టర్ ఇంచార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, తురక వెంకటేశ్వర్లు,చేన్నకేశవులు, జనసేన నియోజకవర్గ నాయకులు బోగినేని కాశిరావు, సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, జనసేన మండల అధ్యక్షుడు పాలిశెట్టి శ్రీనివాసులు ఉన్నారు.



సీతారామపురంలో ప్రచారం చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

విద్యుత్ తీగల్లో మంటలు

చిత్రగుంట, ఏప్రిల్ 29: బోగోలు పంచాయతీ బేతనీ పేట కమ్యూనిటీ హాల్ సమీపంలో హై టెన్షన్ విద్యుత్ తీగలో సోమవారం సాయంత్రం మంటలు రేగాయి. స్థానికులు గమనించి లైన్‌మెన్ రమేష్‌కు సమాచారాన్ని అందచేశారు. ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సప్లై నిలిపి వేసి సమస్యను పరిష్కరించారు. విద్యుత్ తీగలపై లోడ్ ఎక్కువ కావడం, లూస్ కాంటాక్ట్ వలన మంటలు రేగాయని తెలిపారు.

రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోండి

కొండాపురం, ఏప్రిల్ 29: రేషన్ డీలరుగా పనిచేస్తూ అధికార పార్టీ ప్రచార కార్యక్రమాలలో పాల్గొన్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ మండలంలోని సాయిపేట పంచాయతీ కొత్తపాలెంకు చెందిన ఓ.సుమన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రేషన్ షాపు నెంబరు-14 నడుపుతున్న ఎమ్.శ్రీను ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాలరెడ్డికి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రచారాలలో పాల్గొంటూ ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆ ఆధారాలను ఆర్వో, తహసీల్దారు, కార్యదర్శికి అందజేశామని పేర్కొన్నారు.

కందుకూరు అసెంబ్లీ బరిలో 22 మంది

● రెండు ఈవీఎం ప్యానెళ్ల ఏర్పాటు తప్పనిసరి

కందుకూరు, ఏప్రిల్ 29: కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 22మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. దీంతో రెండు ఈవీఎం ప్యానెల్స్ ఏర్పాటు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఒక్కో ఈవీఎం ప్యానెల్‌లో 16 మంది అభ్యర్థులకు మాత్రం చోటు ఉంటుంది. దీంతో అభ్యర్థుల సంఖ్యను ఎలాగైనా 16కి వచ్చేలా చేయడం ద్వారా ఓటర్లు గందరగోళానికి గురికాకుండా చూడాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు రెండురోజులుగా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కందుకూరు నియోజకవర్గంకు మొత్తం 25 మంది అభ్యర్థులు 40 సెట్లు నామినేషన్లు వేయగా టీడీపీ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య బీఫాం సమర్పించని కారణంగా రద్దయింది. దీంతో 24 మంది మిగలగా టీడీపీ నేతలపై అసంతృప్తితో నామినేషన్ దాఖలుచేసిన ఆపార్టీ నాయకుడు షేక్ రఫీని బుజ్జగించి సోమవారం ఉపసంహరింపజేశారు. అలాగే ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేసిన వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ సతీమణి లక్ష్మి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో 22 మంది బరిలో మిగలగా వారిలో కనీసం ఆరుగురిని ఉపసంహరింపజేస్తే ఒక్క ఈవీఎం ప్యానెల్‌తో ఎన్నికలకు వెళ్లవచ్చని విశ్వప్రయత్నం చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ చెరో ముగ్గురిని ఉపసంహరింపజేయాలన్న లక్ష్యంతో ప్రయత్నం చేసినప్పటికీ పోటీలో ఉన్న అభ్యర్థులు భారీగా నగదు డిమాండ్ చేసినట్లు సమాచారం. వారు ఊహకందని మొత్తాలు డిమాండ్ చేయడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో 22 మంది అభ్యర్థులు బరిలో మిగలగా రెండు ఈవీఎం ప్యానెల్స్ తప్పనిసరిగా మారింది. రెండు ఈవీఎం ప్యానెల్స్ ఉంటే నిరక్షరాస్య ఓటర్లు కొంత గందరగోళానికి గురయ్యే ప్రమాదం లేకపోలేదు.

కందుకూరు నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు

వరుస నెం.	అభ్యర్థి పేరు	రాజకీయ పార్టీ
1.	సయ్యద్ గౌస్ మొహిద్దీన్	కాంగ్రెస్
2.	బుర్రా మధుసూదన్ యాదవ్	వైసీపీ
3.	ఇంటూరి నాగేశ్వరరావు	తెలుగుదేశం
4.	పేరం సత్యనారాయణ	బీఎస్పీ
5.	ఎండ్లూరి బాలకుమార్	రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా
6.	పొడపాటి శివకుమార్	జైభారత్ నేషనల్ పార్టీ
7.	చేకూరి వెంకటకృష్ణారావు	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా
8.	జగన్నాథం శ్రీను	నీతినిజాయితీ పార్టీ
9.	గోలి పద్మజ	లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ
10.	అక్కిలగుంట ఇషాక్	స్వతంత్ర
11.	పొడపాటి హరిబాబు	స్వతంత్ర
12.	తాటికొండ రాంబాబు	స్వతంత్ర
13.	చెరుకూరి జాషువా	స్వతంత్ర
14.	ఉన్నం రాధమ్మ	స్వతంత్ర
15.	ముచ్చు శ్రీనివాసులు	స్వతంత్ర
16.	గొడుగు మాల్యాద్రి	స్వతంత్ర
17.	సయ్యద్ నసీమా	స్వతంత్ర
18.	నేతి మహేశ్వరరావు	స్వతంత్ర
19.	రాతికింద వేణు	స్వతంత్ర
20.	చల్లా వెంకటమురళీకృష్ణ	స్వతంత్ర
21.	చెన్నిబోయిన నరసింహం	స్వతంత్ర
22.	సంగా సత్యనారాయణ	స్వతంత్ర

కావలి నియోజకవర్గంలో 13 మంది పోటీ

కావలి, ఏప్రిల్ 29 : కావలి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 మంది నామినేషన్లు వేశారు. నామినేషన్ల పరిశీలన అనంతరం వివిధ కారణాలతో 10 నామినేషన్లను తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 15 మంది మిగిలారు. వారిలో సోమవారం ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు తమ నామిషన్లను ఉపసంహరించుకోవడంతో 13 మంది పోటీలో నిలిశారు.

కావలి అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులు వీరే

వ. నం	అభ్యర్థి పేరు	రాజకీయ పార్టీ
1.	గుంజి వెంకటేశ్వర్లు	బహుజన సమాజ్ పార్టీ
2.	దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి	తెలుగుదేశం
3.	పొదలకూరి కల్యాణ్	కాంగ్రెస్
4.	రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి	వైసీపీ
5.	ముప్పసాని నరేంద్ర	జై భారత్ నేషనల్ పార్టీ
6.	యెల్లు సాల్మన్	రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా
7.	సబ్బెళ్ల విజయభాస్కర్ రెడ్డి	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా
8.	అనుమాలశెట్టి హరిప్రసాద్ రావు	స్వతంత్ర
9.	గర్రె సురేష్‌బాబు	స్వతంత్ర
10.	దేవరపల్లి క్రిష్ణారెడ్డి	స్వతంత్ర
11.	పసుపులేటి సుధాకర్	స్వతంత్ర
12.	వాయిల తిరుపతి	స్వతంత్ర
13.	విడవలపాటి శ్రీనివాసులు	స్వతంత్ర

విజయసాయిరెడ్డికి ఓటేస్తే నెల్లూరుకు ముప్పు

● మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వేణుగోపాల్‌రెడ్డి

కావలి, ఏప్రిల్ 29: నెల్లూరు ఎంపీగా వైసీపీ నుంచి పోటీ చేస్తున్న ఆర్థిక నేరస్థుడైన వేణుంబాక విజయసాయిరెడ్డికి ఓటేస్తే నెల్లూరు జిల్లాకు ముప్పేనని కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జండా చెట్టు వద్ద ఉన్న టీడీపీ ఎంపీ అభ్యర్థి కార్యాలయంలో సోమవారం కూటమి నేతలతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమంగా లక్షల కోట్లు ఎలా సంపాదించాలో జగన్‌కు నేర్పి ఆయనను జైలుకు పంపిన వ్యక్తి విజయసాయిరెడ్డన్నారు. వైజాగ్‌లో రుషికొండను గుండు కొట్టించి అక్కడ అక్రమాలకు పాల్పడితే వైసీపీ నేతలే అక్కడ నుంచి తరిమి కొట్టారన్నారు. నెల్లూరులో టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిపై పోటీకి వైసీపీలో ఎవరూ ముందుకు రాకపోవడంతో విజయసాయిరెడ్డిని జగన్ నిలిపారన్నారు. ఆయన తొలుత పోటీకి వెనుకకు తగ్గగా ఆ తర్వాత నెల్లూరు కేంద్రంగా సంపాదించుకునే అవకాశాలను సిలికా, ఇసుక అక్రమ వ్యాపారం, కృష్ణపట్నం, రామాయణపట్నం ద్వారా డ్రగ్స్ దిగుమతి చేసుకుని వ్యాపారం చేసుకోవచ్చని చెప్పడంతో ఆయన పోటీకి దిగారన్నారు. ఆయనకు ఓట్లు వేసి గెలిపిస్తే నెల్లూరు జిల్లాకే పెను ముప్పు పొంచి ఉన్నందున ఆయనను జిల్లా ప్రజలు తరిమి కొట్టాలన్నారు. వేమిరెడ్డిపై ఓడిపోతామనే భయంతోనే ఆయన రాజ్యసభకు రాజీనామా చేయకుండా పోటీ చేస్తున్నారన్నారు. గెలుస్తామనే ధైర్యం ఉంటే ముందు రాజ్యసభకు రాజీనామా చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని రంగాలలో సేవా కార్యక్రమాలు చేసే నేత వేమిరెడ్డికి, దొరికిన చోటల్లా దోపిడీ చేసే ఆర్థికనేరస్థుడైన సాయిరెడ్డికి పోలిక ఎక్కడన్నారు. వేమిరెడ్డిని విమర్శించే స్థాయి విజయసాయిరెడ్డికి లేదన్నారు. ఆయనను విమర్శిస్తే జిల్లా ప్రజలు నిన్ను క్షమించరని హెచ్చరించారు. ప్రజలు ఎంపీగా ప్రభాకర్ రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థిగా కావ్య క్రిష్ణారెడ్డికి ఓటు వేసేందుకు ఎప్పుడో సిద్ధమయ్యారని చెప్పారు. ఈ సమావేశంలో జనసేన కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్, బీజేపీ నాయకురాలు పూనూరు మాధవి, టీడీపీ నేతలు మన్నవ రవిచంద్ర, గుత్తికొండ క్రిషోర్, అశోక్‌రెడ్డి, రాజా, రమణయ్య, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించాలి

● ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు

కందుకూరు, ఏప్రిల్ 29: ఈ ఎన్నికల్లో టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిలను మంచి మెజారిటీతో గెలిపించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాల వర్గీకరణ సమస్య పరిష్కారం కావాలన్నా, మాదిగల జీవితాల్లో వెలుగులు రావాలన్నా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రబాబునాయుడు గెలుపు అంటే మాదిగల గెలుపుగా చూడాలని పిలుపునిచ్చారు. గతంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో వర్గీకరణ జరిగిన ఫలితంగానే మాదిగ జాతికి 23వేల ఉద్యోగాలు వచ్చాయని, అన్నిరంగాల్లో మేలుజరిగిందని వివరించారు. జగన్మోహనరెడ్డి మాదిగలను నమ్మించి మోసం చేసిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు, వర్ల దేవదాసు, గౌడపేరు కాంతారావు, చదలవాడ కిట్టు, ఏలియా, ప్రభాకర్, బన్నీ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలు, దోపిడీ తప్ప అభివృద్ధి ఏది?



కావలి : మసీదులో ప్రార్థనలు చేస్తున్న క్రిష్ణారెడ్డి



అల్లూరు : రోడ్‌షోలో కావ్య క్రిష్ణారెడ్డి, తదితరులు

● కరప్షన్ పట్టణాన్ని కనక పట్టణంగా మారుస్తా : కావ్య

కావలి, ఏప్రిల్ 29: వైసీపీ ఐదేళ్ల పాలనలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, అరాచకాలు, దోపిడీ తప్ప ఆయన చేసిన అభివృద్ధి శూన్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని 9, 10 వార్డులలో సోమవారం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కావలిలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే అది తెలుగుదేశం పార్టీలోనేనన్నారు. అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనం తెలుగుదేశం పార్టీ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆదుకున్న పార్టీ టీడీపీయేనన్నారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రైతుల కష్టాలు తీరాలన్నా, భావితరాలకు భవిష్యత్తు రావాలన్నా, మహిళలకు అండగా నిలవాలన్నా ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రావాలన్నారు. కావలిలో ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అరాచకాలు, దోపిడీలు, దుర్మార్గాలకు అంతులేదన్నారు. ఇసుక, మట్టి, గ్రావెల్ దోపిడీ, రియల్‌ఎస్టేట్ దందా తప్ప కావలికి ఏమి చేయలేదన్నారు. రెండు పర్యాయాలుగా ఎలాంటి అభివృద్ధి చేయని ప్రతాప్‌రెడ్డికి మళ్లీ ఓటేస్తే కావలిని గంజాయి పట్టణంగా మారుస్తారన్నారు. తనకు ఒక్క అవకాశం ఇచ్చి టీడీపీని గెలిపిస్తే కరప్షన్ పట్టణంగా ఉన్న కావలిని కనక పట్టణంగా మారుస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్‌బాబు, జ్యోతి బాబూరావు, బీజేపీ నేతలు గుండ్లపల్లి భరత్ కుమార్, కుట్టుబోయిన బ్రహ్మానందం, అంచి పాకల కమల, సూనూరు మాధవి, జనసేన నేతలు పొబ్బా సాయివిఠల్, తోట శరణ్ టీడీపీ స్థానిక నాయకులు చిట్రగుంట శివప్రసాద్, ఆత్మకూరు నాగరాజు, మేడికొండ సుకుమార్, వల్లూరి వెంకట కిరణ్‌కుమార్, యల్లంటి వెంకటేశ్వర్లు, ఆసిఫ్, హఫీజ్, అల్‌హర్, మస్తాన్, తోట రమేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

● 20వ వార్డులో క్రిష్ణారెడ్డి తనయ ప్రచారం

పట్టణంలోని 20 వార్డులో సోమవారం టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తనయ సంహితారెడ్డి నాన్నకు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ ఇంటింట ప్రచారం చేపట్టారు. ఆమె వెంట మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తిరువీధి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కోడి కత్తి డ్రామాలాగే గులకరాయి డ్రామా

అల్లూరు : కోడి కత్తి డ్రామాలాగే గులకరాయి డ్రామా ఆడిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజలను నమ్మించలేక విఫలమయ్యాడని టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి విమర్శించారు. మండలంలోని నార్త్ మోపూరు, గ్రద్దగుంట పంచాయతీల్లో నెల్లూరు నిరంజన్‌రెడ్డి, రేబాల శంకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిలతో కలసి సోమవారం ఆయన రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఎన్నికల్లో కోడి కత్తి డ్రామా, ఈ ఎన్నికల్లో గులకరాయి డ్రామా ఆడి ప్రజల్లో వ్యతిరేకతను సంపదించుకన్నాడని ఎద్దేవా చేశారు. మాయమాటలు చెప్పి పథకాలు అంటూ మసిపూసి మారేడుకాయి చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రజలు నమ్మేలా లేరన్నారు. పంచాయతీల్లో నిధులు మాయం చేసి తన స్వార్థ ప్రయోజనాలకు వినియోగించుకొని కళకళలాడాల్సిన పంచాయతీలు నేడు మోడుగా మిగిలాయన్నారు. దోచుకోవడం దాచుకోవడమే తప్ప నాయకులకు అభివృద్ధి చేయడం తెలియదన్నారు. అదేవిధంగా రాష్ట్రానికి నేటి పరిస్థితుల్లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని ఆయన ఒక్కడే ఈ రాష్ట్రాన్ని దారిలో పెట్టగలడని, సూపర్ సిక్స్ పథకాలతో వైసీపీకి దిమ్మతిరిగి బొమ్మ కనపడుతుందన్నారు. మేనిఫెస్టోలో చూపిన పథకాలు కొత్తగా ఏమీ లేవని ఆయన ఉద్ఘాటించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా పదవులు అనుభవించిన స్థానిక ఓ నాయకుడు అభివృద్ధిని మాత్రం పట్టించుకోలేదన్నారు. ఆయన తన స్వగ్రామానికి వస్తే ఈ రోడ్డు దుస్థితి ఆయనకు అర్థమవుతుందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే పింఛన్ రూ.4 వేలకు పెంచి లబ్ధిదారులకు నేరుగా ఇంటికి వచ్చి పంపిణీ చేసేలా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని బేఖాతరు చేసి నేడు తాగునీటికి కూడా ఇబ్బంది పడేలా చేశారన్నారు. పంటలు విరివిగా పండే డెల్టా ప్రాంతం అల్లూరు మండలంలో కూడా తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కష్టాలు తీరి రాష్ట్రాభివృద్ధి జరగాలంటే కూటమి బలపరచిన కావలి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓట్లు వేసి అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు విడవలూరు దశరథరామిరెడ్డి, మేడా మల్లారెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు, దేవళ్ల హరిప్రసాద్‌రెడ్డి, బాలాజీ, డేగా సాయి, కొండా శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



కావలి : దుస్తులు ఇస్త్రీ చేస్తున్న క్రిష్ణారెడ్డి తనయ సంహితారెడ్డి

తాళ్లూరులో కావ్య సోదరుడి ఇంటింటి ప్రచారం

చిత్రగుంట : బోగోలు మండలం తాళ్లూరు పంచాయతీలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటినాగేశ్వరావు ఆధ్వర్యంలో కావలి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డి సోదరుడు వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఇంటింటి ప్రచార నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థులు నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యేగా దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎల్.మాధవరావు, ఏ.శ్రీనివాసులు, పీ.సుబ్బారావు, టీ.మాల్యాద్రి, సీహెచ్.మాధవరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలో స్థానిక టీడీపీ నేతలు ఐ.తిరుపతిరెడ్డి, డీ.శ్రీధర్, ఎల్.కిషోర్, శివకోటయ్య, మాలకొండయ్య, చెన్నకేశవులు, మాల్యాద్రి, నాగేశ్వరావులు ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టారు.

కందుకూరుకు ఏం చేస్తారో చెప్పరా?

● సీఎం జగన్ బహిరంగ సభపై ఇంటూరి నాగేశ్వరరావు విమర్శ



మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఏప్రిల్ 29: గడచిన ఐదేళ్లలో కందుకూరు నియోజకవర్గానికి ఏమి చేశారో, రానున్న ఐదేళ్లలో మళ్లీ గెలిపిస్తే ఏమి చేస్తారో చెప్పకుండా సీఎం జగన్మోహనరెడ్డి ఎందుకు బహిరంగ సభ నిర్వహించారో అర్థం కాలేదని, ప్రజలకు ఏమి చేస్తామో చెప్పకుండా తమ గొప్పలు చెప్పుకుని టీడీపీని విమర్శిస్తే సరిపోతుందా అని టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ కందుకూరు బహిరంగ సభలో మాట్లాడిన మాటలను ఆయన మాట్లాడిన విధానాన్ని తప్పుబట్టారు. 22 నెలల క్రితం రామాయపట్నం భూమిపూజకు వచ్చిన సందర్భంగా రాళ్లపాడు ఎడమ కాలువ పొడిగింపు, కందుకూరు పట్టణంలో ఉత్తర బైపాస్‌రోడ్డు నిర్మాణం, కరేడులో పీహెచ్‌సీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన జగన్ నేటికీ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఆ హామీలు ఏమయ్యాయో ప్రస్తావించకుండా రాబోయే కాలంలో కందుకూరుకి ఏమి చేస్తామో చెప్పకుండా ఆయన చంద్రబాబుపై విమర్శలు చేయడానికే పరిమితమై వెళ్లడం ప్రజలు అర్థంచేసుకుంటారన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల డీ లిమిటేషన్‌లో కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకుంటామని విజయసాయిరెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్‌లు చెప్పారని, మరి ఆ విషయాన్ని జగన్‌తో ప్రజలకు ఎందుకు చెప్పించలేకపోయారని ప్రశ్నించారు. రానున్న రోజుల్లో ప్రకాశం జిల్లాలో కందుకూరును కలుపుతామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటిస్తారని పేర్కొన్నారు.

జగన్ బినామీ కంపెనీ కోసం బలవంతంగా భూసేకరణ

చేవూరు, రావూరు గ్రామాల పరిధిలో ఇండోసోల్ పరిశ్రమ కోసం 8వేల ఎకరాలు బలవంతంగా లాక్కుంటున్నారని, ఇది జగన్ బినామీ కంపెనీ అని నాగేశ్వరరావు విమర్శించారు. 8వేల ఎకరాలలో నిజంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వేలాదిమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని, అయితే ఇండోసోల్ వల్ల 500 మందికి కూడా ఉద్యోగాలు రావని పేర్కొన్నారు. రైతుల భూములను కారుచౌకగా కొట్టేసేందుకే ఈ బలవంతపు భూసేకరణ చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 2014లో ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయలేదని జగన్ విమర్శిస్తున్నాడని, ఆయన గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మద్య నిషేధం, సీపీఎస్ రద్దు, అద్భుత రాజధాని నిర్మాణం, ప్రత్యేక హోదా సాధన, పోలవరం పూర్తి లాంటి హామీల పరిస్థితి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి నిరుపేద యువతకు తీరని ద్రోహం చేశాడని విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీ నరసింహం, చిలకపాటి మధు, జి.మోషే, బండారు సోమరాజు, రమణయ్య, సుబ్బారెడ్డి, కూనం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించి మంచి నాయకుడిని ఎన్నుకోండి

ఈ ఐదేళ్ల కష్టాలు అనుభవించిన మీకు మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం వచ్చిందని, ప్రతి ఒక్కరూ ఆలోచించి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవటమే లక్ష్యంగా ఓటు వేయాలని కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య కోరారు. పట్టణంలోని 5వ వార్డు బృందావనం, యువరాజ్ థియేటర్ ప్రాంతం, 3వ వార్డు ఉప్పుచెరువు, పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంతాలలో సోమవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటూరి నాగేశ్వరరావు ప్రజల మనిషి అని, సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని, ప్రతిఒక్కరు ఎమ్మెల్యేగా నాగేశ్వరరావును, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి ప్రమోద్, జంగాల రాఘవ, పాలేటి కోటేశ్వరరావు, గేరా నరేష్, సుదర్శి శ్యామ్, గేరా పవన్, పొనుగోటి రమేష్, ఎం వేణు, ఎం సుబ్బరాజు, బీ వెంకటేశ్వర్లు, గుర్రం మధు, షేక్ కరీముల్లా, వేముల ఫణీంద్ర, మనోజ్, రుద్రబోయిన పోతురాజు, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ పాల్గొన్నారు.



కందుకూరు : కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఇంటూరి సౌజన్య

వైసీపీని వీడి టీడీపీలో చేరిక

లింగసముద్రం : మండలంలోని పెంట్రాల పంచాయతీ పరిధిలోని చీమలపెంటకు చెందిన వైసీపీ కార్యకర్తలు పలువురు టీడీపీలో చేరారు. సోమవారం వలేటివారిపాలెం మండలంలోని బడేవారిపాలెంలో ఇంటూరి నాగేశ్వరరావు స్వగృహంలో షేక్ ఖాజా, సిద్ధారపు శ్రీను, వంశీ, యోహాను, బందెల వినోద్, రవి, మోషే, జోసఫ్ తదితరుల కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.నాగేశ్వరరావు వీరికి టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. తనను, ఎంపీ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొల్లినేని రమణయ్య, ముత్తులూరి సుధాకర్, సీహెచ్ దత్తాత్రేయ, మానికొండ బ్రహ్మయ్య, గంగినేని మధు పాల్గొన్నారు.

టీడీపీలోకి యాదవులు

ఉలవపాడు : మండలంలోని తూర్పుమన్నేటికోటలో 10 యాదవ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కందుకూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు మన్నేటికోట పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షుడు గొత్తుల వెంటకేశ్వర్లు(అబ్బాయి) ఆధ్వర్యంలో గతం ఎన్నికల్లో టీడీపీని వీడిన యాదవ కుటుంబాలు మళ్లీ అదే గూటికి చేరుకున్నారు. శంకర్‌నగర్ ఎస్టీ కాలనీ, పడమర, తూర్పు మన్నేటికోట, జీవీఆర్ ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీల ప్రజలు ఇంటూరికి హారతులు పట్టారు. గ్రామ సర్పంచు పులివర్తి బసవయ్య నాయుడు, నాయకులు రాచగల్లు సుబ్బారావు, చిమ్మిరి వెంకటేశ్వర్లు, వీరగంధం నారాయణ, గొత్తుల బ్రహ్మయ్య, చిరంజీవి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



లింగసముద్రం : టీడీపీలో చేరిన వారితో ఇంటూరి నాగేశ్వరరావు

మున్సిపల్ ట్యాంకర్ల నీటి సరఫరాలో

వైసీపీ నేతల పెత్తనం

● టీడీపీ సానుభూతిపరులకు అందని నీరు

● ప్రశ్నిస్తే బెదిరింపులు

● పరస్పరం పోలీసులకు ఫిర్యాదు

కావలి రూరల్, ఏప్రిల్ 29: కావలి పట్టణం ముసునూరులో అధికారపార్టీ నేతల పెత్తనంలతో టీడీపీ సానుభూతి పరులకు మున్సిపల్ ట్యాంకర్ల నుంచి నీరు అందలేదు. దీనిని ప్రశ్నిస్తే సోమవారం బెదిరింపులకు దిగారు. బాధితుల వివరాల మేరకు.. ముసునూరు వడ్డిపాలెంకు చెందిన టీడీపీ సానుభూతి పరుడు బెల్లంకొండ వెంకటేష్ ఇంటి వద్ద నీటి సరఫరా చేసేందుకు ట్రాక్టర్ రాగా టీడీపీ వారికి నీళ్ల పట్టవద్దని వెంకటేష్ ఇంటికి సమీపంలో ఉండే వైసీపీకి చెందిన వల్లెపు శ్రీను చెప్పారు. దీంతో వెంకటేష్ భార్య జ్యోతి నీళ్ల పట్టకపోతే కమిషనర్‌కు చెబుతామని ట్యాంకర్ ఫొటోలు తీసింది. దీంతో కోపోద్రిక్తులైన వల్లెపు శ్రీను కుటుంబ సభ్యులు మొత్తం జ్యోతిని తిడుతూ ఇంటి మీదకు వచ్చారు. ఈ క్రమంలో రెండు కుటుంబాల మధ్య పాత గొడవలు ఉండటంతో జ్యోతి భయంతో 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చెయ్యగా రూరల్ పోలీసులు వారి ఇంటికి వెళ్లి స్టేషన్‌కు పిలిపించారు. ఇరుకుటుంబాలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఏది ఏమైనప్పటికి నీటి సరఫరాలో కూడా పార్టీల పేరుతో వివక్ష చూపటం చర్చనీయాంశమైంది.

అభివృద్ధి కోసమే టీడీపీలో చేరిక

● వేయి మోటారు సైకిళ్లతో చిరంజీవిరెడ్డి ర్యాలీ



టీడీపీలో చేరిన మెట్టుకూరి శిరీష

కలిగిరి, ఏప్రిల్ 29: గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉదయగిరి నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి జరగపోవడంతో వైసీపీని వీడి తాను తెలుగుదేశం పార్టీలో చేరినట్లు రాష్ట్ర పోలీసు హౌసింగ్‌బోర్డు మాజీ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని 14వ మైలు నుంచి తన అనుచరగణంతో కలసి 1000 మోటారు సైకిళ్లపై ర్యాలీగా బయలుదేరిన ఆయన వింజమూరు, కలిగిరి మండలాల సరిహద్దులో ఉన్న బొమ్మరాజుచెరువులోని టీడీపీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధితో పాటు తనను నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే టీడీపీలో చేరానన్నారు. కాగా బొమ్మరాజుచెరువు పార్టీ కార్యాలయంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్ సమక్షంలో తన శ్రీమతి, కలిగిరి ఎంపీపీ మెట్టుకూరు శిరీష, తన తల్లి, అనంతపురం సర్పంచు మెట్టుకూరు పాపమ్మలతోపాటు పలువురు ఎంపీటీసీలు, సర్పంచులను టీడీపీలో చేర్పించారు.

ఎస్సీ, ఎస్టీ మైనార్టీలను రక్షించుకోవాలి

అల్లూరు, ఏప్రిల్ 29 : రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను పరిరక్షించుకోవలసిన అవసరం ఉందని రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేద్కర్ కావలి నియోజకవర్గ అభ్యర్థి ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. అల్లూరు పట్టణ పరిధిలోని ఉడ్‌హౌస్‌పేట, రాయపేట ప్రాంతాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబు, ముసలి నరేంద్ర, కప్పల నవీన్ కుమార్, కాకాని వెంకయ్య, కాకాని రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటిలో కలిసిన

ఎమ్మెల్యే హామీ


● 9 ఏళ్లుగా ఆచరణకు నోచని డ్రైనేజీ కాలువల నిర్మాణం



కొండబిట్రగుంటలో రోడ్డుపైన మురుగు

బిట్రగుంట, ఏప్రిల్ 29: కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి 9 ఏళ్ల క్రితం వెంకన్న సన్నిధిలో చెప్పిన రోడ్డు డ్రైనేజీ పనుల హామీ మురుగు నీటిలో కలసిపోయింది. బోగోలు మండలం కొండబిట్రగుంటలో వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అందులో ప్రధానంగా కొండబిట్రగుంట నుంచి శ్రీవేంకటేశ్వరపాలెం రైల్వే గేట్ వరకు ఉన్న ప్రధాన రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజ్ నిర్మాణం చేస్తామన్న హామీ తొమ్మిదేళ్ల దాటినా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. వేంకటేశ్వరా.. నన్ను గెలిపించయ్యా.. అంటూ మొక్కి రెండు సార్లు గెలిచి ఏమి అభివృద్ధి చేశావో స్వామి సన్నిధిలో చెప్పగలవా ఎమ్మెల్యే సారూ..!

హామీ మరిచారా జగన్‌రెడ్డీ..?



కలిగిరి సమీపంలో ఉన్న కాటన్‌యార్డ్

కలిగిరి, ఏప్రిల్ 29: కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెం వద్ద ఉన్న కాటన్‌యార్డ్ వాడుకలో లేదు. ఈ క్రమంలో సీఎం జగన్ కలిగిరి మండలంలో పాదయాత్ర చేసిన సమయంలో కాటన్‌యార్డును శీతల గిడ్డంగిగా మార్చి స్థానిక రైతులకు ఉపయోగపడే విధంగా చేస్తామని హామీ ఇచ్చారు. ఐదేళ్లు గడిచిపోయినా శీతలగిడ్డంగుల నిర్మాణం మాత్రం కార్యరూపం దాల్చలేదు. దీంతో హామీ మరిచారా జగన్‌రెడ్డీ.. అంటూ స్థానిక రైతులు కోల్డ్‌స్టోరేజీల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

బైకులకు భలే గిరాకీ !

అవునండీ.. ఇది నిజం ! ఈ సారి ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు బైక్‌లతో రోడ్‌షోలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందుకే బైకులకు యమా గిరాకీ. గ్రామాల్లో యువకులు తమ బైకులతోపాటు తెలిసిన వాళ్ల బైకులను రోడ్‌షోలకు తీసుకు వస్తున్నారు. మెడలో కండువా వేయించుకొని, బైక్‌కి జెండా కట్టేస్తే సరి...? బైక్‌కి రూ.200 పెట్రోల్ కొట్టించడం, మరో రూ.300 చేతికి



ఇస్తుండటంతో రూ.500 గిట్టుబాటు అవుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఈ సారి ఎన్నికల్లో బైక్‌లకు గిరాకీ పెరగడం విశేషంగా పేర్కొంటున్నారు.

- కలిగిరి

వీధుల్లో మైకులు.. ఇళ్లలో సెల్‌ఫోన్లు !

- అభ్యర్థుల ప్రచార హోరు
- సగటు ఓటర్ల విసుగు

ఈ ఎన్నికల్లో నాయకులు గతానికి భిన్నంగా ప్రచారం చేస్తున్నారు. వీధుల్లో మైకులతో హోరెత్తిస్తుండగా, ఇళ్లల్లో సెల్‌ఫోన్‌లకు అభ్యర్థుల ఫోన్ చేస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం, స్మార్ట్ ఫోన్‌లు ప్రతి ఇంటా ఉండడంతో అభ్యర్థులు వాట్సప్ ద్వారా ప్రతిఅంశం షేర్ చేస్తున్నారు. తమకు ఓటు వేస్తే చేయబోయే అంశాలను ఐవీఆర్ ద్వారా చెప్తున్నారు. వారం రోజులుగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల తరుపున ఆయా పార్టీల మద్దతుదారులు పార్టీ కార్యాలయాల ప్రతినిధులు ఫోన్ చేసి వచ్చేనెల 13న జరిగే పోలింగ్‌లో తమ అభ్యర్థికి ఓటు వేయాలని పదేపదే కోరుతున్నారు. దీనివల్ల ఫోన్‌రింగ్ అవుతున్న సమయంలో లిఫ్ట్ చేసేందుకు చాలామంది ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. గుర్తుతెలియని నెంబర్ల నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేయడానికి ఇష్టపడడంలేదు. బంధువులు, స్నేహితులు పనులపై చేసే సమయంలో కూడా ఈ నెంబరు ఎవరిదోనని తికమక పడుతున్నారు. ప్రశాంతత కోరుకునే గ్రామీణులు ఎక్కువగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటారు. కొద్దిరోజులుగా అనేకసార్లు ఫోన్లు వస్తుండడంతో విసుగుచెందుతున్నారు.



ఎన్నికల ప్రచారాలతో విసిగిపోతున్న జనం

- ఉదయగిరి

బయట ఊర్లలో మనవాళ్లెవరు ?

- ఓటరు జాబితా తిరగేస్తున్న నేతలు

బయట ఊర్లలో నివాసముంటున్న మన ఊరి ఓటర్లు ఎవరు... అందులో మన వర్గం ఎవరు.. వాళ్లకు ఖర్చు పెట్టి తీసుకువచ్చినా మన పార్టీకే ఓట్లేసే వాళ్ల ఎంత మంది... ?అని అంటూ బూత్ స్థాయి నాయకులు ఓటర్ల జాబితాను జల్లెడ పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సమరంలో ప్రధాన పార్టీల మధ్య పోటీ తీవ్రత పెరిగింది. దీంతో ప్రతీ ఓటు కీలకంగా మారింది. ఈ క్రమంలో ఇక్కడ ఓట్లుండి బయట ఊర్లలో నివాసాలుంటున్న వారి వివరాలను రాజకీయ పార్టీల నాయకులు అన్వేషిస్తున్నారు. ఓటర్ల జాబితాలను దగ్గరపెట్టుకుని కొందరు ఆరా తీస్తుండగా, వలంటీర్ల సహాయంలో మరికొందరు నాయకులు బయట ఓట్ల కోసం పాకులాడుతున్నారు. బయట ఊర్లలో



ఉన్న ఇక్కడ ఓటర్లకు ప్రయాణ ఖర్చులన్నీటిని భరించి వారిని మే 13వ తేదీనాటికి తీసుకువచ్చేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రైళ్లు, బస్సుల్లో రిజర్వేషన్లు పూర్తవగా, అందులో అవకాశం లేనివారిని కార్లలో తీసుకు వచ్చేందుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

- నెల్లూరురూరల్

అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం మొండివైఖరే అవలంభిస్తోంది. సమ్మె విరమణ సందర్భంగా వారితో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఎన్నికలకు ముందు చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడంలో ఉద్యోగులతో చెడుగుడు లాడుకుంటోంది. సమ్మె కాలానికి ఇస్తామన్న వేతనాలు నేటికీ అంగన్‌వాడీలకు అందలేదు. అదిగో., ఇదిగో ఇస్తామన్న ప్రభుత్వం ఆ సంగతినే విస్మరించింది. కాగా జూన్ తర్వాత ఏర్పడే ప్రభుత్వంపైనే అంగన్‌వాడీలు ఆశలు పెట్టుకుంటున్నారు.

- నెల్లూరు (వైద్యం)

- సమ్మె కాలానికి వేతనం ఏదీ... ?
- 11 ఒప్పందాల్లో ఐదు మాత్రమే అమలు
- మా ఆవేదన అర్థం చేసుకోవా జగనన్నా... : అంగన్‌వాడీలు





ఇచ్చినమాట ఏమైందన్నా...?

అంగన్‌వాడీల సమ్మె ఓ చారిత్రాత్మకం. ఏకంగా 42 రోజులపాటు అంగన్‌వాడీలు తమ కేంద్రాలను మూసివేసి సమ్మెబాట పట్టారు. ఎట్టకేలకు దిగివచ్చిన వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలతో పలు ఒప్పందాలు చేసుకుని, వాటిని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. సమ్మె కాలానికి కూడా వేతనాలు ఇస్తామని అంగీకరించింది. ఇది జరిగి మూడు నెలలు దాటింది. అయితే ఇంతవరకు వేతనాలు మాత్రం అందలేదు. ఫైనాన్స్ క్లియరెన్స్ పూర్తి అయినా సీఎం జగన్మోహన్‌రెడ్డి వద్దే అంగన్‌వాడీల వేతనాల నివేదిక ఉన్నా నేటికి అవి పరిష్కారం కాలేదు. జిల్లాలో అంగన్‌వాడీలు మాత్రం సమ్మె కాలానికి వేతనాల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. జిల్లాలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి వీటిల్లో 5,639 మంది అంగన్‌వాడీలు, హెల్పర్లు పనిచేస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ. 11,500 వేతనాలు ఇస్తుండగా హెల్పర్లకు రూ. 7వేలు ఇస్తున్నారు. డిసెంబర్ 14న అంగన్‌వాడీలు సమ్మె చేపట్టగా జనవరి 24వ తేదీ వరకు కొనసాగింది.

ఒప్పందాలు అమలు జరిగేనా?

సమ్మె సందర్భంగా 11 డిమాండ్‌లను అంగన్‌వాడీలు ప్రభుత్వం ముందు ఉంచారు. వాటన్నిటి అమలు చేస్తామని ప్రభుత్వం వారితో ఒక అంగీకారానికి వచ్చింది. అయితే ప్రస్తుతం ఐదు డిమాండ్‌లు మాత్రమే అమలు అవుతున్నాయి, మిగిలిన వాటిని త్వరలో అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అయితే నేటికీ అవి అమలు కాలేదు. అంగన్‌వాడీ వేతనాల పెంపునకు యూనియన్లకు హామీ ఇచ్చారు. అయితే జూలై నుంచి వేతనాలు పెరుగుతాయని మెలిక పెట్టింది. గ్రేడ్ - 2 సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్ష రాసి పెండింగ్‌లో ఉన్న 164 గ్రేడ్ - 2కు ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల కోడ్ రావటంతో ఈ ప్రతిపాదన ఆగిపోయింది. నాలుగు యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా రూపొందిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. అదీ కూడా అమలు కాలేదు. వేతనాలతో కూడిన మెడికల్ లీవ్, పోషణ మెనూ చార్జీల పెంపు, గ్యాస్ తదితర సమస్యలకు కమిటీ వేయిస్తామని హామీ ఇచ్చింది. ఇవి ఎప్పటికి పూర్తవుతావో తెలియదు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ సెంటర్‌లుగా చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అయితే నేటికీ అమలులోకి రాలేదు.



వేతన బకాయిలు ఇంకా ఇవ్వలేదు

సమ్మెకాలానికి వేతనాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పట్లో అవి వస్తాయన్న నమ్మకం లేదు. ప్రస్తుతం ఎన్నికలు ఉండటంతో ప్రభుత్వం అధికారులు వేతన బకాయిలు చెల్లించే అవకాశం ఉన్నా ఆదిశగా కృషి చేయటం లేదు. వచ్చే ప్రభుత్వమైనా వేతనాలు చెల్లిస్తుందని ఆశిస్తున్నాం.

- సుజాత, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నాడు మునెమ్మ.. నేడు ప్రశాంతి

- కోవూరు పోరులో రెండో మహిళగా పోటీ
- నియోజకవర్గంలో నారీమణుల ఓట్లే ఎక్కువ

కుముదం రాజ్యం

కోవూరు నియోజకవర్గంలో ఎప్పటి నుంచో మహిళాశక్తి రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. మహిళా ఓటర్లే అధికంగా ఉన్న నియోజకవర్గమిది. మహిళలే రాజకీయాల్ని శాసించే సెగ్మెంట్ కోవూరు. 2,61,125 మంది ఓటర్లలో 1,34, 835 మంది మహిళా ఓటర్లు ఉండటం విశేషం. పురుషుల కంటే మహిళా ఓటర్లే 8,565 ఎక్కువమంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 1951 నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానపక్షాలు మహిళలకు అవకాశం కల్పించడం లో విఫలమయ్యాయి. బెజవాడ గోపాలరెడ్డి ఆంధ్రరాష్ట్ర ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వవ్వేరు పంచాయతీని మహిళలే స్వాధీనం చేసుకోవడం అప్పట్లో సంచలన మైంది. కోవూరు మండల పరిధిలోని లేగుంటపాడులో పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన మహిళలు దేశవ్యాప్త ఖ్యాతిని ఆర్జించారు. సారానిషేధం, అక్షరాస్యతా ఉద్యమాల్లో కోవూరు ఖ్యాతిని ఎలుగెత్తి చాటిన మహిళలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతూనే ఉన్నారు.టీడీపీ అభ్యర్థిగా బుచ్చికి చెందిన ఉక్కాల రాజేశ్వరమ్మ 1999లో జరిగిన ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా గెలుపొందారు. విడవలూరు మండలం చౌకచర్లకు చెందిన నాగభూషణమ్మ ఎన్టీఆర్ ప్రభుత్వ హయాం లో జడ్పీ చైర్‌పర్సన్‌గా గెలుపొందారు. అన్ని రంగాల్లో సత్తా చాటుతున్న నియోజకవర్గ మహిళలు అసెంబ్లీ ఎన్నికలకు మాత్రం దూరంగా ఉండిపోయారు. కాగా 2009లో జరిగిన త్రిముఖ పోటీలో ప్రజారాజ్యం పార్టీ తరపున గిరిజన సామాజికవర్గానికి చెందిన తుపాకుల మునెమ్మను ఆ పార్టీ అధ్యక్షుడు చిరంజీవి పోటీకి నిలిపారు. ఆమె పోటీ అప్పట్లో సంచలనం రేపింది. ఓ గిరిజన మహిళ ప్రధాన పార్టీల అభ్యర్థులను ఢీకొని సత్తాచాటారు. కాగా ఈసారి ఎన్నికల్లో టీడీపీ తరపున నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమి రెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డిని టీడీపీ తరపున పోటీకి నిలిపారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో హడావిడిగా ఉండే ఆమె, సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా పనిచేసిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని ఢీకొంటున్నారు. మహిళలంతా సర్వశక్తులు ఒడ్డి ఆమె విజయానికి పాటుపడుతున్నారు.

- కోవూరు



తుపాకుల మునెమ్మ



వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

రాజకీయ సభల్లో అల్లరి నేరమే !

- కరపత్రాలకు అనుమతి అవసరం
- వేసిన ఓటు రహస్యమే..

రూల్స్ గుర్తున్నాయా..?

ఏదైనా రాజకీయ పార్టీ నిర్వహించే సభలో ఆ పార్టీకి సంబంధంలేని వ్యక్తి అల్లరి చేస్తే ఈసీ నిబంధనల మేరకు నేరమే అవుతుంది. అభ్యర్థులు ప్రచారానికి గ్రామాలకు వెళ్లినప్పుడు సమావేశాలను అడ్డుకోవడం, భంగపరచడానికి ప్రయత్నించడం కూడా అపరాధమే అవుతుంది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష , రూ. 2 వేల జరిమానా విధించే అవకాశం ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి పూర్తయ్యేవరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. సభకు అధ్యక్షత వహించే నాయకుడు అనుమానం వచ్చిన వ్యక్తిని గురించి వివరాలను రాబట్టుకోవచ్చు. పోలీసులకు కూడా ఆ వ్యక్తి వివరాలను చెప్పకపోతే అతడ్ని వారంట్ లేకుండా నిర్బంధంలోకి తీసుకునే వీలుంది. అలాగే ప్రచారానికి సంబంధించిన కరపత్రాలపై ప్రచురణకర్త చిరునామా తప్పనిసరిగా ఉండాలి. చిరునామా లేకుండా కరపత్రం, పోస్టర్ ముద్రించి ప్రచారం చేస్తే ఆరు నెలల జైలుశిక్ష, రెండువేల రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది.

వేసిన ఓటు రహస్యమే..

ఓటరు వేసిన ఓటును ఎన్నికల అధికారులు రహస్యంగా ఉంచాలి. ఓటు రహస్య స్వభావాన్ని పరిపూర్ణంగా పరిరక్షించకపోతే మూడు నెలల జైలుశిక్ష, జరిమానా విధించవచ్చని ఈసీ నియమావళిలో పొందుపరచింది. ఏ వ్యక్తి ఓటరునూ కూడా ప్రభావితం చేసేలా ఎన్నికల అధికారులు, పోలీసులు ప్రవర్తించరాదు. ఎవరికైనా ఓటు వేయమని చెప్పినట్లు రుజువైతే ఆరు నెలల జైలుశిక్ష తప్పదు.

- సంగం

ఉప్పు రైతులకు ఉపకారమేది ?

- హామీలకే పరిమితమైన వసతుల కల్పన
- పట్టించుకోని పాలకులు

అల్లూరు, ఏప్రిల్ 29: ఉప్పు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువయింది. రోజురోజుకీ తగ్గుతున్న ధరలతో ఉప్పు రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఇక్కడి ఉప్పును ఏళ్లతరబడి ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటారు. అయినా ధరలు ఆశాజనకంగా లేవు. రెండేళ్ల క్రితం క్వింటా ఉప్పు ధర రూ.500 వరకు పలికింది. గత ఏడాది ఆ ధర రూ.250కి పడిపోయింది. ఈ ఏడాది రూ.150కి పడిపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఇంత జరుగుతున్నా ఉప్పు రైతులకు ఏనాడూ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందలేదు. వీరికి ఎటువంటి రాయితీలు ఇవ్వలేదు. ధరల నియంత్రణ చర్యలను ప్రభుత్వం చేపట్టలేదు.

ప్రోత్సాహమేది ?

మిగతా రైతులకు ఇస్తున్న ప్రోత్సాహం ఉప్పు రైతులకు ఇవ్వడం లేదు. రాయితీతో బోర్ల ఏర్పాటు, మోటార్ల పంపిణీ, విద్యుత్ చార్జీల ధరల తగ్గింపు లాంటి చర్యలు లేవు. ఉప్పు తింటారు కానీ వీరి గురించి ఎవరూ పట్టించుకోరు. గతేడాది భారీ వర్షాలకు వరద తీవ్రతతో కయ్యల్లోనూ, రోడ్డు మార్జిన్లలోనూ ఉన్న ఉప్పు కువ్వలు కరిగిపోయాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న బోర్లు, విద్యుత్ మోటార్లు ధ్వంసమయ్యాయి. అయితే పాలకులు కానీ, అధికారులు కానీ వీరివైపు కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవు.

హామీల్లోనే వసతులు

స్థానిక ఎంపీ ఉప్పు నిల్వల కోసం ప్లాట్ ఫామ్‌లు ఏర్పాటు చేస్తామని, రోడ్డు నిర్మాణం చేపడతామని హామీలు ఇచ్చారు. కానీ ఆ హామీలు నేటికీ అమలు కాలేదు. గత వర్షాకాలంలో నష్టపోయిన రైతులకు తిరిగి అదే హామీ ఇచ్చారు. కానీ నెరవేరలేదు. ఉప్పు రైతులకు విద్యుత్ బిల్లుల ఇటీవల పెనుభారమయ్యాయి. బిల్లుల్లో రాయితీ ఇవ్వాలని వారు కోరుతున్నారు.



ప్లాట్‌ఫాం లేక రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఉప్పు కువ్వలు

ఎవరూ పట్టించుకోవడం లేదు..



ఉప్పు రైతులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో హామీలు ఇస్తారు కానీ, అధికారంలోకి వచ్చాక మరిచిపోతున్నారు. ఎవరైనా రాకపోతారా.. మమ్మల్ని పట్టించుకోకపోతాడా ? అని ఎదురు చూస్తున్నాం.

- పురిణి ఏడుకొండలు, ఉప్పురైతు, తూర్పుగోగులపల్లి

రాయితీలు కల్పించాలి...

అందరూ రైతుల మాదిరిగానే ఉప్పు రైతులకు కూడా రాయితీలు కల్పించాలి. మోటార్లు, విద్యుత్ వైర్లు, బోర్లపై రాయితీలు ఇవ్వాలి. ఉప్పు నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేయాలి.

- గోళ్ల ఆదాం, ఉప్పు రైతు, తూర్పుగోగులపల్లి

ఓటేయడానికి కావాల్సిన గుర్తింపు కార్డులివే..!

పోలింగ్ రోజున ప్రతి ఓటరూ పోలింగ్‌స్టేషన్‌కు విధిగా వ్యక్తిగత గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. లేని పక్షంలో ఎన్నికల అధికారులు ఓటును తిరస్కరించే అవకాశం ఉంది. ఓటరు తమకు నచ్చిన లేదా తమ వద్ద అందుబాటులో ఉన్న గుర్తింపు కార్డు తీసుకెళ్తే కుదరదు. ఓటరు ఎలాంటి గుర్తింపు కార్డును తీసుకెళ్లాలో ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ 13 రకాల కార్డులను మాత్రమే అధికారులు పరిగణలోకి తీసుకుంటారు. ఓటరు ఫొటో గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, సర్వీసు గుర్తింపు కార్డు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసినవి), పాస్‌బుక్ (ఫొటోతో పాటు బ్యాంక్, పోస్టాఫీసులో జారీ చేసినవి), పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, స్మార్ట్‌కార్డు (కార్మిక శాఖ మంత్రిత్వశాఖ పథకం కింద జారీ చేసి నవి), ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ జాబ్‌కార్డు, ఆరోగ్య బీమా స్మార్‌కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినది), ఫొటో పింఛన్ పత్రం, అధికారిక గుర్తింపు కార్డు (ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన), ఎన్‌పీఆర్ కింద ఆర్జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు తీసుకెళ్లాలి. వీటిని మాత్రమే అధికారులు గుర్తించి, ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

- వలేటివారిపాలెం



'కోడ్' బేఖాతర్..

వైసీపీ బరితెగింపు

ఉలవపాడులో గుంటూరు, విజయవాడ యువకులు

- ఇంటింటా స్టిక్కర్ల అతికిస్తున్న వైనం
- టీడీపీ ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



వైసీపీ స్టిక్కర్లు అంతికించేందుకు విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి ఉలవపాడుకు వచ్చిన యువకులు

ఉలవపాడు : కోడ్ అమలులో ఉన్నా అధికార పార్టీ నేతలు బేఖాతరు చేస్తూనే ఉన్నారు. విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన కొంతమంది సోమవారం నెల్లూరు జిల్లాలోని ఉలవపాడులో నెల్లూరు ఎంపీ వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్, సీఎం జగన్, ఫ్యాన్ గుర్తు ఉన్న స్టిక్కర్లను ఇళ్ల గోడలపై అతికించారు. 20 మంది యువకులు బృందాలుగా ఏర్పడి బ్యాగ్‌ల నిండా కరపత్రాలు, స్టిక్కర్లు వేసుకొని తమ పని కానిచ్చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయానికి ఆనుకొని కొనేరు సెంటర్‌లో ఉన్న ఇళ్లకు వారు స్టిక్కర్లు అతికిస్తుండగా టీడీపీ నేతలు కనుగొన్నారు. దీంతో వాళ్లను నిలదీయగా తాము విజయవాడ నుంచి వచ్చామని, ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అతికించేందుకు తమను తీసుకొచ్చినట్లు చెప్పారు. దీంతో టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. విషయం జఠిలం కావడంతో అధికారులు వచ్చే సరికి అక్కడ నుంచి ఆ యువకులంతా పలాయనం చిత్తగించారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, సిబ్బంది గ్రామంలో గాలించగా ఒక బృందం వారి కంటపడడంది. దీంతో ఎంపీడీవో విజయ దగ్గర హాజరు పరిచారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఈ యువకులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సగర్వంగా సాగనంపడంపై టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. దీనిపై ఎన్నికల అధికారి అయిన ఎంపీడీవోను వివరణ కోరగా మండలంలోని వీరేపల్లి, మన్నేటికోట, చాకిచర్ల, ఉలవపాడు గ్రామాల్లో ఇంటింటా వైసీపీ ప్రచారం కోసం వారు అనుమతి పొందినట్లు తెలిపారు. కరపత్రాలు పంపిణీకి మాత్రమే అనుమతి ఉన్నప్పుడు స్టిక్కర్లు ఎలా అతికిస్తారని ప్రశ్నించగా, 41ఏ నోటీసులు అందజేస్తామని తెలిపారు.

● **కందుకూరు** : కందుకూరులో కొంతమంది ఇంటింటికీ వైసీపీ స్టిక్కర్లు అతికించడం కలకలం రేపింది. ఎట్టణంలోని అనేక ప్రాంతాలతో పాటు గత ప్రభుత్వం నిర్మించిన జీ ప్లస్ త్రీ గృహాల సముదాయంలోను గడపగడపకు ఈ స్టిక్కర్లు అంటిస్తూ చిన్నపిల్లలు కనిపించారు.

ఎన్నికల ఖర్చు పెరిగిందిలా...!

పోటీలో ఉన్న అభ్యర్థులు తమ గెలుపు కోసం ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అదనంగా నగదు ఖర్చు చేయకుండా ఎన్నికల సంఘం పరిమితులు విధించింది. ఒక అభ్యర్థికి గతంలో వ్యయ పరిమితి రూ.లక్ష ఉండగా, నేడు రూ.40 లక్షల వరకు పెరిగింది. వ్యయ పరిమితులను పరిశీలిస్తే... 1957లో రూ.2 లక్షలు, 1962లో రూ.3 లక్షలు, 1971లో రూ.4 లక్షలు, 1975, 1977లలో రూ.5 లక్షలుగా ఉండేది. 1984లో ఖర్చు పెంచి రూ.10 లక్షలు చేసింది. 1988లో రూ.10 లక్షలు, 1991లో రూ.12 లక్షలు, 1994లో రూ.12 లక్షలు, 1999లో రూ.15 లక్షలు, 2004లో రూ.17 లక్షలు, 2009లో రూ.9 లక్షల పెంచి ఏకంగా రూ.26 లక్షలు చేసింది. 2014, 2018ల్లో రూ.28 లక్షలుండగా 2024 ఎన్నికల్లో మరో రూ.12 లక్షలు పెంచి రూ.40 లక్షలుగా ఈసీ నిర్ణయించింది.

ఎలాగంటే..



- ఉదయగిరి

అసంపూర్తిగా వంతెన నిర్మాణం

● ప్రమాదాల బారిన వాహన చోదకులు



అసంపూర్తిగా ఉన్న వంతెన

తోటపల్లిగూడూరు, ఏప్రిల్ 29: రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ లబ్ధి కోసం చేస్తున్న పనులతో ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని స్థానిక ప్రజలు, రైతులు వాపోతున్నారు. మండలంలోని చింతోపు పేడూరు లింకు రోడ్డు వద్ద వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది.. కొత్త వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు వారి స్థలాల్లోకి వెళ్లేందుకు వంతెన పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వంతెన దగ్గర తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు, రైతులు వాపోతున్నారు. ఇటీవల కాలంలో మూగ జీవాలు కాలువలో పడి పాడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇసుక ట్రాక్టర్ కూడా కాలువలో జారిపడిన సంఘటనలు ఉన్నాయి. దీంతో వంతెన నిర్మాణం పూర్తిచేయాలని స్థానిక ప్రజలు, రైతులతో కలిసి నిరసన చేపట్టడంతో నాలుగు నెలలు క్రితం తాత్కాలికంగా వంతెన పనులు చేపట్టి అలాగే వదిలేశారని, త్వరితగతిన వంతెన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

వైసీపీ పాలనంతా భూ కుంభకోణాల మయం : సోమిరెడ్డి



పొదలకూరు : నావూరు ప్రచారంలో సోమిరెడ్డి, నాయకులు

పొదలకూరు, ఏప్రిల్ 29: వైసీపీ పాలనలో మంత్రి కాకాణితో పాటు గ్రామాల్లోని ఆయన అనుచరులు భూకుంభకోణాలకు పాల్పడ్డారని, తాము అధికారంలోకి రాగానే దోపిడీదారులపై చర్యలు తప్పవని మాజీ మంత్రి సర్వేపల్లి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పొదలకూరు మండలం సూరాయపాలెం, బోగసముద్రం, నావూరు, నావూరుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ మంత్రి కాకాణి అధికారాన్ని అడ్డం పెట్టుకుని సర్వేపల్లి నియోజకవర్గంలో వేల ఎకరాల భూ కుంభకోణం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎవరినీ వదిలిపెట్టమని, ప్రజల సొత్తు మెక్కిన వారిని కక్కిస్తామన్నారు. ఈ సమావేశంలో తలచీరు మస్తాన్‌బాబు, దామినేని బుజ్జయ్యనాయుడు, నారాయణనాయుడు, రవి, డి రామానాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, పెంచల భాస్కర్‌రెడ్డి, సుధీర్‌నాయుడు, యశ్వంత్‌రెడ్డి, ఎద్దల అజయ్‌రెడ్డి, రవి రాఘవేంద్ర, మండలంలో అన్ని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, నావూరులో వైసీపీ నుంచి 9 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

వైసీపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం : శృతిరెడ్డి

త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పేందుకు సర్వేపల్లి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కోడలు శృతిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పొదలకూరు మేజర్ పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లిలో సోమవారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి టీడీపీ మ్యానిఫెస్టోలోని ఆరు గ్యారెంటీలను వివరిస్తూ ఓటు వేయమని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, నువ్వుల కవిత, బక్కయ్యనాయుడు, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డికే సర్వేపల్లి ప్రజల ఆశీస్సులు : సింధురెడ్డి

వెంకటాచలం: త్వరలో జరగనున్న ఎన్నికల్లో సర్వేపల్లి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికే సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు ఉంటాయని సోమిరెడ్డి కుమార్తె డాక్టర్ సోమిరెడ్డి సింధురెడ్డి తెలిపారు. మండలంలోని నిడిగుంటపాలెం గ్రామంలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులుయాదవ్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు, నాయకులు రావూరి పద్మనాభనాయుడు, తదితరులున్నారు.

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

తోటపల్లిగూడూరు: మండలంలోని సౌత్‌ఆములూరు, చిన్నచెరుకూరు గ్రామాలలో సోమవారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దిన గోపాల్‌నాయుడు, శ్రీధర్‌నాయుడు, కోటయ్యనాయుడు, చుక్కపల్లి మల్లి, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను నమ్మొద్దు : బీజేపీ

పొదలకూరు, ఏప్రిల్ 29: జగన్‌ను మరోసారి నమ్మి మోసపోవద్దని, ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర సెల్ కన్వీనర్, సర్వేపల్లి నియోజకవర్గం బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ సురేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కె రవీంద్ర అన్నారు. సోమవారం మండలంలోని మర్రిపల్లి, డేగపూడి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఎంపీగా వెలగపూడి వరప్రసాద్‌ను, సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ఇచ్చిన నిధులను సీఎం జగన్ తన అవసరాలకు మళ్లించారన్నారు. వచ్చే ఐదేళ్లలో ఆదాయ వనరులు ఎలా పెంచుతారో జగన్ తన మ్యానిఫెస్టోలో పెట్టలేదన్నారు. కేవలం ఓట్ల రాజకీయం కోసమే మ్యానిఫెస్టోను రూపొందించారని తెలిపారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆంధ్రుడిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మోహన్, బీజేపీ మండల అధ్యక్షుడు అయోధ్య రామయ్య గౌడ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



పొదలకూరు: మర్రిపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కోవూరు సర్వేపల్లి

ఘనంగా ధ్వజారోహణ పూజలు



ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు

సైదాపురం, ఏప్రిల్ 29: కృష్ణారెడ్డిపల్లి వైకుంఠపురం మహావిష్ణువు ఆలయంలో తాతయ్య స్వామి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ధ్వజారోహణ పూజలు చేపట్టారు. ఉదయం తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం, రాత్రి శేషవాహన సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చెక్ పోస్టు పరిశీలన



చెక్ పోస్టును పరిశీలిస్తున్న ప్రత్యేక సాధారణ పరిశీలకులు రామ్‌మోహన్ మిశ్రా

వెంకటాచలం : వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద ఉన్న చెక్ పోస్టును సోమవారం జిల్లా ఎన్నికల అధికారి ఎం హరినారాయణ్‌తో కలిసి ప్రత్యేక సాధారణ పరిశీలకులు రామ్‌మోహన్ మిశ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీ వివరాలు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు.

'శ్రీ చైతన్య' విద్యార్థికి ఎస్పీ అభినందన



నెల్లూరు (విద్య), ఏప్రిల్ 29 : ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించిన నగరంలోని వనంతోపు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి చలువాది వెంకట సుభాష్ చంద్రను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అభినందించారు. నగరంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం పాఠశాల యాజమాన్యం విద్యార్థితో కలిసి ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ పదో తరగతిలో 598 మార్కులతో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు చదువులో ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం కొండారెడ్డి, ప్రిన్సిపాల్ కల్పన, డీన్ రమేష్, ఇన్‌చార్జులు అంజనేయులు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రోత్సాహం ఏదీ ?

- గత ప్రభుత్వంలో అమలయిన పథకాల నిలిపివేత
- వైసీపీ అమల్లోకి తెచ్చిన బీమా పథకం కూడా..
- ఆందోళనలో పశుపెంపకందారులు



నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 29 : పాడి రైతులకు ఆర్థిక చేయూత అందించేలా గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వైసీపీ ప్రభుత్వం నిలిపేసింది. అంతేకాక వారికి అందించాల్సిన రాయితీలను ఒక్కొక్కటిగా దూరం చేసింది. ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహకాలు అందక పాడిరైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరికి బీమా పథకాలను కూడా ఈ ప్రభుత్వం అటకెక్కించింది.

● వ్యవసాయం తర్వాత పాడికే ప్రాధాన్యం

జిల్లాలో 57,774 ఆవులు, 6,46,106 గేదెలు, 3,86,929 మేకలు, 10,95,197 గొర్రెలు ఉన్నాయి. జిల్లాలో వ్యవసాయం తరువాత రైతులు పాడి పరిశ్రమకే ప్రాధాన్యమిస్తారు. చాలా కుటుంబాలు గొర్రెలు, మేకలు, పశువులు, గేదెలు, పందుల పెంపకం చేపట్టి తద్వారా ఆదాయం పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాల ఉత్పత్తి పెంపునకు రైతులకు ప్రతిఏటా దాణాతోపాటు సైలేజ్(గడ్డి), వివిధ రకాల పశుగ్రాస విత్తనాలను రాయితీపై అందించేది. పశు సంరక్షణ కోసం గోకులం, మినీ గోకులం పేరిట షెడ్లు నిర్మించింది. గ్రామాల్లో రైతులు పశుగ్రాస క్షేత్రాలను ఏర్పాటు చేసి విస్తారంగా పచ్చిగడ్డి సాగుచేసేవారు. వేసవిలో పశుగ్రాసం కొరత ఉన్న ప్రాంతాల్లో రాయితీపై ఆగడ్డిని సరఫరా చేసేవారు. తద్వారా రైతులకు ఆదాయం కూడా వచ్చేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక పశుగ్రాస క్షేత్రాలను ఆపేసింది. గోకులం పేరుతో పశువుల షెడ్ల నిర్మాణాన్ని కూడా ప్రభుత్వం నిలిపేసింది.

● పరిహారం కూడా నిలిపివేత

పశువు చనిపోతే దానిపై ఆదారపడి జీవనం సాగిస్తున్న రైతు నష్టపోకుండా ఉండేందుకు గత ప్రభుత్వం పరిహారం అందించేది. పశువైద్యాధికారి ధ్రువీకరిస్తే పరిహారం రైతుకు అందేది. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక వైఎస్ఆర్ పశునష్టపరిహార పథకాన్ని ప్రవేశపెట్టింది.డెత్ క్లైయిలు అధికంగా రావడంతో ప్రభుత్వం పథకాన్ని నిలిపేసింది. ఈపథకం ద్వారా దాదాపుగా 3898 పశువులకుగాను రూ.8,64,81,000ల వరకు ప్రభుత్వం నుంచి రైతులకు అందాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఈపథకం స్థానంలో రైతు భాగస్వామ్యంతో ప్రీమియం చెల్లించేలా వైఎస్ఆర్ పశుబీమా పథకాన్ని గతేడాది జూన్‌లో అమల్లోకి తీసుకొచ్చారు. కనీసం రెండు నెలలు కూడా గడవకముందే నిలిపి పోయింది. దీంతో పశువులకు అందాల్సిన బీమా అందడం లేదు.

సోమశిలలో 8.212 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, ఏప్రిల్ 29: సోమశిల పూర్తిస్థాయినీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు. సోమవారం నాటికి జలాశయంలో 8.212 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కిలో పొగాకు రూ.291

కలిగిరి, ఏప్రిల్ 29: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు ధర గరిష్ఠంగా రూ.291 పలికింది. ఈ కేంద్రానికి రైతులు 628 పొగాకు బేళ్ల విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 478 బేళ్ల కొనుగోలు చేశారు. నోసేల్-1, నోబిడ్-119, ఆర్ఆర్-3, సీఆర్-14, జంపింగ్‌లాట్స్-13 కారణాలతో 150 బేళ్ల తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.291, కనిష్ఠ ధర రూ.216, సగటు ధర రూ.252.96 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

లక్ష్యాలను అధిగమించాలి



సిబ్బందితో సమీక్షిస్తున్న జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి ఖాదరవల్లి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 29: వైద్య ఆరోగ్య సిబ్బందికి కేటాయించాలని లక్ష్యాలను నూరు శాతం అధిగమించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి షేక్ ఖాదరవలి సూచించారు. సోమవారం దుత్తలూరు, నర్రవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి వారిని గళ్ల పరీక్షా కేంద్రానికి పంపాలన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హైరిస్కు గర్భవతులను గుర్తించి వారిని ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాన్పులు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ వేయడంలో 95 శాతం పూర్తి చేయడం హర్షణీయమన్నారు. అనంతరం మందుల, కాన్పుల గదులు, ల్యాబ్, రికార్డులు పరిశీలించి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అయూబ్‌అఫ్సర్, హరీష్, సీహెచ్‌వో ఓంకారయ్య, హెచ్‌వీ బీబీజాన్, ఎస్టీఎస్ షబ్బీర్, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్, రియాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక వైద్యశాలను జిల్లా అదనపు వైద్యాధికారి షేక్ ఖాదర్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు కరిష్మా, ఆయేషా, సీహెచ్‌వో రాజశేఖర్‌రాజు, పీహెచ్ఎన్ సుశీలమ్మ, టీబీ నివారణ సిబ్బంది ఎస్ మురళి, భోగ్యం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడిపై దాడిని అడ్డుకోబోయిన యువకుడి హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాబీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 29 : స్నేహితుడిపై దాడి చేస్తుండటంతో అడ్డుబోయిన యువకుడు హత్యకు గురయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌కు చెందిన షాజిద్‌తో కుసుమ హరిజనవాడకు చెందిన రౌడీషీటర్ బాలాజీకి గొడవలున్నాయి. ఆదివారం రాత్రి షాజిద్ తన స్నేహితుడు సుల్తాన్‌తో కలిసి జాకీర్ హుస్సేన్ నగర్‌లో మద్యం సేవిస్తుండగా బాలాజీ బైక్‌పై అటుగా వెళుతున్నాడు. గమనించిన షాజిద్ బైక్‌ను అడ్డుకుని అతనిపై దాడి చేశాడు. గాయపడిన బాలాజీ ఇంటికి వెళ్లి విషయాన్ని తన సోదరుడు, రౌడీషీటర్ చంద్రతోపాటు తన వారికి తెలియజేశాడు. అందరూ కలిసి జాకీర్‌హుస్సేన్ నగర్‌కు వెళ్లి షాజిద్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న షాజిద్ స్నేహితుడు జీ రవి తేజ(24) అనే పెయింటర్ ఘటన స్థలానికి చేరుకుని నిందితులను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో నిందితులు రవితేజ తలపై కర్రతో బలంగా కొట్టడంతో తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. హత్యపై సమాచా రం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం బాబీ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రవిజేత తండ్రి శేషాద్రి ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితుల కోసం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	138
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	274
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6878
వెండి కిలో ధర	రూ. 83,500
వెండి ఒక గ్రాము	రూ. 85.50

రెడ్‌క్రాస్‌కు ఫ్రీజర్ బహూకరణ

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 29 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి సోమవారం పడుగుపాడుకు చెందిన అలహరి వెంకట్రావు సంవత్సరీకం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఫ్రీజర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి, కార్యాలయం కార్యదర్శి మస్తానయ్య, అరిగెల సాయి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయితేనే ప్రజాసంక్షేమం

● మినగల్లు, పంచేడు ఎన్నికల ప్రచారంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం: ఎన్నికల ప్రచారంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కోవూరు: వైసీపీ నుంచి టీడీపీలో చేరిన యువకులు



కోవూరు: ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు



కొడవలూరు: సమావేశంలో మాట్లాడుతున్న పల్లంరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 29: చంద్రబాబునాయుడు ముఖ్య మంత్రి అయితేనే రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాల సంక్షేమం సమపాళ్ళలో జరిగి ప్రజా ప్రభుత్వంగా ఉంటుందని ఎన్డీఏ ఉమ్మడి కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్త, పాత మినగల్లు, పంచేడు, దళితవాడల్లో ఆయా గ్రామాల నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ అవ్వ, తాతల పింఛను రూ. 3వేలు నుంచి 4వేలకు పెంచి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జూన్‌లో రూ. 7వేలు అందజేస్తామన్నారు. మినగల్లులో డ్రైన్‌లు, సదరన్‌ఛానల్‌పై కూలిన బ్రిడ్జి, ములుమూడి డొంకను ఏర్పాటుతోపాటు రెండు గ్రామాలలో ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని మాటిచ్చారు. పంచేడు పరిధిలోని రెండు గిరిజన కాలనీలు, రెండు దళితవాడలు, పంచేడు ప్రధాన గ్రామంలో ప్రధాన రహదారుల్లో పర్యటించి బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. పార్టీలు, ప్రభుత్వాలకతీతంగా పంచేడు గ్రామానికి పలు సంక్షేమ పథకాలు ఇచ్చామని ప్రశాంతిరెడ్డి అన్నారు. కాగా, మినగల్లులో జరిగిన ఎన్నికల ప్రచారంలో స్థానిక వైసీపీ సర్పంచు బొర్రు పూజిత ప్రశాంతిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ విషయంపై స్థానిక వైసీపీతో పాటు ప్రజల్లో చర్చనీయాంశమైంది. పంచేడులో ఎన్నికల ప్రచారం అనంతరం సూరా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో 20 మందికి పైగా వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.

వైసీపీ యువ నేతలు టీడీపీలో చేరిక

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కుమారుడు డాక్టర్ అర్జున్‌రెడ్డి సమక్షంలో స్థానిక కొత్తూరు దళిత కాలనీకి వైసీపీకి చెందిన యువ నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తూరు దళితకాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడును ఎన్నుకోవాల్సి ఉందన్నారు. టీడీపీ అభ్యర్థుల్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, సీహెచ్ సాయితేజారెడ్డి, కాగొల్లు శ్రీనివాసులు, ఉప్పర్తి వేమయ్య, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రశాంతిరెడ్డి ధ్యేయం

కొడవలూరు: ప్రజల సంక్షేమమే ప్రశాంతిరెడ్డి ధ్యేయమని మాజీ గ్రంథాలయ చైర్మన్ మందిపాటి ప్రవీణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలో నార్తు రాజుపాళెం గ్రామంలో దిన్నె ప్రాంతంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తువ్వర ప్రవీణ్ కుమార్, కరటూరి మూరళి, నాసిన ప్రసాద్, మందిపాటి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాలి: పల్లంరెడ్డి

ప్రశాంతిరెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు పల్లంరెడ్డి సురేష్‌రెడ్డి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గ్రామ టీడీపీ కార్యకర్తలతో సోమవారం సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని మాఫియాలకు అడ్డాగా మార్చి ఓటమి భయంతో అసత్య ఆరోపణలు చేస్తున్న ప్రసన్నకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాలలోకి వచ్చిన వేమిరెడ్డి దంపతుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ సంక్షేమ పథకాలు ప్రజలను, మహిళలను ఆదుకోనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లంరెడ్డి సాయిమోహన్‌రెడ్డి, కిషోర్, దినేష్, పల్లంరెడ్డి సుజిత్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం

కోవూరు: టీడీపీ పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలను గెలిపించాలని కోరుతూ టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం పీఆర్ఆర్ కాలనీలో ప్రచారం చేపట్టారు. ప్రచారంలో రైతు నాయకుడు పచ్చిపాల విజయసాయిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయాలంటే టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ ప్రచారంలో నీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు బాలరవి, శ్రీధర్‌రెడ్డి, వాసు, వల్లెపు రాము, గోధుమ సుధీర్, టవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం, ఏప్రిల్ 29: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ సెమిస్టరు పరీక్షలలో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన 5వ, 6వ సెమిస్టర్ పరీక్షలలో 757 మంది, మధ్యాహ్నం జరిగిన నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో 315 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

సర్వేపల్లి బరిలో 13 మంది అభ్యర్థులు

వెంకటాచలం, ఏప్రిల్ 29 : వచ్చేనెల 13న జరిగే ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గం నుంచి 13 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. టీడీపీ నుంచి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వైసీపీ నుంచి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి పూల చంద్రశేఖర్, బీఎస్పీ నుంచి జానకిప్రసాద్‌తోపాటు మరో 9 మందిలో ముగ్గురు రిజిస్టర్ కాబడిన రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఆరుగురు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్నారు. కాగా, పోటీచేసే అభ్యర్థుల జాబితా, వారికి కేటాయించిన గుర్తులను సోమవారం ప్రకటించారు.

రేపటి నుంచి నృత్య శిక్షణ తరగతులు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 29 : నటరాజ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి జూన్ 10 వరకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నృత్య గురువు కోట నందకిషోర్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ శిక్షణ తరగతులు ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఈ వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్

ఎన్నికల పర్వం

సిటీలో 15.. రూరల్‌లో 11 మంది

- తుది పోరులో నిలిచిన అభ్యర్థులు
- పూర్తయిన నామినేషన్ల ఘట్టం
- ఆఖరి రోజు నలుగురు స్వతంత్రుల ఉపసంహరణ

నెల్లూరు (సిటీ/వెంకటేశ్వరపురం), ఏప్రిల్ 29 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఉపసంహరణలకు గడువు సోమవారంతో ముగిసింది. నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 15 మంది, రూరల్ నుంచి 11 మంది అభ్యర్థులు తుదిపోరులో నిలిచారు. సిటీ నుంచి మొత్తం 26 మంది నామినేషన్ వేయగా వాటిలో 8 దరఖాస్తులను వివిధ కారణాలతో అధికారులు తిరస్కరించారు. మిగిలిన 18 మందిలో సోమవారం ముగ్గురు స్వతంత్రులు పోటీ నుంచి తప్పుకుంటూ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో 15 మంది ఫైనల్ ఫైట్‌లో నిలిచినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఇక, రూరల్ నియోజకవర్గం విషయానికి వస్తే 13 మంది నామినేషన్లు దాఖలు చేయగా అందులో ఒకటి నిబంధనల మేరకు లేకపోవడంతో అధికారులు తిరస్కరించారు. మిగిలిన వారిలో స్వతంత్ర అభ్యర్థి షేక్ మస్తాన్‌వలీ తన నామినేషన్‌ను సోమవారం ఉపసంహరించుకున్నారు. దీంతో మే 13న జరిగే ఎన్నికల బరిలో 11 మంది అభ్యర్థులు నిలిచారు.

వరుస సంఖ్య	పోటీ చేస్తున్న అభ్యర్థి పేరు	రాజకీయ పార్టీ
నెల్లూరు సిటీ నియోజకవర్గం		
1.	పొంగూరు నారాయణ	టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి
2.	ఎండీ ఖలీల్ అహ్మద్	వైసీపీ
3.	చల్లా శరత్‌కుమార్	బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)
4.	మూలం రమేష్	కాంగ్రెస్, వామపక్ష కూటమి
5.	షేక్ అమీర్‌అహ్మద్	సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా
6.	కాళహస్తి చెంచు మహేష్	భారత చైతన్య యువజన పార్టీ
7.	ధర్మయ్యగారి సునీల్‌కుమార్	రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కరిస్టు)
8.	పొన్నపూడి శ్యామల	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా
9.	రఘునాథ్ రామిశెట్టి	జైభీమ్ రావ్ భారత్ పార్టీ
10.	గుండాల పద్మారెడ్డి	స్వతంత్ర అభ్యర్థి
11.	దాసరి గౌతమ్	స్వతంత్ర అభ్యర్థి
12.	నారు రవికుమార్‌రెడ్డి	స్వతంత్ర అభ్యర్థి
13.	బండారు వెంకట శ్రీధర్	స్వతంత్ర అభ్యర్థి
14.	వేలూరు రంగారావు	స్వతంత్ర అభ్యర్థి
15.	దేశాయిశెట్టి హనుమంతురావు	స్వతంత్ర అభ్యర్థి
నెల్లూరు రూరల్ నియోజకవర్గం		
1.	కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి	టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి
2.	ఆదాల ప్రభాకర్‌రెడ్డి	వైసీపీ
3.	షేక్ ఫయాజ్	కాంగ్రెస్, వామపక్ష కూటమి
4.	బీ శ్రీరాములు	బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)
5.	సయ్యద్ ఫాజిల్	సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా
6.	సూరిశెట్టి అనిల్‌కుమార్	రెవెల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ
7.	బొమ్మలాట సురేష్	స్వతంత్ర అభ్యర్థి
8.	కట్టా శిరీష్	స్వతంత్ర అభ్యర్థి
9.	షేక్ ముజీబ్	స్వతంత్ర అభ్యర్థి
10.	షేక్ సర్దార్ హుస్సేన్	స్వతంత్ర అభ్యర్థి
11.	జెడ్డా నిరంజన్	స్వతంత్ర అభ్యర్థి

రామ్మోహన్ మిశ్రాను కలిసిన కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 29 : ప్రత్యేక సాధారణ ఎన్నికల పరిశీలకుడు రామ్మోహన్ మిశ్రా సోమవారం నెల్లూరుకు విచ్చేశారు. ఆయనను ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ హరినారాయణన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ ఆరిఫ్ హఫీస్ కూడా మిశ్రాను కలిశారు.

వైసీపీ మేనిఫెస్టో అట్టర్ ఫ్లాప్

- ప్రచారంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి



నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 29 : వైసీపీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో అట్లర్ ఫ్లాప్ అని.. టీడీపీ మేనిఫెస్టో సూపర్ హిట్ అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం బాలాజీనగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేపీ చౌదరి, కమ్మ కల్యాణి, వెంకట రమణ, నరేష్, ఫిరోజ్, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సిటీ ఎన్నికల పరిశీలకుడిగా సతీష్ వేమన

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 29 : తెలుగుదేశం పార్టీ తరపున నెల్లూరు నగర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సతీష్ వేమనను అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా సోమవారం మాజీ మంత్రి, నగర అభ్యర్థి పొంగూరు నారాయణను ఆయన క్యాంపు కార్యాలయంలో సతీష్ కలిశారు. పలు రాజకీయ అంశాలపై, ఎన్నికల నిర్వహణపై చర్చించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు సతీష్‌కు అభినందనలు తెలియచేశారు.

కాంగ్రెస్, సీపీఎం రోడ్‌షో

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 29 : నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి కొప్పుల రాజు, నెల్లూరు సిటీ నియోజకవర్గం మిత్రపక్షాల ఎమ్మెల్యే అభ్యర్థి మూలం రమేష్ సోమవారం రంగనాయకులపేట, రైల్వేఫీడర్స్ రోడ్డు ప్రాంతాల్లో రోడ్‌షో నిర్వహించారు. రాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్‌ను తుంగలో తొక్కిందని, దళిత, ఆదివాసీల్లో నిరుద్యోగం తాండవిస్తోందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఢిల్లీలోని బీజేపీ పెద్దలకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, నాయకులు సంజయ్‌కుమార్, సుధీర్, కత్తి శ్రీనివాసులు, మోహన్‌రావు, శోభన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎంపీ అభ్యర్థి కొప్పుల రాజు కలెక్టర్‌గా జిల్లాకు ఎంతో చేశారని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర అన్నారు. సోమవారం నవాబుపేటలో రాజు సతీమణి వసుంధరతో కలిసి ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొప్పుల రాజును ఎంపీగా గెలిపించాలని కోరారు.

యువత ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఓటుహక్కు వినియోగంపై అవగాహన పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మహేంద్రరెడ్డి తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 29 : తొలిసారి ఓటుహక్కు పొందిన యువత రేపటి భవిష్యత్ కోసం ఓటు హక్కును వినియోగించుకోవాలని నెహ్రూ యువ కేంద్రం, జిల్లా యూత్ అధికారి డాక్టర్ ఏ మహేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు సోమవారం నెహ్రూ యువ కేంద్రంలో పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. నెల్లూరు జిల్లా స్వచ్ఛంద సంస్థ ఎన్నికల నిఘా కన్వీనర్ కే ఎస్ బాబా మాట్లాడుతూ మనం వేసే ఓటు భావితరాల అభివృద్ధి, భవితకు మంచిబాట వేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెస్ట్ సంస్థ కో ఆర్డినేటర్ బీ త్రిభునేశ్వర్, విశ్వాస్ సంస్థ నిర్వాహకుడు బీ శేషాద్రి, సయ్యద్ సా లార్, సయ్యద్ సర్తాజ్ సాహెబ్ పాల్గొన్నారు.

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరిస్తాం : కేతంరెడ్డి



నెల్లూరు (విద్య) : స్వర్ణకారుల సమస్యలన్నీ రానున్న కూటమి ప్రభుత్వంలో పరిష్కారమవుతాయని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్ రెడ్డి తెలిపారు. ఎన్డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణకు మద్దతుగా సోమవారం 47వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో స్వర్ణకార కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారి సమస్యలను వేమిరెడ్డి, నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

కట్టి ఐదేళ్లు...
కానీ నీడనివ్వవు!

- శిథిలావస్థలోనే ఏసీ బస్‌షెల్టర్లు
- టీడీపీ బ్రాండ్ కావడంతో పక్కనపెట్టిన వైసీపీ
- నగర వాసులకు అందని కొత్తఅనుభూతి



రాజరాజేశ్వరి ఆలయం వద్ద ఉన్న ఏళ్లుగా మూతపడి నిరుపయోగంగా ఉన్న ఏసీ బస్సు షెల్టర్

విదేశీ పరిజ్ఞానాన్ని నెల్లూరీయుల దరిచేరుస్తూ రోడ్లపై ప్రయాణికుల కష్టాలను తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం నగరంలో నిర్మించిన ఏసీ బస్‌షెల్టర్లు వైసీపీ పాలించిన ఐదేళ్లు శిథిలావస్థలోనే ఉండిపోయాయి. అప్పట్లో పట్టాణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రిగా పొంగూరు నారాయణ మలేషియా పర్యటనలో తారసపడిన ఏసీ బస్‌షెల్టర్లను నెల్లూరులో కూడా ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో 2014 - 19 మధ్య ప్రయోగాత్మకంగా నగరంలోని 8 ప్రాంతాల్లో వీటిని నిర్మించారు. ఒక్కోదానికి రూ.8 లక్షల చొప్పున ఖర్చు చేశారు. నిర్మాణం పూర్తయి ప్రారంభించే సమయానికి ఎన్నికలు రావడంతో ప్రారంభోత్సవం ఆగిపోయింది. ఎన్నికల అనంతరం వైసీపీ ప్రభుత్వం ఏర్పడటం, ఏసీ బస్ షెల్టర్లపై అప్పటికే టీడీపీ బ్రాండ్ ముద్ర పడటంతో కక్షకట్టిన జగన్ సర్కారు వీటిని వినియోగంలోకి తీసుకురాకుండా పక్కనపడేసింది. అటు కొత్త అనుభూతిని ప్రజలకు దూరం చేయడం, ఇటు రూ.లక్షల ఖర్చును వినియోగంలోకి తేకపోవడం ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. బస్‌షెల్టర్లను వేరే అవసరాలకూ వినియోగించని వైసీపీ ప్రభుత్వం అందులో అమర్చిన ఏసీలు అపహరణకు గురవుతున్నా పట్టించుకోలేదు. బ్యాంకులతో ఒప్పందం చేయించుకుని షెల్టర్లలో ఏటీఎం సదుపాయం కల్పించాలన్న ఉద్దేశంతో అప్పట్లో నారాయణ వీటిని రాష్ట్రానికి ఆదర్శంగా ఉండాలన్న లక్ష్యంతో నిర్మించారు. కానీ అవి ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.



కరెంట్ ఆఫీస్ కూడలి వద్ద శిథిలమవుతున్న ఏసీ బస్సు షెల్టర్

\- నెల్లూరు(సిటీ)

ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ పటిష్టంగా ఉండాలి : విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు(జడ్పీ), ఏప్రిల్ 29: వేసవిలో విద్యుత్ వాడకం పెరగడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే అవకాశం ఉన్నందున వాటి నిర్వహణను పటిష్టంగా చేపట్టాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ భవన్‌లోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే తరలించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా రైతులు, ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు కోట్లాది రూపాయలు ఖర్చవుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని నిర్వహణ పటిష్టంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున ప్రతి పోలింగ్ బూత్‌లో విద్యుత్ సరఫరా ఉండేలా అవసరమైన ఏర్పాట్లన్నీ చేయాలని ఆదేశించారు.

టీడీపీ వస్తే ఆడబిడ్డలకు మహర్దశ

- కాకుపల్లి ప్రచార రోడ్‌షోలో రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి


నిమ్మకాలతో కట్టిన గజమాలతో రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు


టీడీపీలో చేరిన సౌత్‌మోపూరు కార్యకర్తలతో గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 29 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి పేదింటిలోని ఆడబిడ్డకు మహర్దశ పడుతుందని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాకుపల్లి పంచాయతీలో ఎన్నికల ప్రచార రోడ్ షో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలకు వడ్డీలేని రుణాలతో పాటు మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్నారు. ఆడబిడ్డ నిధి కింద రూ.15 వేలు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేయడంతోపాటు ప్రతి ఇంట్లో వంటింటి కష్టాలు తీర్చేందుకు ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లను అందజేస్తారని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పేదలు, నిరుపేదలకు ఆర్థిక ప్రయోజనాలెన్నో సమకూరుతాయన్నారు. జాతీయ స్థాయి పరిశ్రమలను ఏపీకి తీసుకువచ్చి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో చేయలేకపోయిన పనులను టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నెల్లూరు లోని శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో 25వ డివిజన్‌కు చెందిన చల్లకూరు సుబ్రమణయ్య, ఓజిలి విజయ్‌కుమార్ మిత్రబృందం, 30వ డివిజన్‌కు చెందిన షాహిదా, ఖాజారెహ్మాతుల్లా, 23వ డివిజన్‌కు చెందిన వేలూరు మురళి, వినయ్, 26వ డివిజన్‌కు చెందిన చాంద్‌బాషా, మస్తాన్, 17వ డివిజన్‌కు చెందిన హరిబాబుగౌడ్, కోనేరు మల్లికార్జున్‌ను టీడీపీలోకి ఆహ్వానించారు. సౌత్‌మోపూరు, ములుముడి గ్రామాలకు చెందిన పలువురు కూడా టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కాకుపల్లి సర్పంచ్ కోసూరు సుభాషిణి, కుడుముల నాగేశ్వరరావుగౌడ్, కేశవులుగౌడ్, మాజీ సర్పంచ్ ఉప్పల ఈశ్వరయ్యగౌడ్ పాల్గొన్నారు.

అహంకారంతో నాశనం చేశారు

- జనసేన నాయకుడు సుజయ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 29: అహంకారంతో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాశనం చేశారని జనసేన పార్టీ నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు విమర్శించారు. నగరంలోని 16వ డివిజన్ గుర్రాలమడుగు సంఘంలో సోమవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగరం అభివృద్ధి చెందాలన్నా, రౌడీ మూకలను నగరం నుంచి తరిమేయాలన్నా ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణ, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో షఫ్రిక్ సాయిబాబా, అజయ్‌బాబు, కాంతర్ తదితరులు పాల్గొన్నారు.

మాగుంట కుటుంబానికి బీద పరామర్శ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 29 : మాజీ ఎంపీలు మాగుంట సుబ్బారామిరెడ్డి, పార్వతమ్మల కుమారుడు మాగుంట విజయ్‌బాబు ఇటీవల మరణించడంతో ఆ కుటుంబాన్ని సోమవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పరామర్శించారు. మాగుంట లే అవుట్‌లోని మాగంట నివాసానికి వెళ్లి విజయ్‌బాబు చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం పార్వతమ్మను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీద వెంట టీడీపీ ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, నాయకుడు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి ఉన్నారు.

జీజీహెచ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 29: నగరంలోని జీజీహెచ్‌లో గుర్తుతెలియని వ్యక్తి ఈ నెల 26వ తేదీ మృతి చెందాడని, ఆచూకీ తెలిసినవారు దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 55 ఏళ్ల వయసు కలిగిన ఆ వ్యక్తి ఎడమవైపు మెడపైన, ఎడమవైపు ఛాతీపైన పుట్టుమచ్చలు ఉన్నాయని ఉన్నాయని తెలిపారు. గోధుమ రంగుపై నలుపు నిలువు చారలున్న ఫుల్ హ్యాండ్స్ షర్టు, గ్రే కలర్ నైట్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 0861-2328440 నెంబరుకుగానీ, దర్గామిట్ట పోలీస్ స్టేషన్‌లోగానీ సమాచారం ఇవ్వాలని కోరారు.

ఏపీ అభివృద్ధిపై రేపు చర్చా గోష్టి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 29 : సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై చర్చా గోష్టి నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

కూరగాయల మార్కెట్‌లో నీటి సమస్య పరిష్కరిస్తాం

- టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ


ఏసీ మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వేమిరెడ్డి, నారాయణ, కోటంరెడ్డి తదితరులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 29 : నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్‌లో మంచినీటి సమస్యను పరిష్కరిస్తానని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ హామీ ఇచ్చారు. సోమవారం నారాయణ, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మార్కెట్‌లో మంచినీటి సమస్య అధికంగా ఉందని తన దృష్టికి వచ్చిందని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి అడుగంటి పోయిందని, వ్యాపారులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందరూ కలిసి ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వేమిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే హోల్‌సేల్ వ్యాపారస్తులందరూ సంతోషంగా ఉండేలా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, కేంద్రంలో ఎన్‌డీఏ కూటమితోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వ్యాపారస్తులందరూ కూడా రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను ఎంపీగా నగర, రూరల్ ఎమ్మెల్యేలుగా పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు.

● వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు...

ఎన్నికల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు అధికమయ్యాయి. నగరంలోని గోమతినగర్‌లో ఉన్న మాజీ మంత్రి పొంగూరు నారాయణ క్యాంపు కార్యాలయంలో సోమవారం నారాయణ సమక్షంలో పలు ప్రాంతాల వారు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతం నుంచి టీడీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. అధికార వైసీపీ నేతల అరాచకాలు భరించలేక, పార్టీలో సరైన గుర్తింపు లేక అన్ని వర్గాల ప్రజలు టీడీపీ కూటమిలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. అందరూ కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నేతలు పాల్గొన్నారు. అనంతరం నారాయణ సమక్షంలో దామవరపు రాజశేఖర్, శివకుమార్, అనిల్‌కుమార్, రఘురామిరెడ్డి, విజయ్‌కుమార్ వారి మిత్రబృందం టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పట్టాభిరామిరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

● నిరుపేదల కోసమే సూపర్‌సిక్స్

నిరుపేదలందరూ ఆర్థికంగా ఎదగాలన్న మంచి ఉద్దేశంతోనే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ పథకాలను తీసుకువచ్చారని పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం రాత్రి నగరంలోని 9వ డివిజన్‌లో జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. తాను, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డబ్బు కోసం రాజకీయాల్లోకి రాలేదని, సేవ చేసేందుకు వచ్చామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తమను గెలిపిస్తే నెల్లూరును స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుతామన్నారు.


నారాయణను సత్కరించి వేద ఆశీర్వచనం పలుకుతున్న అర్చకులు

● టీడీపీ వచ్చాక ఇసుక ఉచితం...

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుకను ఉచితంగా అందచేస్తుందని పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని 13వ డివిజన్‌లో ఆమె పర్యటించారు. ఒక్క అవకాశం పేరుతో వైసీపీకి ఓటు వేసి మోసపోయామని, నిత్యావసరాలు, పెట్రోలు, కరెంట్ చార్జీలు పెంచేసి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారన్నారు. ఇసుక ధరను ఆకాశానికి ఎత్తేసి నిర్మాణ రంగాన్ని దెబ్బతీయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇసుకను ఉచితంగా అందచేస్తే, వైసీపీ ప్రభుత్వం వేల రూపాయలకు అమ్ముకుంటోందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో నగర ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 45, 47 డివిజన్లలో నారాయణ కుమార్తె సింధూర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిఫిన్ దుకాణంలో దోసెలు వేస్తూ వ్యాపారులతో ముచ్చటించారు. టీడీపీని గెలిపించాలని కోరారు.

● నారాయణకు అర్చకుల ఆశీర్వచనం

మాజీ మంత్రి, నగర టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణకు అర్చకులు ఆశీస్సులు అందచేశారు. నగరంలోని గోమతినగర్ నారాయణ క్యాంపు కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఆధ్వర్యంలో అర్చక సమాఖ్య నాయకులు ప్రసాదాచార్యులు, శేషాచార్యులు, పలువురు అర్చకులు నారాయణను కలిసి సంఘీభావం తెలిపారు. ఎన్నికల్లో ఆయన విజయాన్ని ఆకాంక్షిస్తూ వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అర్చకుల పై దాడులు జరుగుతుండడం బాధాకరమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్చకుల సమస్యలు పరిష్కరించడంతోపాటు అర్చకులకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబు నాయుడుతో మాట్లాడి అర్చకుల జీతభత్యాల విషయంలో మంచి నిర్ణయం తీసుకుంటామని, వారి సంక్షేమానికి పెద్ద పీట వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు ఆమంచర్ల ప్రభాకర్, నవులూరు శ్రీకృష్ణ, పెనుబర్తి సాయిరాం, పూజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 30 ఏప్రిల్ 2024

ఎన్నికల బరిలో 156మంది



జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఘట్టం ముగిసింది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక జిల్లాలో 156మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో మిగిలారు. తిరుపతి లోక్ సభ స్థానానికి 23మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 133మంది పోటీలో వున్నారు. ఎంపీ స్థానానికి 27మంది నామినేషన్లు వేయగా అందులో ముగ్గురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 24 మందిలో ఒకరు నామినేషన్ ఉపసంహరించుకోగా 23 మంది పోటీలో వున్నారు. అలాగే తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు, వెంకటగిరి తదితర ఏడు నియోజకవర్గాలకు 200 మంది నామినేషన్లు దాఖలు చేయగా అందులో 47 మంది నామినేషన్లు చెల్లుబాటు కాలేదు. మిగిలిన 153లో 20 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో 133మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ నుంచీ 46 మంది అభ్యర్థులు పోటీలో వుండగా చంద్రగిరిలో 24 మంది, శ్రీకాళహస్తి, సత్యవేడుల్లో 15 మంది చొప్పున, గూడూరు నుంచీ 14 మంది, వెంకటగిరి నుంచీ పది మంది, సూళ్ళూరుపేట నుంచి తొమ్మిది మంది పోటీలో వున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పార్లమెంటుకు 23మంది... ఏడు అసెంబ్లీ స్థానాలకు 133మంది అభ్యర్థులు

తిరుపతిలో అత్యధికంగా 46 మంది... అత్యల్పంగా సూళ్ళూరు పేటలో 9 మంది

సత్యవేడులో రెబెల్ అభ్యర్థి జేడీ రాజశేఖర్‌ను సస్పెండ్ చేసిన టీడీపీ

తిరుపతి అసెంబ్లీకి మూడు ఈవీఎంలు

ఈవీఎంలో గరిష్ఠంగా 17 మంది అభ్యర్థుల పేర్లు, చిహ్నాలు మాత్రమే వుంటాయి. తిరుపతి అసెంబ్లీకి 46 మంది బరిలో వున్నందున వారందరి పేర్లు, గుర్తులు అప్‌లోడ్ చేయడానికి మూడు ఈవీఎంలు అవసరమవుతున్నాయి. అందువల్ల ప్రతి ఓటరూ అభ్యర్థుల పేర్లు,గుర్తులూ పరిశీలించి ఓటు వేయడానికి మూడు ఈవీఎంలను పరిశీలించాల్సి వుంటుంది.అలాగే చంద్రగిరి అసెంబ్లీకి కూడా 24 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నందున రెండు ఈవీఎంలను వినియోగించాల్సి వుంటుంది. తిరుపతి ఎంపీ స్థానానికి కూడా 23 మంది పోటీలో వున్నందున అక్కడా రెండు ఈవీఎంల వినియోగం తప్పనిసరి. దీన్నిబట్టి తిరుపతి సెగ్మెంట్‌లో పార్లమెంటుకు రెండు ఈవీఎంలు, అసెంబ్లీకి మూడు ఈవీఎంలు చొప్పున ప్రతి ఓటరు ఐదు ఈవీఎంలు పరిశీలించి ఓటు వేయాల్సి వుంటుంది. చంద్రగిరి సెగ్మెంట్ చిత్తూరు పార్లమెంటు పరిధిలో వుంది. ఇక్కడ పార్లమెంటుకు 19 మంది అభ్యర్థులు బరిలో వున్నారు. అందువల్ల పార్లమెంటుకు రెండు, అసెంబ్లీకి రెండు చొప్పున నాలుగు ఈవీఎంలను ఓటర్లకు అందుబాటులో వుంచాల్సి వుంది. మిగిలిన అన్ని సెగ్మెంట్లలో పార్లమెంటుకు రెండు, అసెంబ్లీకి ఒకటి చొప్పున మూడు ఈవీఎంలు చొప్పున ఓటర్లకు అందుబాటులో వుంచాల్సి వస్తోంది.

సత్యవేడులో రెబెల్ కలకలం

సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ నేత జేడీ రాజశేఖర్ ఆ పార్టీ రెబెల్ అభ్యర్థిగా బరిలో నిలవడం కలకలం సృష్టించింది.గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన రాజశేఖర్ గత ఐదేళ్ళూ పార్టీనే అంటిపెట్టుకుని వున్నారు. ఇంఛార్జి ఇవ్వకపోయినా పార్టీ కార్యక్రమాలు చేపడుతూ వచ్చారు. తాజా ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. దీంతో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా చివరలో ఉపసంహరించుకుంటారని పార్టీ శ్రేణులు, నేతలు భావించారు.అయితే సోమవారం నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. ఆయన నామినేషన్ విత్‌డ్రా చేయకుండా బరిలో ని లవడం సత్యవేడులో పార్టీకి ఇబ్బందికరంగా మారింది.స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో వున్న రాజశేఖర్‌కు ఎన్నికల కమిషన్ ఎయిర్ కూలర్ గుర్తు కేటాయించింది.సోమవారం రాత్రి జేడీ రాజశేఖర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు టీడీపీ ఓ ప్రకటనలో పేర్కొంది.పార్టీ నియమ నిబంధనలను అతిక్రమించి నందున ఆయన్ను నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆ ప్రకటనలో తెలిపారు.

తిరుపతిలో స్వతంత్ర అభ్యర్థుల సంఖ్యపై అనుమానాలు

తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో మొత్తం 46 మంది అభ్యర్థులు బరిలో వుండగా ప్రధాన రాజకీయ పక్షాలైన జనసేన, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ వంటి నాలుగైదు పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన వారంతా గుర్తింపు లేని పార్టీల తరపున, ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న వారే. జిల్లాలో మరెక్కడా లేని విధంగా ఇక్కడే ఎందుకు ఇంతమంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో వున్నారన్న ప్రశ్న పలువురిలో తలెత్తుతోంది.అధికార పార్టీ నేతలు ఎన్నికల్లో తమకు అనుకూలతలను, వెసులుబాట్లను సృష్టించుకోవడానికి పలువురితో ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వాహనాల వినియోగానికి, జనరల్ ఏజంట్లుగా, పోలింగ్ ఏజంట్లుగా, ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ ఏజంట్లుగా తమ అనుయాయులను ఎక్కువమందిని అందుబాటులో వుండేలా ఈ జాగ్రత్తలు తీసుకున్నారనే అభిప్రాయం కూటమి పార్టీల నేతలు వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల పోలింగ్ కేంద్రాల్లో కూడా ఎక్కువ సంఖ్యలో వారికి అనుకూలమైన ఏజంట్లు కూర్చునే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు.

అసెంబ్లీస్థానం	మొత్తం అభ్యర్థులు	తిరస్కరించినవి	విత్‌డ్రా	పోటీలో వున్నది
గూడూరు	21	6	1	14
సూళ్ళూరుపేట	16	2	5	9
వెంకటగిరి	17	7	0	10
చంద్రగిరి	43	17	2	24
తిరుపతి	52	4	2	46
శ్రీకాళహస్తి	27	4	8	15
సత్యవేడు	24	7	2	15
మొత్తం	200	47	20	133
పార్లమెంటు తిరుపతి	27	3	1	23

బరిలో మిగిలిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ....

సెగ్మెంట్	అభ్యర్థుల సంఖ్య	టీడీపీ కూటమి	వైసీపీ	కాంగ్రెస్	బీఎస్పీ
తిరుపతి	46	అరణి శ్రీనివాసులు(జనసేన)	భూమన అభినయ్	పి.మురళి(సీపీఐ)	జె.వేణుగోపాల్ రాజు
చంద్రగిరి	24	పులివర్తి వెంకటమణిప్రసాద్	చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి	కె.శ్రీనివాసులు	....
సత్యవేడు	15	కోనేటి ఆదిమూలం	నూకతోటి రాజేశ్	బాలగురవం బాబు	సి.సుప్రియ
శ్రీకాళహస్తి	15	బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి	బియ్యపు మధుసూదన్‌రెడ్డి	పి. రాజేశ్‌నాయుడు	కె.సురేంద్రబాబు
సూళ్ళూరుపేట	09	నెలవల విజయశ్రీ	కిలివేటి సంజీవయ్య	చందనమూడి శివ	తొప్పాని రమణయ్య
గూడూరు	14	పాశం సునీల్‌కుమార్	మేరిగ మురళీధర్	యు.రామకృష్ణారావు	అన్నెం మల్లిఖార్జున
వెంకటగిరి	10	కురుగొండ్ల రామకృష్ణ	నేదురుమల్లి రామ్‌కుమార్	పంట శ్రీనివాసరెడ్డి	జయచంద్ర
తిరుపతి పార్లమెంటు	23	వెలగపల్లి వరప్రసాదరావు(బీజేపీ)	మద్దిల గురుమూర్తి	చింతా మోహన్	పెనుమూరు గుర్రప్ప

శ్రీకాళహస్తిలో ఇండిపెండెంట్‌కు గ్లాస్ టంబ్లర్ గుర్తు కేటాయింపు

శ్రీకాళహస్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీలో వున్న తీగల భాస్కర్‌కు ఎన్నికల అధికారులు గ్లాస్ టంబ్లర్ గుర్తు కేటాయించారు. దీంతో ఎన్డీయే కూటమి శిబిరంలో ఆందోళన నెలకొంది. నియోజకవర్గంలో జనసేన పార్టీ ఇటీవల కొంతమేరకు పుంజుకుంది. ఆ పార్టీ ఎన్నికల చిహ్నమైన గాజు గ్లాసును పోలిన గ్లాస్ టంబ్లర్‌ను ఇండిపెండెంట్‌కు కేటాయించడంతో జనసేన ఓట్లు కొంతమేరకు చీలే ప్రమాదముందని కూటమి పార్టీల నేతలు అనుమానిస్తున్నారు.

ఊపందుకోనున్న ప్రచారం

నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఇక ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది. ఇప్పటి వరకూ నామినేషన్లు దాఖలు చేయడం, వాటి పరిశీలనలో పాల్గొనడం, ఉపసంహరణల గడువు దాకా పరిణామాల కోసం నిరీక్షించడం వంటి వాటితో పూర్తిస్థాయిలో ప్రచారంలో పాల్గొనే అవకాశం ప్రధాన పార్టీల అభ్యర్థులకు లేకుండాపోయింది. ఇపుడు బరిలో మిగిలిన అభ్యర్థుల జాబితా విడుదల చేయడంతో పాటు గుర్తింపు లేని రాజకీయ పార్టీల అభ్యర్థులకు, స్వతంత్రులకు గుర్తులు కూడా కేటాయించేశారు. అందువల్ల బరిలోని అభ్యర్థులపై స్పష్టత రావడంతో మంగళవారం నుంచీ పూర్తిస్థాయిలో ప్రచారం హోరెత్తనుంది. రోడ్ షోలు, వీధుల్లో వెళుతూ కనిపించిన వారికి నమస్కారాలు పెడుతూ సాగిన అభ్యర్థులు ఇపుడు వీలైనంతవరకూ ఇంటింటి ప్రచారం చేపట్టనున్నారు. ప్రస్తుతానికి ద్వితీయ శ్రేణి, స్థానిక నేతలు, కార్యకర్తలు మాత్రమే ఇంటింటి ప్రచారంలో వున్నారు. అభ్యర్థులు మొత్తం నియోజకవర్గం కవర్ చేసే పరిస్థితి లేనందున ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో పర్యటించి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. పోలింగ్ గడువు సమీపించేయడంతో క్షేత్రస్థాయిలో పట్టు బిగించేందుకు, తెర వెనుక మంతనాలకు, పంపకాలకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశముంది. మొత్తానికి ప్రచారం నేటి నుంచీ పూర్తిస్థాయిలో హోరెత్తనుంది.

ప్రచారాల్లో శాంతిభద్రతల ఉల్లంఘనలు సహించం

● కలెక్టర్ హెచ్చరిక




మీడియా సమావేశంలో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 29: ఎన్నికల ప్రచారాలను అభ్యర్థులు బాధ్యతగా నిర్వహించాలని... శాంతిభద్రతలకు విఘాతం కల్పించే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ కేటాయించిన సమయంలో నేనాయకులు ప్రచారాలను నిర్వహించాలని లేనిపక్షంలో వారిపై చర్యలుంటాయన్నారు.జిల్లాలో మే 13న జరగనున్న పోలింగ్‌కు సమర్థవంతమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి మంగళవారం నాటికి ఈవీఎంలు తెప్పిస్తున్నట్లు చెప్పారు.నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిశాక బరిలో మిగిలిన వారికి గుర్తులు కూడా కేటాయించినట్లు తెలిపారు.పోలింగ్ విధులు కేటాయించిన సిబ్బందికి మే 2న శిక్షణ ఇస్తామన్నారు.ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు సంబంధించి 22,416మందికి పోస్టల్‌బ్యాలెట్ దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు. సర్వీసు ఓటర్లకు సంబంధించి మంగళవారం నుంచి ఈటీబీఎస్ పద్ధతిలో పంపుతున్నామని, వారు సంబంధిత ఆర్వోకు పంపనున్నారని వివరించారు.ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తరువాత 774 కేసులకు సంబంధించి 18 కేసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, 10కేసులపై చార్జ్‌షీట్ ఫైల్ చేయడం జరిగిందని, మిగిలిన 600కేసులు దర్యాప్తులో ఉన్నాయన్నారు.రూ.1.52కోట్ల నగదు, రూ.51.17కోట్ల విలువ చేసే లిక్కర్ సీజ్ చేశామన్నారు.



నిడిగల్లు అడవుల్లో ఖాళీ కంటైనర్!



బాలాయపల్లి, ఏప్రిల్ 29:బాలాయపల్లి మండలంలోని నిడిగల్లు అడవుల్లో ఓ కంటైనర్‌ను స్థానికులు గుర్తించారు. సమాచారం అందించడంతో తహసీల్దార్ పుల్లారావు, ఎస్ఐ మహబూబ్ సుభాని సిబ్బందితో అడవిలోకి వెళ్లి కంటైనర్ తాళాలను తొలగించి పరిశీలించారు. కంటైనర్ ఖాళీగా ఉండడాన్ని గమనించారు. అయితే అడవిలో కంటైనర్‌ను ఎందుకు వదిలేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కంటైనర్‌లో మద్యం తీసుకొచ్చి ఇక్కడినుంచి తరలించి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు.

తిరుమలలో 'కూటమి' ప్రచారాన్ని అడ్డుకున్న అధికారులు

పోలీసులతో అభ్యర్థి, నాయకుల వాగ్వాదం

తిరుమల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కూటమి నాయకుల ప్రచారాన్ని మధ్యలో పోలీసులు అడ్డుకున్నారు. కూటమి తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుతో కలిసి జనసేన నేత కిరణ్‌రాయల్, టీడీపీ నేతలు పనబాక లక్ష్మి, సుగుణమ్మ, నరసింహ యాదవ్, జేబీ శ్రీనివాస్, ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం తిరుమలలో సోమవారం ఉదయం ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. జీరోలైన్ నుంచి ఐదోలైన్ వరకు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎన్నికల ప్రవర్తన నియామావళి (ఎంసీసీ) అధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి డీఎస్పీ శ్రీనివాసాచారి, ఐసీ సత్యనారాయణ, సిబ్బంది కలిసి బాలాజీనగర్‌కు చేరుకున్నారు. వెంటనే ప్రచారాన్ని ఆపేయాలంటూ ఆదేశించారు. ప్రచారాల్లో ఘర్షణలు చోటుచేసుకున్న నేపథ్యంలో తాజాగా మరోసారి అనుమతి పొందాకే కొనసాగించాలంటూ అడ్డుకున్నారు. ముందస్తుగా నోటీసు ఇవ్వకుండా ఇలా ప్రచారాన్ని మధ్యలో అడ్డుకోవడం ఏంటంటూ ఆరణి, కిరణ్‌రాయల్ పోలీసులను ప్రశ్నించారు. రేపటినుంచి తాజా నిబంధనలను పాటిస్తామన్నారు. ఈక్రమంలో అధికారులు, కూటమి నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. చివరకు అధికారులు సర్దిచెప్పడంతో కూటమి నాయకులు ప్రచారాన్ని ఆపేసి వెళ్లిపోయారు.



కూటమి అభ్యర్థి, నాయకుల ప్రచారాన్ని అడ్డుకుంటున్న అధికారులు, పోలీసులు

చంద్రగిరి టీడీపీ అభ్యర్థి నానీకి రక్షణ కల్పించండి

పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీకి తక్షణం వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ కల్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం ఆదేశాలిచ్చారు. తమకు సెక్యూరిటీ కల్పించేలా తిరుపతి జిల్లా ఎస్పీ, పోలీసులను ఆదేశించాలని కోరుతూ పులివర్తి నానీ, ఆయన సతీమణి, కుమారుడు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపించారు.

బైకులకు భలే గిరాకీ !

అవునండీ.. ఇది నిజం ! ఈ సారి ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు బైక్‌లతో రోడ్‌షోలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అందుకే బైకులకు యమా గిరాకీ. గ్రామాల్లో యువకులు తమ బైకులతోపాటు తెలిసిన వాళ్ల బైకులను రోడ్‌షోలకు తీసుకు వస్తున్నారు. మెడలో కండువా వేయించుకొని, బైక్‌కి జెండా కట్టేస్తే సరి...? బైక్‌కి రూ.200 పెట్రోల్ కొట్టించడం, మరో రూ.300 చేతికి



ఇస్తుండటంతో రూ.500 గిట్టుబాటు అవుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఈ సారి ఎన్నికల్లో బైక్‌లకు గిరాకీ పెరగడం విశేషంగా పేర్కొంటున్నారు.

\- కలిగిరి

వీధుల్లో మైకులు.. ఇళ్లలో సెల్‌ఫోన్లు !

- అభ్యర్థుల ప్రచార హోరు
- సగటు ఓటర్ల విసుగు

ఈ ఎన్నికల్లో నాయకులు గతానికి భిన్నంగా ప్రచారం చేస్తున్నారు. వీధుల్లో మైకులతో హోరెత్తిస్తుండగా, ఇళ్లల్లో సెల్‌ఫోన్‌లకు అభ్యర్థుల ఫోన్ చేస్తున్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడం, స్మార్ట్ ఫోన్‌లు ప్రతి ఇంటా ఉండడంతో అభ్యర్థులు వాట్సప్ ద్వారా ప్రతిఅంశం షేర్ చేస్తున్నారు. తమకు ఓటు వేస్తే చేయబోయే అంశాలను ఐవీఆర్ ద్వారా చెప్తున్నారు. వారం రోజులుగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల తరుపున ఆయా పార్టీల మద్దతుదారులు పార్టీ కార్యాలయాల ప్రతినిధులు ఫోన్ చేసి వచ్చేనెల 13న జరిగే పోలింగ్‌లో తమ అభ్యర్థికి ఓటు వేయాలని పదేపదే కోరుతున్నారు. దీనివల్ల ఫోన్‌రింగ్ అవుతున్న సమయంలో లిఫ్ట్ చేసేందుకు చాలామంది ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. గుర్తుతెలియని నెంబర్లు నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేయడానికి ఇష్టపడడంలేదు. బంధువులు, స్నేహితులు పనులపై చేసే సమయంలో కూడా ఈ నెంబరు ఎవరిదోనని తికమక పడుతున్నారు. ప్రశాంతత కోరుకునే గ్రామీణులు ఎక్కువగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటారు. కొద్దిరోజులుగా అనేకసార్లు ఫోన్లు వస్తుండడంతో విసుగుచెందుతున్నారు.



ఎన్నికల ప్రచారాలతో విసిగిపోతున్న జనం

\- ఉదయగిరి

బయట ఊర్లలో మనవాళ్లెవరు ?

- ఓటరు జాబితా తిరగేస్తున్న నేతలు

బయట ఊర్లలో నివాసముంటున్న మన ఊరి ఓటర్లు ఎవరు... అందులో మన వర్గం ఎవరు.. వాళ్లకు ఖర్చు పెట్టి తీసుకువచ్చినా మన పార్టీకే ఓట్లేసే వాళ్ల ఎంత మంది... ?అని అంటూ బూత్ స్థాయి నాయకులు ఓటర్ల జాబితాను జల్లెడ పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల సమరంలో ప్రధాన పార్టీల మధ్య పోటీ తీవ్రత పెరిగింది. దీంతో ప్రతీ ఓటు కీలకంగా మారింది. ఈ క్రమంలో ఇక్కడ ఓట్లుండి బయట ఊర్లలో నివాసాలుంటున్న వారి వివరాలను రాజకీయ పార్టీల నాయకులు అన్వేషిస్తున్నారు. ఓటర్ల జాబితాలను దగ్గరపెట్టుకుని కొందరు ఆరా తీస్తుండగా, వలంటీర్ల సహాయంలో మరికొందరు నాయకులు బయట ఓట్ల కోసం పాకులాడుతున్నారు. బయట ఊర్లలో



ఉన్న ఇక్కడ ఓటర్లకు ప్రయాణ ఖర్చులన్నీటిని భరించి వారిని మే 13వ తేదీనాటికి తీసుకువచ్చేందుకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రైళ్లు, బస్సుల్లో రిజర్వేషన్లు పూర్తవగా, అందులో అవకాశం లేనివారిని కార్లలో తీసుకు వచ్చేందుకు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

\- నెల్లూరురూరల్

అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం మొండివైఖరే అవలంభిస్తోంది. సమ్మె విరమణ సందర్భంగా వారితో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఎన్నికలకు ముందు చేసుకున్న ఒప్పందాలను అమలు చేయడంలో ఉద్యోగులతో చెడుగుడు లాడుకుంటోంది. సమ్మె కాలానికి ఇస్తామన్న వేతనాలు నేటికీ అంగన్‌వాడీలకు అందలేదు. అదిగో., ఇదిగో ఇస్తామన్న ప్రభుత్వం ఆ సంగతినే విస్మరించింది. కాగా జూన్ తర్వాత ఏర్పడే ప్రభుత్వంపైనే అంగన్‌వాడీలు ఆశలు పెట్టుకుంటున్నారు.

\- నెల్లూరు (వైద్యం)

- సమ్మె కాలానికి వేతనం ఏదీ... ?
- 11 ఒప్పందాల్లో ఐదు మాత్రమే అమలు
- మా ఆవేదన అర్థం చేసుకోవా జగనన్నా... : అంగన్‌వాడీలు



ఇచ్చినమాట ఏమైందన్నా...?

అంగన్‌వాడీల సమ్మె ఓ చారిత్రాత్మకం. ఏకంగా 42 రోజలపాటు అంగన్‌వాడీలు తమ కేంద్రాలను మూసివేసి సమ్మెబాట పట్టారు. ఎట్టకేలకు దిగివచ్చిన వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలతో పలు ఒప్పందాలు చేసుకుని, వాటిని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. సమ్మె కాలానికి కూడా వేతనాలు ఇస్తామని అంగీకరించింది. ఇది జరిగి మూడు నెలలు దాటింది. అయితే ఇంతవరకు వేతనాలు మాత్రం అందలేదు. ఫైనాన్స్ క్లియరెన్స్ పూర్తి అయినా సీఎం జగన్మోహన్‌రెడ్డి వద్దే అంగన్‌వాడీల వేతనాల నివేదిక ఉన్నా నేటికి అవి పరిష్కారం కాలేదు. జిల్లాలో అంగన్‌వాడీలు మాత్రం సమ్మె కాలానికి వేతనాల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. జిల్లాలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి వీటిల్లో 5,639 మంది అంగన్‌వాడీలు, హెల్పర్లు పనిచేస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ. 11,500 వేతనాలు ఇస్తుండగా హెల్పర్లకు రూ. 7వేలు ఇస్తున్నారు. డిసెంబర్ 14న అంగన్‌వాడీలు సమ్మె చేపట్టగా జనవరి 24వ తేదీ వరకు కొనసాగింది.

ఒప్పందాలు అమలు జరిగేనా?

సమ్మె సందర్భంగా 11 డిమాండ్‌లను అంగన్‌వాడీలు ప్రభుత్వం ముందు ఉంచారు. వాటన్నిటి అమలు చేస్తామని ప్రభుత్వం వారితో ఒక అంగీకారానికి వచ్చింది. అయితే ప్రస్తుతం ఐదు డిమాండ్‌లు మాత్రమే అమలు అవుతున్నాయి, మిగిలిన వాటిని త్వరలో అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అయితే నేటికీ అవి అమలు కాలేదు. అంగన్‌వాడీ వేతనాల పెంపునకు యూనియన్లకు హామీ ఇచ్చారు. అయితే జూలై నుంచి వేతనాలు పెరుగుతాయని మెలిక పెట్టింది. గ్రేడ్ - 2 సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్ష రాసి పెండింగ్‌లో ఉన్న 164 గ్రేడ్ - 2కు ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికల కోడ్ రావటంతో ఈ ప్రతిపాదన ఆగిపోయింది. నాలుగు యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా రూపొందిస్తామని ప్రభుత్వం వెల్లడించింది. అదీ కూడా అమలు కాలేదు. వేతనాలతో కూడిన మెడికల్ లీవ్, పోషణ మెనూ చార్జీల పెంపు, గ్యాస్ తదితర సమస్యలకు కమిటీ వేయిస్తామని హామీ ఇచ్చింది. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియదు. మినీ అంగన్ వాడీలను మెయిన్ సెంటర్‌లుగా చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అయితే నేటికీ అమలులోకి రాలేదు.



వేతన బకాయిలు ఇంకా ఇవ్వలేదు

సమ్మెకాలానికి వేతనాలు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పట్లో అవి వస్తాయన్న నమ్మకం లేదు. ప్రస్తుతం ఎన్నికలు ఉండటంతో ప్రభుత్వం అధికారులు వేతన బకాయిలు చెల్లించే అవకాశం ఉన్నా ఆదిశగా కృషి చేయటం లేదు. వచ్చే ప్రభుత్వమైనా వేతనాలు చెల్లిస్తుందని ఆశిస్తున్నాం.

\- సుజాత, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నాడు మునెమ్మ.. నేడు ప్రశాంతి

- కోవూరు పోరులో రెండో మహిళగా పోటీ
- నియోజకవర్గంలో నారీమణుల ఓట్లే ఎక్కువ

మేము రాజకీయం

కోవూరు నియోజకవర్గంలో ఎప్పటి నుంచో మహిళాశక్తి రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. మహిళా ఓటర్లే అధికంగా ఉన్న నియోజకవర్గమిది. మహిళలే రాజకీయాల్ని శాసించే సెగ్మెంట్ కోవూరు. 2,61,125 మంది ఓటర్లలో 1,34, 835 మంది మహిళా ఓటర్లు ఉండటం విశేషం. పురుషుల కంటే మహిళా ఓటర్లే 8,565 ఎక్కువమంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 1951 నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానపక్షాలు మహిళలకు అవకాశం కల్పించడం లో విఫలమయ్యాయి. బెజవాడ గోపాలరెడ్డి ఆంధ్రరాష్ట్ర ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వవ్వేరు పంచాయతీని మహిళలే స్వాధీనం చేసుకోవడం అప్పట్లో సంచలన మైంది. కోవూరు మండల పరిధిలోని లేగుంటపా డులో పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన మహిళలు దేశవ్యాప్త ఖ్యాతిని ఆర్జించారు. సారానిషేధం, అక్షరాస్యతా ఉద్యమాల్లో కోవూరు ఖ్యాతిని ఎలుగెత్తి చాటిన మహిళలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచా టుతూనే ఉన్నారు.టీడీపీ అభ్యర్థిగా బుచ్చికి చెందిన ఉక్కాల రాజేశ్వర మ్మ 1999లో జరిగిన ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా గెలుపొందారు. విడవలూరు మండలం చౌకచర్లకు చెందిన నాగభూష ణమ్మ ఎన్టీఆర్ ప్రభుత్వ హయాం లో జడ్పీ ఛైర్‌పర్సన్‌గా గెలుపొందారు. అన్ని రంగాల్లో సత్తా చాటుతున్న నియోజకవర్గ మహిళలు అసెంబ్లీ ఎన్నికలకు మాత్రం దూరంగా ఉండిపో యారు. కాగా 2009లో జరిగిన త్రిముఖ పోటీలో ప్రజారా జ్యం పార్టీ తరఫున గిరిజన సామాజికవర్గానికి చెందిన తుపాకుల మునెమ్మను ఆ పార్టీ అధ్యక్షుడు చిరంజీవి పోటీకి నిలిపారు. ఆమె పోటీ అప్పట్లో సంచలనం రేపింది. ఓ గిరిజన మహిళ ప్రధాన పార్టీల అభ్యర్థులను ఢీకొని సత్తాచాటారు. కాగా ఈసారి ఎన్నికల్లో టీడీపీ తరఫున నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వేమి రెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి ప్రశాంతిరెడ్డిని టీడీపీ తరఫున పోటీకి నిలిపారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలతో హడావిడిగా ఉండే ఆమె, సుదీర్ఘ కాలం ఎమ్మెల్యేగా పనిచేసిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని ఢీకొంటున్నారు. మహిళలంతా సర్వశక్తులు ఒడ్డి ఆమె విజయానికి పాటుపడుతున్నారు.



తుపాకుల మునెమ్మ



వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

\- కోవూరు

రాజకీయ సభల్లో అల్లరి నేరమే !

- కరపత్రాలకు అనుమతి అవసరం
- వేసిన ఓటు రహస్యమే..

రూల్స్ సుర్యున్నాయా..?

ఏదైనా రాజకీయ పార్టీ నిర్వహించే సభలో ఆ పార్టీకి సంబంధంలేని వ్యక్తి అల్లరి చేస్తే ఈసీ నిబంధనల మేరకు నేరమే అవుతుంది. అభ్యర్థులు ప్రచారానికి గ్రామాలకు వెళ్లినప్పుడు సమావేశాలను అడ్డుకోవడం, భంగపరచడానికి ప్రయత్నించడం కూడా అపరాధమే అవుతుంది. ఇలాంటి నేరాలకు పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష , రూ. 2 వేల జరిమానా విధించే అవకాశం ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి పూర్తయ్యేవరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. సభకు అధ్యక్షత వహించే నాయకుడు అనుమానం వచ్చిన వ్యక్తిని గురించి వివరాలను రాబట్టుకోవచ్చు. పోలీసులకు కూ డా ఆ వ్యక్తి వివరాలను చెప్పకపోతే అతడ్ని వారంట్ లేకుండా నిర్బంధంలోకి తీసుకునే వీలుంది. అలాగే ప్రచారానికి సంబంధించిన కరపత్రాలపై ప్రచురణకర్త చిరునా మా తప్పనిసరిగా ఉండాలి. చిరునా మా లేకుండా కరపత్రం, పోస్టర్ ము ద్రించి ప్రచారం చేస్తే ఆరు నెలల జైలుశిక్ష, రెండువేల రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది.

వేసిన ఓటు రహస్యమే..

ఓటరు వేసిన ఓటును ఎన్నికల అధికారులు రహస్యంగా ఉంచాలి. ఓటు రహస్య స్వభావాన్ని పరిపూర్ణంగా పరిరక్షించకపోతే మూడు నెలల జైలుశిక్ష, జరిమానా విధించవచ్చని ఈసీ నియమావళిలో పొందుపరచింది. ఏ వ్యక్తి ఓటరునూ కూడా ప్రభావితం చేసేలా ఎన్నికల అధికారులు, పోలీసులు ప్రవర్తించరాదు. ఎవరికైనా ఓటు వేయమని చెప్పినట్లు రుజువైతే ఆరు నెలల జైలుశిక్ష తప్పదు.

\- సంగం

ఉప్పు రైతులకు ఉపకారమేది ?

- హామీలకే పరిమితమైన వసతుల కల్పన
- పట్టించుకోని పాలకులు

అల్లూరు, ఏప్రిల్ 29: ఉప్పు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువయింది. రోజురోజుకీ తగ్గుతున్న ధరలతో ఉప్పు రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఇక్కడి ఉప్పును ఏళ్లతరబడి ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటారు. అయినా ధరలు ఆశాజనకంగా లేవు. రెండేళ్ల క్రితం క్వింటా ఉప్పు ధర రూ,500 వరకు పలికింది. గత ఏడాది ఆ ధర రూ.250కి పడిపోయింది. ఈ ఏడాది రూ.150కి పడిపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఇంత జరుగుతున్నా ఉప్పు రైతులకు ఏనాడూ ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందలేదు. వీరికి ఎటువంటి రాయితీలు ఇవ్వలేదు. ధరల నియంత్రణ చర్యలను ప్రభుత్వం చేపట్టలేదు.

ప్రోత్సాహమేది ?

మిగతా రైతులకు ఇస్తున్న ప్రోత్సాహం ఉప్పు రైతులకు ఇవ్వడం లేదు. రాయితీతో బోర్ల ఏర్పాటు, మోటార్ల పంపిణీ, విద్యుత్ చార్జీల ధరల తగ్గింపు లాంటి చర్యలు లేవు. ఉప్పు తింటారు కానీ వీరి గురించి ఎవరూ పట్టించుకోరు. గతేడాది భారీ వర్షాలకు వరద తీవ్రతతో కయ్యల్లోనూ, రోడ్డు మార్జిన్లలోనూ ఉన్న ఉప్పు కువ్వలు కరిగిపోయాయి. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న బోర్లు, విద్యుత్ మోటార్లు ధ్వంసమయ్యాయి. అయితే పాలకులు కానీ, అధికారులు కానీ వీరివైపు కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవు.


హామీల్లోనే వసతులు

స్థానిక ఎంపీ ఉప్పు నిల్వల కోసం ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేస్తామని, రోడ్డు నిర్మాణం చేపడతామని హామీలు ఇచ్చారు. కానీ ఆ హామీలు నేటికీ అమలు కాలేదు. గత వర్షాకాలంలో నష్టపోయిన రైతులకు తిరిగి అదే హామీ ఇచ్చారు. కానీ నెరవేరలేదు. ఉప్పు రైతులకు విద్యుత్ బిల్లుల ఇటీవల పెను భార మయ్యాయి. బిల్లుల్లో రాయితీ ఇవ్వాలని వారు కోరుతున్నారు.



ప్లాట్‌ఫాం లేక రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఉప్పు కువ్వలు

ఎవరూ పట్టించుకోవడం లేదు..



ఉప్పు రైతులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో హామీలు ఇస్తారు కానీ, అధికారంలోకి వచ్చాక మరిచిపోతున్నారు. ఎవరైనా రాకపోతారా.. మమ్మల్ని పట్టించుకోకపోతాడా ? అని ఎదురు చూస్తున్నాం.

\- పురిణి ఏడుకొండలు, ఉప్పురైతు, తూర్పుగోగులపల్లి

రాయితీలు కల్పించాలి...


అందరూ రైతుల మాదిరిగానే ఉప్పు రైతులకు కూడా రాయితీలు కల్పించాలి. మోటార్లు, విద్యుత్ వైర్లు, బోర్లపై రాయితీలు ఇవ్వాలి. ఉప్పు నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేయాలి.

\- గోళ్ల ఆదాం, ఉప్పు రైతు, తూర్పుగోగులపల్లి

ఓటేయడానికి కావాల్సిన గుర్తింపు కార్డులివే..!

పోలింగ్ రోజున ప్రతి ఓటరూ పోలింగ్‌స్టేషన్‌కు విధిగా వ్యక్తిగత గుర్తింపు కార్డును తీసుకెళ్లాలి. లేని పక్షంలో ఎన్నికల అధికారులు ఓటును తిరస్కరించే అవకాశం ఉంది. ఓటరు తమకు నచ్చిన లేదా తమ వద్ద అందుబాటులో ఉన్న గుర్తింపు కార్డు తీసుకెళ్తే కుదరదు. ఓటరు ఎలాంటి గుర్తింపు కార్డును తీసుకెళ్లాలో ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ 13 రకాల కార్డులను మాత్రమే అధికారులు పరిగణలోకి తీసుకుంటారు. ఓటరు ఫొటో గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్సు, సర్వీసు గుర్తింపు కార్డు (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు తమ ఉద్యోగులకు జారీ చేసినవి), పాస్‌బుక్ (ఫొటోతో పాటు బ్యాంక్, పోస్టాఫీసులో జారీ చేసినవి), పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, స్మార్ట్‌కార్డు (కార్మిక శాఖ మంత్రిత్వశాఖ పథకం కింద జారీ చేసి నవి), ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ జాబ్‌కార్డు, ఆరోగ్య బీమా స్మార్ట్‌కార్డు (కార్మిక మంత్రిత్వ శాఖ పథకం కింద జారీ చేసినది), ఫొటో పిం ఛన్ పత్రం, అధికారిక గుర్తింపు కార్డు (ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన), ఎన్‌పీఆర్ కింద ఆర్జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు తీసుకెళ్లాలి. వీటిని మాత్రమే అధికారులు గుర్తించి, ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

\- వలేటివారిపాలెం



'కోడ్' బేఖాతర్..

వైసీపీ బరితెగింపు

- ఉలవపాడులో గుంటూరు, విజయవాడ యువకులు
- ఇంటింటా స్టిక్కర్ల అతికిస్తున్న వైనం
- టీడీపీ ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



వైసీపీ స్టిక్కర్లు అంతికించేందుకు విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి ఉలవపాడుకు వచ్చిన యువకులు

ఉలవపాడు : కోడ్ అమలులో ఉన్నా అధికార పార్టీ నేతలు బేఖాతరు చేస్తూనే ఉన్నారు. విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన కొంతమంది సోమవారం నెల్లూరు జిల్లాలోని ఉలవపాడులో నెల్లూరు ఎంపీ వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్, సీఎం జగన్, ఫ్యాన్ గుర్తు ఉన్న స్టిక్కర్లను ఇళ్ల గోడలపై అతికించారు. 20 మంది యువకులు బృందాలుగా ఏర్పడి బ్యాగ్‌ల నిండా కరపత్రాలు, స్టిక్కర్లు వేసుకొని తమ పని కానిచ్చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయానికి ఆనుకొని కోనేరు సెంటర్‌లో ఉన్న ఇళ్లకు వారు స్టిక్కర్లు అతికిస్తుండగా టీడీపీ నేతలు కనుగొన్నారు. దీంతో వాళ్లను నిలదీయగా తాము విజయవాడ నుంచి వచ్చామని, ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అతికించేందుకు తమను తీసుకొచ్చినట్లు చెప్పారు. దీంతో టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. విషయం జఠిలం కావడంతో అధికారులు వచ్చే సరికి అక్కడ నుంచి ఆ యువకులంతా పలాయనం చిత్తగించారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, సిబ్బంది గ్రామంలో గాలించగా ఒక బృందం వారి కంటపడంది. దీంతో ఎంపీడీవో విజయ దగ్గర హాజరు పరిచారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఈ యువకులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా సగర్వంగా సాగనంపడంపై టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. దీనిపై ఎన్నికల అధికారి అయిన ఎంపీడీవోను వివరణ కోరగా మండలంలోని వీరేపల్లి, మన్నేటికోట, చాకిచర్ల, ఉలవపాడు గ్రామాల్లో ఇంటింటా వైసీపీ ప్రచారం కోసం వారు అనుమతి పొందినట్లు తెలిపారు. కరపత్రాలు పంపిణీకి మాత్రమే అనుమతి ఉన్నప్పుడు స్టిక్కర్లు ఎలా అతికిస్తారని ప్రశ్నించగా, 41ఏ నోటీసులు అందజేస్తామని తెలిపారు.

- **కందుకూరు :** కందుకూరులో కొంతమంది ఇంటింటికీ వైసీపీ స్టిక్కర్లు అతికించడం కలకలం రేపింది. పట్టణంలోని అనేక ప్రాంతాలతో పాటు గత ప్రభుత్వం నిర్మించిన జీ ప్లస్ త్రీ గృహాల సముదాయంలోను గడపగడపకు ఈ స్టిక్కర్లు అంటిస్తూ చిన్నపిల్లలు కనిపించారు.

ఎన్నికల ఖర్చు పెరిగిందిలా...!

పోటీలో ఉన్న అభ్యర్థులు తమ గెలుపు కోసం ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అదనంగా నగదు ఖర్చు చేయకుండా ఎన్నికల సంఘం పరిమితులు విధించింది. ఒక అభ్యర్థికి గతంలో వ్యయ పరిమితి రూ.లక్ష ఉండగా, నేడు రూ.40 లక్షల వరకు పెరిగింది. వ్యయ పరిమితులను పరిశీలిస్తే... 1957లో రూ.2 లక్షలు, 1962లో రూ.3 లక్షలు, 1971లో రూ.4 లక్షలు, 1975, 1977లలో రూ.5 లక్షలుగా ఉండేది. 1984లో ఖర్చు పెంచి రూ.10 లక్షలు చేసింది. 1988లో రూ.10 లక్షలు, 1991లో రూ.12 లక్షలు, 1994లో రూ.12 లక్షలు, 1999లో రూ.15 లక్షలు, 2004లో రూ.17 లక్షలు, 2009లో రూ.9 లక్షల పెంచి ఏకంగా రూ.26 లక్షలు చేసింది. 2014, 2018ల్లో రూ.28 లక్షలుండగా 2024 ఎన్నికల్లో మరో రూ.12 లక్షలు పెంచి రూ.40 లక్షలుగా ఈసీ నిర్ణయించింది.

ఎలాగంటే..



\- ఉదయగిరి

జన చైతన్యం

బరిలో వీరు



సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరనేది సోమవారం సాయంత్రానికి లెక్క తేలింది.తిరుపతి లోక్‌సభ స్థానానికి 23మంది, ఏడు అసెంబ్లీ స్థానాలకు 133మంది పోటీలో మిగిలారు.అత్యధికంగా తిరుపతి అసెంబ్లీ నుంచీ 46 మంది పోటీలో వుండగా, చంద్రగిరిలో 24 మంది, శ్రీకాళహస్తి, సత్యవేడుల్లో 15 మంది చొప్పున, గూడూరు నుంచీ 14 మంది, వెంకటగిరి నుంచీ పది మంది, సూళ్ళూరుపేట నుంచి తొమ్మిది మంది పోటీలో వున్నారు.సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గంలో టీడీపీ నేత జేడీ రాజశేఖర్ ఆ పార్టీ రెబెల్ అభ్యర్థిగా బరిలో నిలవడం పార్టీ వర్గాల్లో కలకలం సృష్టించింది. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 46 మంది అభ్యర్థులు బరిలో వుండగా ప్రధాన రాజకీయ పక్షాలైన జనసేన, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ వంటి నాలుగైదు పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే మిగిలిన వారంతా గుర్తింపు లేని పార్టీల తరపున, ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్న వారే. జిల్లాలో మరెక్కడా లేని విధంగా ఇక్కడే ఎందుకు ఇంతమంది స్వతంత్ర అభ్యర్థులు బరిలో వున్నారన్న ప్రశ్న పలువురిలో తలెత్తుతోంది. నామినేషన్ల ఘట్టం ముగియడంతో ఇక ప్రధాన పార్టీల ఎన్నికల ప్రచారం ఊపందుకోనుంది.

తిరుపతి (ఎంపీ)

బీజేపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
వి. వరప్రసాదరావు	మద్దిల గురుమూర్తి	చింతా మోహన్	బీఎస్పీ: పెనుమూరు గుర్రప్ప; లిబరేషన్ కాంగ్రెస్: విజయకుమార్; ఎస్పీ: వేలూరు తేజోవతి
			మొత్తం : 23 మంది

తిరుపతి (అసెంబ్లీ)

జనసేన	వైసీపీ	సీపీఐ	ఇతరులు
ఆరణి శ్రీనివాసులు	భూమన అభినయ్	పి.మురళి	బీఎస్పీ: జె.వేణుగోపాలరాజు; ఎస్పీ: శ్రీనివాస్ కుమార్ గొర్ల
			మొత్తం : 46 మంది

శ్రీకాళహస్తి

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
బొజ్జల సుధీర్‌రెడ్డి	బియ్యపు మధు	పోతుగుంట రాజేష్	స్వతంత్రులు : 5; బీఎస్పీ : సురేంద్రబాబు; నేషనలిస్ట్ జనశక్తి: గానుగపెంట రమేష్; ఎస్పీ : గోవిందస్వామి
			మొత్తం : 15 మంది

చంద్రగిరి

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
పులివర్తి నాని	చెవిరెడ్డి మోహిత్ రెడ్డి	కె.శ్రీనివాసులు	లిబరేషన్ కాంగ్రెస్ : కె.ఈశ్వరయ్య; జైభారత్ నేషనల్ పార్టీ: తురకా అమరనాథ్
			మొత్తం : 24 మంది

సత్యవేడు

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
కోనేటి ఆదిమూలం	నూకతోటి రాజేష్	బాలగురవం బాబు	స్వతంత్రులు : 9; బీఎస్పీ : సుప్రియ; లిబరేషన్ కాంగ్రెస్ : విజయకుమార్; జైభారత్ నేషనల్ పార్టీ : కిరణ్
			మొత్తం : 15 మంది

నగరి

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
భానుప్రకాష్	ఆర్కే రోజా	రాకేష్ రెడ్డి	స్వతంత్రులు ముగ్గురు; నవరంగ్ కాంగ్రెస్ : జ్ఞానప్రకాష్‌రెడ్డి
			మొత్తం : 9 మంది

సూళ్ళూరుపేట


టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
నెలవల విజయశ్రీ	కిలివేటి సంజీవయ్య	చందనమూడి శివ	స్వతంత్రులు : 3; బీఎస్పీ : తొప్పాని రమణయ్య; లిబరేషన్ కాంగ్రెస్ : కందాటి రజనీకాంత్; ఎస్పీ : బి. శ్రీనివాసులు
			మొత్తం : 9 మంది

వెంకటగిరి

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
కురుగొండ్ల రామకృష్ణ	ఎన్.రాంకుమార్	పి.శ్రీనివాసులు రెడ్డి	స్వతంత్రులు : 2; బీఎస్పీ : జయచంద్ర; జైభారత్ పార్టీ : శ్రీరామరాజు; బీసీవై : సీహెచ్. శివకృష్ణ
			మొత్తం : 10 మంది

గూడూరు

టీడీపీ	వైసీపీ	కాంగ్రెస్	ఇతరులు
పాశిం సునీల్‌కుమార్	మేరిగ మురళీధర్	యు.రామకృష్ణారావు	స్వతంత్రులు : 6; బీఎస్పీ: అన్నెం మల్లికార్జున్; ఎస్పీ : సునీల్‌రాజు; ఐబీపీ: రమేష్‌బాబు; పిరమిడ్ పార్టీ : పోలమ్మ
			మొత్తం : 14 మంది



● చెప్పాడంటే.. చేయడంతే!


అన్ని హామీల తరహాలోనే జగన్ నిమ్మ రైతులకిచ్చిన మాట కూడా అటకెక్కేసింది. ఐదేళ్ల పాలనలో నిమ్మకు నీరెత్తినట్లు మిన్నకుండి పోయారు. కోల్డ్ స్టోరేజిల మాట దేముడెరుగు.. కనీసం గిట్టుబాటు ధర ఊసు కూడా లేకుండా పోయింది. పైగా అప్పటి దాకా ఉన్న పథకాలకు జగన్ జమానాలో తిలోదకాలిచ్చేశారు. ఎరువులు, పురుగుమందులు, నర్సరీల మంజూరు, ఆధునిక యాంత్రీకరణ పనిముట్లు, ఉద్యాన పంటల పెరుగుదలకు రుణసాయం.... ఇలా అన్ని ప్రోత్సాహకాలకూ జగనన్న మంగళం పాడేశారు. దీంతో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో నిమ్మరైతాంగం వెన్నువిరిచినట్లైంది. వేసవి కాలంలో తప్ప మిగిలిన సీజన్లలో కనీసం కూలి కూడా గిట్టుబాటు కాకపోవడంతో రైతుల బాధలు దారుణంగా ఉన్నాయి.



నిమ్మమార్కెట్‌లో ఎగుమతికి సిద్దంగా ఉన్న నిమ్మబస్తాలు

గూడూరులో అన్ సీజన్‌లో 80 కిలోల నిమ్మకాయల బస్తా రూ.500 కూడా అమ్మడం లేదు. రేపు మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం రూ.2000 గిట్టుబాటు ధర కల్పిస్తా... అంతేకాదు.. నిమ్మపంట నిల్వ చేసుకునేందుకు కోల్డ్‌స్టోరేజీ యూనిట్లను ఏర్పాటు చేస్తా...

2018 జనవరి 29న ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని సైదాపురం వద్ద నిమ్మ రైతులకు జగన్ ఇచ్చిన హామీ ఇది... ప్రస్తుత రేటెలా వున్నా రెండు మూడు నెలల్లో అన్‌సీజన్ ప్రారంభం కాగానే బస్తా ఐదారు వందల రూపాయలకు పడిపోతుందని నిమ్మ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదేనా జగన్ మాకు చేసిన మేలు అని వారు ప్రశ్నిస్తున్నారు.



నిమ్మకు నీరెత్తిపోయావేందన్నా...?

- గిట్టుబాటు ధర గాలికి
- అతీగతీ లేని కోల్డ్‌స్టోరేజీల యూనిట్ల హామీ
- ఐదేళ్లలో రైతు సంక్షేమం ఊసేలేదు

తగునా జగనా...

సుమారు 10వేల హెక్టార్లలో సాగవుతున్న నిమ్మపంటపై వేలాది రైతు కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి. పరోక్షంగా వ్యవసాయ కూలీలు, ఆటో యజమానులు, వ్యాపారులు కూడా లబ్ధి పొందుతున్నారు. గూడూరు, జయంపు, పొదలకూరు మార్కెట్ సముదాయాలలో వారంలో ఆరు రోజుల పాటు క్రయ విక్రయాలు జరుగుతుంటాయి. రోజూ సుమారు 200 మెట్రిక్ టన్నులకు పైగా మార్కెట్ల నుంచి దేశం నలుమూలలా ప్రధాన నగరాలకు నిమ్మకాయలు రవాణా అవుతుంటాయి. ఏడాది పొడవునా స్థిరంగా గిట్టుబాటు ధర ఉండటం లేదు. నిల్వ చేద్దామంటే శీతల గిడ్డంగులు లేవు. దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిమ్మరైతులు ఆక్రోశిస్తున్నారు. ఈ క్రమంలోనే గత సార్వత్రిక ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా ప్రతిపక్షనేత జగన్ గూడూరు మీదుగా వచ్చారు. ఆయనకు అన్నదాతలు తమ గోడు విన్నవించారు. వెంటనే జగన్ స్పందించి వారి కోరికలన్నీ నెరవేర్చుతానన్నారు. అధికారంలోకి వచ్చాక ఈ హామీల ప్రస్తావనే చేయలేదు. నిమ్మకు నీరెత్తినట్లుండి పోయారని రైతులు వాపోతున్నారు.

- గూడూరు అర్బన్

చేప్తే చేస్తాడనుకున్నాం



ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సరైన ధర ఇవ్వకుంటే ఎట్టాగయ్యా.. ఎన్నికల ముందేమో మంచి ధర వచ్చేటట్టు చూస్తాడని చేప్తే నమ్మాం. జగన్ ముఖ్యమంత్రయ్యాక నిమ్మకు నీరెత్తి పోతాడనుకోలా. ఈ జన్మలో జగన్ మాటలు నమ్మం.

- మాగుంట విజిత్‌కుమార్‌రెడ్డి, రైతు, గూడూరు

శీతల గిడ్డంగులకు ప్రయత్నాలేవి



నిమ్మపంటతో వేలాది కుటుంబాలు బతుకుతున్నాయి. ధరలు స్థిరంగా లేకపోవడంతో రైతుతో పాటు అందరూ నష్టపోతున్నాం. శీతల గిడ్డంగులు (కోల్డ్‌స్టోరేజీలు), విరివిరిగా ఏర్పాటు చేస్తే అందరం బాగుపడతాం. దురదృష్టవశాత్తూ ఇప్పటి దాకా అలాంటి ప్రయత్నాలేవీ ప్రభుత్వం చేయలేదు.

- దందోలు రఘుప్రసాద్‌రెడ్డి. నిమ్మ వ్యాపారి

ఉత్తరాదిలో డిమాండ్ ఉంటేనే ధరలు



ఉత్తర భారత రాష్ట్రాలలో డిమాండ్‌ను బట్టి ఇక్కడ రేట్లు ఉంటాయి. అక్కడ వర్షాకాలం, వంచుకాలంలో డిమాండ్ తగ్గుతుంది. కాబట్టి రేట్లు పలకవు. ప్రభుత్వమే చొరవ చూపి ధరలస్థిరీకరణపై ప్రణాళికలు తయారుచేసి అమలు చేయాలి.

- దొడ్డగ భాస్కర్‌రావు, నిమ్మ ఎగుమతిదారుడు

ఇదీ మందు

90 వేల మెజారిటీ గ్యారెంటీ

'అన్నా.. నీ ఓటు నాకే. వణక్కం అక్కా.. నాకే గదా!' అంటూ సత్యవేడు ప్రాంతంలో ఒకాయన ఎడాపెడా తిరిగేస్తున్నాడు. టీయంగడి దగ్గర నిలబడివున్న గుంపులోని ఒక పెద్దాయన అతన్ని పిలిచి, 'ఎవురు సామీ నువ్వు.. యే పార్టీ' అంటూ పలకరించాడు. ' ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశాను.' అంటూ అతను బదులిచ్చాడు. ' ఎండనబడి తిరగతావుండావు. పెద్ద పెద్ద పార్టీలవోళ్లే కొట్టుకులాడతావుంటే నడిమద్దెన నువ్వు గెలిచేదేనా అబయా.. ఏందుకీ యాసండం పాపం నీకు' అంటూ పెద్దాయన సానుభూతితో మంచి మాటలు చెప్పాడు. 'చూస్తావుండు పెద్దాయనా.. 90 వేల మెజారిటీతో గెలవబోతా వుండా.. గ్యారెంటీ.. రాసుకో కావాలంటే' అని అతను సవాలు కూడా విసిరాడు. ఏందిరా సామీ ఈ మనిషి ధైర్నెం అని అక్కడ ఉన్నోళ్లంతా ఆశ్చర్యపడిపోతా ఉంటే , 'జాతకం చూపించుకున్నా.. 90 వేలు గ్యారెంటీ అని చెప్పినారు. దిగుల్లేదు బొండి' అని చెప్పి అతను మరొకర్ని ఓటడగడానికి వెళ్లిపోయాడు. తాగుతున్న టీ గుటకేసేది కూడా మరిచిపోయి అక్కడున్నోళ్లు వెళ్లిపోతున్న అతనివైపు జాలిగా చూస్తూ ఉండిపోయారు.

- సత్యవేడు



నోట్ దిస్ పాయింట్

రౌడీలూ.. జాగ్రత్త!

నేరచరిత్రగల వ్యక్తులపై ఎన్నికల సమయంలో ప్రత్యేక నిఘా ఉంటుంది. రౌడీషీట్ ఉన్నవారిని బైండోవర్ చేస్తున్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలిగించబోను అంటూ నేరచరిత్ర ఉన్నవారి దగ్గర ఒక బాండ్ రాయించుకోవడాన్ని బైండోవర్ అంటారు. భారతీయ నేర శిక్షాస్మృతిలోని 107, 108, 109, 110 సెక్షన్ల కింద బైండోవర్ కేసులు నమోదు చేస్తారు. బాండ్ సమర్పించిన తర్వాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేస్తారు. ఇది రాసిచ్చిన రోజు నుంచి ఆరు నెలల పాటు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. నేరం చేసినా, కేసు నమోదైనా 24 గంటల్లో అరెస్టు చేస్తారు. హామీపత్రంలో పేర్కొన్న నగదు మొత్తాన్ని వసూలు చేస్తారు. పదే, పదే కేసులు నమోదై ఎన్నికల సమయంలో గలాటాలు, ఘర్షణలకు పాల్పడితే ఆస్తులు కూడా జప్తు చేసే అధికారం ఎన్నికల అధికారులకు ఉంటుంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి తిరుపతి జిల్లాలో ఇప్పటివరకూ 753 బైండోవర్ కేసులు నమోదు చేశారు. గత రెండు దఫాలుగా జరిగిన ఎన్నికల్లో పోలింగ్ బూత్ వద్ద హింసకు పాల్పడిన వారి కదలికలపై ఇప్పటినుంచే నిఘా పెట్టారు.

- తిరుపతి(నేరవిభాగం)

ఓటు అమ్ముకున్న వారు శవంతో సమానం

ఓటు అమ్ముకున్న వారు శవంతో సమానం. సొమ్మున్న సోగ్గాళ్ళ గేమ్‌గా నడుస్తున్న ఈ ఎన్నికల్లో ఓటరు నీతిమంతంగా ఉంటే నేతలూ మారతారంటూ జై భారత్ సంస్థ ప్రచారం చేస్తోంది. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆ సంస్థ జాతీయ నేత లోకనాథ్‌తో పాటు పలువురు ప్రతినిధులు సోమవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు)



చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న న్యాయమూర్తి లోకనాథం

గూడూరు, ఏప్రిల్ 29: ప్రతిఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తి లోకనాథం అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మే 11న జర గాల్సిన జాతీయ లోక్అదాలత్ జూన్ 29వ తేదీకి మార్చామన్నారు. కక్షిదారులు గమనించాలన్నారు. జాతీయ లోక్అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, ఉమాశంకర్, వెంకటసుబ్బయ్య, సంజీవయ్య, శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సాహం



విజేతలకు బహుమతులను అందజేసిన వంకి పెంచలయ్య

గూడూరు, ఏప్రిల్ 29: తమ కళాశాలలో విద్యార్థులకు చదువులతోపాటూ క్రీడల్లో ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు ఆదిశంకర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య చెప్పారు. సోమవారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడలతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వేణుమాధవ్, నరసింహులు, రవిచంద్ర, సురేశ్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికల నిర్వహణ

గూడూరు అర్బన్, ఏప్రిల్ 29: ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టినట్లు ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జ్యోతి చెప్పారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతులను కల్పించడం జరిగిందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్వో కిరణ్‌కుమార్, తహసీల్దారు కరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

పెళ్లకూరు, ఏప్రిల్ 29: ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డ్వామా ఏపీడీ రవికుమార్ నాయుడు సూచించారు. మండలంలోని రావులపాడులో ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పనులు చేసేటప్పుడు వడదెబ్బ తగిలితే ప్రమాదమని ప్రతి ఒక్కరూ తలకు కాటన్ దుస్తులు కట్టుకుని తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జాబ్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి పని దినాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. జేఈ భాస్కర్, బీఎఫ్‌టీ వెంకటేశ్వర్లు, నెలబల్లి ఎఫ్ఏ తిరుపాల్ తదితరులున్నారు.

అర్హులందరికీ పింఛన్ల పంపిణీ

గూడూరు అర్బన్/వాకాడు, ఏప్రిల్ 29: అర్హులైన పంఛనుదారులకు మే 1వ తేదీ నుంచి 5వ తేదీలోగా ఫించన్లు అందిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆధార్‌తో లింక్ అయిన పింఛనుదారుల బ్యాంకు ఖాతాలకు 1వ తేదీ నగదు జమ అవుతుందన్నారు. మిగిలిన పింఛను దారులకు సచివాయ సిబ్బంది వారి ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తా రన్నారు. మే, జూన్ నెలల పింఛన్ నగదును మే 1వ తేదీ లబ్ధిదారులకు నేరుగా నగదు రూపంలో కాకుండా బ్యాంక్ ఖాతాలో జమచేయనున్నామని ఎంపీడీవో వెంకటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఆయాపై ఫిర్యాదు

వాకాడు, ఏప్రిల్ 29: మండలంలోని వాలమేడు పంచాయతీలో సోమవారం వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా అంగన్ వాడీ ఆయా పాల్గొని అత్యుత్సాం ప్రదర్శించింది. ఆ వీడియో సోషల్ మీడియాలో రావడంతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎంపీడీవో వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువచ్చారు. ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ పద్మ వివరణ తీసుకొని ఐసీడీఎస్ పీడీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదన్నారు.

కమనీయం... శివపార్వతుల కల్యాణం

స్తంభాల గిరీశ్వరయ్యస్వామి తిరునాళ్లకు పోటెత్తిన జనం



స్తంభాల గిరీశ్వరయ్య స్వామి కల్యాణానికి హాజరైన భక్తజనం


స్వామివారిని దర్శించుకుంటున్న కురుగొండ్ల సింధు


తిరునాళ్లకు హాజరైన భక్తులు

డక్కిలి, ఏప్రిల్ 29: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన దేవునివెల్లంపల్లిలోని స్తంభాల గిరీశ్వరయ్యస్వామి ఆలయ తిరునాళ్లలో సోమవారం రాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య జరిగిన కల్యాణాన్ని చూసి భక్తులు పరవశించి పోయారు. కల్యాణానికి ఉభయకర్తలుగా ఆలయ మాజీ చైర్మన్ నర్రావుల ప్రకాశం నాయుడు దంపతులు, కె.రాంబాబునాయుడు దంపతులు వ్యవహరించారు. కల్యాణం అనంతరం స్వామివారికి చదివింపులు ఇచ్చేందుకు భక్తులు పోటీపడ్డారు. ఉదయం ఎండతీవ్రతకు భయపడి మందకొడిగా వచ్చిన భక్తులు సాయంత్రం ఆరు గంటల తరువాత క్యూలో గంటల తరబడి వేచి ఉండి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వెంకటగిరి సీఐ సంగమేశ్వరరావు, డక్కిలి ఎస్ఐ చౌడయ్య సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. తిరునాళకు కడప, నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల నుంచే కాకుండా చెన్నై నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అన్నదానం జరిగింది. కాగా తిరునాళకు మరింత ప్రచారం అవసరమని మాజీ ఎమ్మెల్యే, వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అభిప్రాయపడ్డారు. స్వామివారిని ఆయన దర్శించుకున్న అనంతరం మాట్లాడుతూ... తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేసినట్టు గుర్తు చేశారు. తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి పి.రాజేశ్వరరావు, ఏ.సత్యనారాయణ, పి.కోటేశ్వరరెడ్డి, ఏ.రామచంద్రయ్య నాయుడు, బీరం రాజేశ్వరరావు, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు వున్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక చట్టం: నెలవల


సభలో అభివాదం చేస్తున్న కూటమి నాయకులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 29: టీడీపీ అధికారంలోకి రాగానే బీసీల కోసం ప్రత్యేక చట్టం తెచ్చి వారి అభివృద్ధికి అన్ని విధాలా చేయూతనిస్తారని మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం అన్నారు. సోమవారం రాత్రి సూళ్లూరుపేటలో వంకా సుధాకర్, బీసీ నాయకుడు పి.శ్రీనివాసులు అధ్యక్షతన బీసీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టీడీపీ ఐదు నియోజకవర్గాల సమన్వయకర్త, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్, తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ టీడీపీకి బీసీలే వెన్నెముక అన్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ... బీసీలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. బీసీలు నాయకులు కొక్కు శంకరయ్య, గురుకల సుబ్రమణ్యం, సామంతమల్లా సుబ్రమణ్యం, గురుకల కృష్ణయ్య, వంకా శ్రీనివాసులు, తిరుపాల్, వంకా రామాంజనేయులు, నెలబోయిన రాజసులోచన, కౌన్సిలర్ చిట్టిబాబు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, ముప్పాళ్ల శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ



ప్రచారంలో వెలగపల్లి వరప్రసాద రావు - సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణతో వరప్రసాద రావు దంపతులు

కలువాయి, తిరుపతి (ఉపాధ్యాయనగర్) ఏప్రిల్ 29 : గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం వెంకటగిరి నియోజకవర్గం కలువాయి మండలంలో టీడీపీ, జనసేన నాయకులతో కలసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం సిలికా, ఇసుకను దోపిడీ చేసిందని విమర్శించారు. దీనిపై ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నా తనదే తప్పు అన్నట్లుగా వ్యవహరించారని తద్వారా వనరులన్నీ దోపిడీకి గురయ్యాయన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 70 యేళ్లల్లో జరగనంత అవినీతి ఐదేళ్లలో జరిగిందని ప్రజలు ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలని కోరారు. కేంద్రంలో బీజేపీని, రాష్ట్రంలో టీడీపీని గెలిపించాలని ఆయన ప్రజలకు విన్నవించారు. గతంలో తాను ఎంపీగా పనిచేసిన రోజుల్లో ఎంతో అభివృద్ధి చేశానని కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్నో పెద్ద ఎత్తున నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేశానన్నారు. ఆయనతోపాటు టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

సినీ నటుడు బాలకృష్ణతో భేటీ

సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను వరప్రసాదరావు కుటుంబసభ్యులతో కలసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సోమవారం తిరుపతికి వచ్చిన ఆయన ఓ ప్రైవేట్ హోటల్‌లో ఉండగా కుటుంబసభ్యులు సతీమణి కొల్లూరి లక్ష్మి, కుమారుడు నవీన్‌గుప్తా, ఇతరలు భేటీ అయ్యారు. తమిళనాడు రిటైర్డ్ డీజీపీ శేఖర్ తదితరులు ఆయన్ను కలుసుకున్నవారిలో ఉన్నారు.

తమిళ రేషన్ బియ్యం స్వాధీనం



దొరవారిసత్రం, ఏప్రిల్ 29: మండల పరిధిలోని పోలి రెడ్డి పాలెం పొలాల్లో విజిలెన్స్, సివిల్ సప్లయ్స్ అధికారులు దాడులు చేసి తమిళనాడు రేషన్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ వెంకటాద్రి, ఎస్ఐ నాయక్ ఆధ్వర్యంలో పోలిరెడ్డిపాలెంలో వేనాటి భాస్కర్‌రెడ్డి పొలాల్లో 293 సంచుల్లో ఉన్న 14,400 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సూళ్లూరుపేట సివిల్ సప్లయ్స్ గోదాములకు తరలించారు. భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. సీఎస్ డీటీ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీరు రాజీనామా

చిల్లకూరు, ఏప్రిల్ 29: మండలంలోని ఓడూరు సచివాలయం పరిధిలోని వలంటీరు సోమవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో భానుమూర్తిరావు తెలిపారు. రాజీనామా పత్రం అందిజేసినట్లు ఆయన తెలిపారు.

మరో అవకాశమిస్తే మీ ఆస్తులు తాకట్టే: కురుగొండ్ల



నిడిగల్లులో టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు - రోడ్‌షోలో మాట్లాడుతున్న కురుగొండ్ల రామకృష్ణ

బాలాయపల్లి, ఏప్రిల్ 29: వైసీపీకి మరో అవకాశమిస్తే ప్రజల ఆస్తులు తాకట్టు పెట్టేస్తాడని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని సిద్దాగుంట, తాళ్లపల్లి, నిడిగల్లు, గాజులపల్లి, కాలగంద, పిగిలాం, పిగిలాం కొత్తపాళెం, జార్లపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన ఆయనకు ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రం, బిడ్డల భవిష్యత్తు బాగుపడాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రూ.4వేల పింఛనను ఇంటికే చేరుతుందన్నారు. అంతేకాకుండా మహిళలకు బస్సుల్లో ఉచితప్రయాణం, ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. రాక్షసుడిని గద్దె దించేందుకు బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి ఏర్పడడం జరిగిందన్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కారం కావాలన్నా, అభివృద్ధి చెందాలన్నా టీడీపీ పరిపాలన ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకుని వచ్చేనెల 13న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థికి సైకిల్ గుర్తుపై ఒక ఓటు, ఎంపీ అభ్యర్థికి కమలం గుర్తుపై ఒక ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు, నియోజక వర్గ బీజేపీ కన్వీనర్ ఎస్ఎస్ఆర్ నాయుడు, జనసేన కన్వీనర్ జి.వెంకటేశ్వర్లు, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, రాయి సత్యంనాయుడు, కూను శ్రీహరి, దాసరి రాజగోపాల్‌నాయుడు, దాసరి ప్రభాకర్‌నాయుడు, జనార్థన్ రెడ్డి, వెంకటక్రిష్ణారెడ్డి, దాసరి కోటేశ్వరావు, సర్పంచు వి.కమలేశ్వరి, పెంచలయ్య, ఎంపీటీసీ సభ్యుడు రామయ్య, శేషమనాయుడు, వెంకటేశ్వర్లు, మాదవనాయుడు, వెంకటేష్ గౌడ్, సి.సి.నాయుడు, కొర్రపాటి రామచంద్ర నాయుడు,వేళ్ల సురేంద్ర రెడ్డి, హఫీజ్, ఉప ఎంపీపీ బి. మురళీమోహన్ రెడ్డి, బి.కళ్యాణ్‌రెడ్డి, ఎన్. మురళి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

బాలాయపల్లి మండలంలోని సిద్దాగుంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కె.వెంకటేశ్వర్లు రెడ్డి, కాలగంద గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఓపాటి పెంచలయ్య, ఆర్. వెంకటసుబ్బయ్య, అక్కుర్తి రంగయ్యలకు సోమవారం కురుగొండ్ల రామకృష్ణ పసుసు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులతో కురుగొండ్ల



వెంకటగిరి ఎన్నికల సమన్వయకర్తగా ఊకా విజయ్‌కుమార్



తిరుపతి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ ఎన్నికల సమన్వయకర్తగా తిరుపతికి చెందిన ఆ పార్టీ సీనియర్ నేత ఊకా విజయకుమార్ నియమితులయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం 13 నియోజకవర్గాలకు ఎన్నికల సమన్వయ కర్తలను నియమించారు. ఇందులో వెంకటగిరికి ఊకా నియమితులయ్యారు. ఎన్నికల నిర్వహణకోసం అందరినీ సమన్వయం చేసుకుని, టీడీపీ విజయం కోసం కృషి చేస్తానని విజయ్ చెప్పారు.

నేలపట్టులో పోలీసు కవాతు

దొరవారిసత్రం, ఏప్రిల్ 29: మండల పరిధిలోని నేలపట్టు, మైలాంగం, శ్రీధనమల్లి, మావిళ్లపాడు, సింగనాలత్తూరు గ్రామాల్లో సోమవారం కేంద్ర బలగాలచే పోలీసు కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్ని కల నేపధ్యంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భ యంగా వినియోగించుకు నేందుకు ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు పోలీసు కవాతు నిర్వహించారు. ఎస్ఐ తిరుమలరావు గ్రామాల్లో కవాతు నిర్వహించి ప్రజలను చైతన్యం చేశారు.

సైకో పాలనకు చరమగీతం పాడుదాం



కోట, ఏప్రిల్ 29 : రాష్ట్ర ప్రజలకు ఐదేళ్లపాటు సైకో పాలన అందించిన సీఎం జగన్‌ను ఓటుతో రాష్ట్రం నుంచి తరిమికొడదామని టీడీపీ నేతలు పిలుపునిచ్చారు. కోట పట్టణ పరిధిలోని మహాలక్ష్మమ్మ గుడివీధి, దళితవాడ, నార్త్ గిరిజన కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ బలప రచిన ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావును గెలిపించాలని అభ్యర్థించారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రాను తిరిగి గాడిలో పెట్టాలంటే ఒక్క చంద్రబాబుకే సాధ్యమన్నారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, జిల్లా కార్యదర్శి మద్రి పోలయ్య, ఉపాధ్యక్షుడు మద్రి అనిల్, కార్యనిర్వాహణ కార్యదర్శి తీగల సురేష్‌బాబు, మాజీ ఎంపీపీ మానికల పవన్‌కుమార్, దారా సురేష్, నౌషాద్, సూర్య తదితరులు ఉన్నారు.

దుష్టపాలనను అంతమొందిస్తాం



కోట, ఏప్రిల్ 29: ప్రజలు చైతన్యంతో సీఎం జగన్ దుష్టపాలనను అంత మొందించేందుకు ఓటు అనే ఆయుధంతో ముందుకు రావాలని టీడీపీ మండల బీసీ సెల్ కార్యదర్శి వి.కోటేశ్వరప్రసాద్ పిలుపు నిచ్చారు. మండల పరిధి లోని కేశవరంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, వరప్రసాదరావును గెలిపించాలన్నారు. గూడలి అరుంధతీయవాడ, కొండమిట్ట గిరిజన కాలనీల్లో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పి.వెంకటకృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు కసుమూరు వెంకటేశ్వర్లు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

సూపర్-6 పథకాలే విజయాన్ని అందిస్తాయి: పాశిం



చిల్లకూరులో కరపత్రాల పంపిణీలో పాశిం సునీల్‌కుమార్ తదితరులు - గూడూరులో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

చిల్లకూరు, ఏప్రిల్ 29: టీడీపీ అధినేత చంద్రబాబు, ఉమ్మడి కూటమి ప్రకటించిన మినీ మెనిఫెస్టోలోని సూపర్-6 పథకాలే రానున్న ఎన్నికలలో విజయాన్ని అందిస్తాయని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని తీపనూరు, ఏగువరాజుపాళెం, ముత్యాలపాడు, నాంచారమ్మపేటల్లో సూపర్-6 పథకాలపై అవగాహన కల్పిస్తూ ఇంటింట ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశక్తి పథకం ద్వారా మహిళలకు, యువగళం ద్వారా యువతకు, అన్నదాత ద్వారా రైతులకు, బీసీల రక్షణ చట్టం వంటి ఎన్నో పథకాలు టీడీపీ అధికారంలోకి వస్తే అమలవుతాయన్నారు. రానున్న ఎన్నికలలో ఉమ్మడి కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు.ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, జి.లీలావతి, కె.కోటేశ్వరరాజు, పి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రాగయ్య, వెంకటేశ్వర్లు, చిరంజీవి, శ్రీనివాసులు, కీరవాణి, శైలజ, సుప్రజ, మునిశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాగా తిప్పగుంట పాళెంలో వైసీపీ కి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

టీడీపీతోనే మహిళాసాధికారత సాధ్యం....

వాకాడు: రాష్ట్రంలో మహిళాసాధికరిత టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సాధ్యమవుతుందని టీడీపీ అభ్యర్థి పాశిం సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం వాకాడులో సమావేశం నిర్వహించి ఇంటింట ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ దుష్టపాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకుని స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాధించుకుందామన్నారు. టీడీపీ అధికారంలో వస్తే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. కూటమి అభ్యర్థులు పాశిం సునీల్‌కుమార్, వరప్రసాదరావును గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కరిముల్లా, జి.లీలావతి, ఎం.శ్రావణి, శైలజ, భారతి, సుబ్బమ్మ, బి.ప్రమీల, చిరంజీవమ్మ, సునీత, కవిత, డి.మధుసూదన్‌రెడ్డి, కుంచం దయాకర్, రౌతు శివకుమార్, కె.ప్రసాద్, రహంతుల్లా, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో దళితులపై దాడులు పెరిగాయి......

గూడూరు: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగాయని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్రనాయకుడు జెన్ని రమణయ్య అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, హత్యలను వివరిస్తూ రానున్న ఎన్నికలలో దళితలందరూ టీడీపీకి మద్దతుగా నిలిచేలా ప్రతిఒక్కరం కష్టపడి పనిచేద్దామన్నారు.యి అంతకు ముందు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో శ్రీపతి బాబు, గోను శివకుమార్, కోటేశ్వరరావు, పెంచయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


వాకాడులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారాణి